వెన్నెల వేసవి
రూ॥60/-
పేజీలు:54

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

**నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి ఎమ్మెల్సీలకు నిధులు మంజూరు చేయాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి డిప్యూటీసిఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు సూచించారు. ఎమ్మెల్సీల అభ్యర్థన మేరకు ఈ ప్రతిపాదన చేస్తున్నానని చైర్మన్ తెలిపారు. ఇందుకు భట్టివిక్రమార్క స్పందిస్తూ చైర్మన్ ఆదేశాలు జారీ చేస్తే నిధులను తప్పకుండా విడుదల చేస్తామని చెప్పారు. గతంలో రూ.3 కోట్ల నిధులను ఇస్తామని చెప్పిన ప్రభుత్వం మొదటి విడతగా రూ.2 కోట్లను తక్షణం ఇవ్వాలని, రెండో విడతలో రూ.1కోటి మంజూరు చేయాలని చైర్మన్ సూచించారు. ప్రభుత్వం తప్పకుండా నిధులను మంజూరు చేస్తుందని డిప్యూటీ సిఎం హామీ ఇచ్చారు.**

సంపుటి 29, సంచిక: 85 | ఆదివారం | 13 -09-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

### 22ఎ జాబితాలో

# నిషేధిత భూములు తగ్గాయ్



- రిజిస్ట్రేషన్లు నిలిపివేశారనే ఆరోపణలు అవాస్తవం ● ప్రజలు, ప్రభుత్వ భూముల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం
- ఏ స్వార్థం లేకుండా ప్రజాసమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం పనిచేస్తోంది ● బిఆర్‌ఎస్ హయాంలో 22ఎ జాబితాలో ప్రభుత్వ అసైన్డ్, ఇతర వ్యవసాయేతర భూములు కలిపి 1.95 లక్షల ఎకరాలు, ప్రైవేట్ భూములు 3.95 లక్షల ఎకరాలు
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయేతర భూములు 1.94 లక్షలు, ప్రైవేట్ భూములు 3.73 లక్షలు మాత్రమే ● 22ఎ సమస్యలపై స్వల్పకాలిక చర్చలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వివరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజలు, ప్రభుత్వ భూముల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని, ఇది ప్రజల ప్రభుత్వమని, ఏ స్వార్థం లేకుండా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. పారదర్శకతతో ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. శాసనసభలో శనివారం 'రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఎ కు సంబంధించిన సమస్యల'పై స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 22ఎకు సంబంధించి పూర్తి వివరాలను వెల్లడించారు. 22 ఎ వివాదాలకు సంబంధించి పలువురు ఎమ్మెల్యేలు చేసిన వీడియోలతో పాటు జిఒలు, గెజిట్ పత్రాలు సభలో ప్రదర్శిస్తూ వివరణ ఇచ్చారు. ఉమ్మడి ఎపి రాష్ట్రంలోనే 1999లో ఘట్‌కేసర్‌లోని రైల్వే స్టేషన్‌ను రిజిస్ట్రేషన్ చేసిన క్రమంలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు అప్పటి ప్రభుత్వం నిషేధిత జాబితా రిజిస్ట్రేషన్ చట్టంలో 22ఎ అనేది అందుబాటులోకి తీసుకువచ్చిందని చెప్పారు. ఈ నిషేధిత జాబితాను 2007లో సుప్రీంకోర్టు కొన్ని రాష్ట్రాలలో నిషేధిస్తూ నిర్ణయం తీసుకోవడంతో 2009లో తమ భూములు ఆ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించడంతో ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం నిషేధిత భూములకు సంబంధించి 2015 వ సంత్సవరంలో 22ను ఎ, బి, సి, డి, ఇ 5 విభాగాలుగా విభించిందని మంత్రి వివరించారు. ఇదే క్రమంలో అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఇందుకు సంబంధించి నియమ నిబంధనలను ఖరారు చేస్తూ 2016లో జిఒ ఇచ్చిందే తప్ప దానిని 2018 నాటికి కూడా అమలు చేయలేదన్నారు. 'ధరణి' తీసుకువచ్చి దోచుకునుందుకే బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ ఉత్తర్వుల అమలును అలస్యం చేసిందన్నారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్న 2026 డిసెంబర్ 7 తేదీ నాటికి 22ఎ నిషేధిత జాబితాలో ప్రభుత్వ, అసైన్డ్ ఇతర వ్యవసాయేతర భూములు కలిపి 1,95,812 ఎకరాలు, ప్రైవేట్ భూములు 3,95,852 ఎకరాలు ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయయేతర భూములు 1,94,513, ప్రైవేట్ భూములు 3,73,930 ఎకరాలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో 22ఎ జాబితాలో

తరువాయి 8లో

**శాసనసభ ఈనెల 16కు వాయిదా** | **శాసనమండలి నిరవధిక వాయిదా**



# ఏకపక్ష సుంకాలపై బ్రిక్స్ దేశాలు ఆందోళన

### అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధంగా టారిఫ్‌లు పెంచడాన్ని ఖండించిన సభ్యదేశాలు

**యుద్ధంపై బ్రిక్స్ ఢిల్లీ డిక్లరేషన్**

- 'అమెరికా దాడి' ప్రస్తావన లేకుండా తీర్మానం
- ఇరుపక్షాలు గరిష్ఠస్థాయి సంయమనం పాటించాలి
- సరఫరా గొలుసు పునరుద్ధరణకు కలిసి పనిచేద్దాం
- డాలర్ కాదు, స్థానిక కరెన్సీలోనే బ్రిక్స్ వాణిజ్యం
- పశ్చిమాసియాలో నావికుల భద్రతకు భరోసా ఇవ్వాలి
- భద్రతామండలిలో సంస్కరణలకు పిలుపు
- ఉగ్రవాద ప్రతిఘటన బాధ్యతలను దేశాలు నిర్వర్తించాలి
- భారత్‌కు దౌత్య విజయం : మీడియా అభివర్ణన

**న్యూఢిల్లీ :** అమెరికాపేరు ప్రస్తావన లేకుండా 18వ బ్రిక్స్ సదస్సు పశ్చిమాసియాలో ఏకపక్ష యుద్ధ చర్యలను ఖండించింది. ఇరాన్‌‒యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన నాయకులు తమ తమ ప్రసంగాలలో తొలుత కఠిన వైఖరులకు కట్టుబడినప్పటికీ,ఈ భిన్న వాదనలు,వైఖరులను అధిగమించి యుద్ధంపై చేసిన ఏకాభిప్రాయ తీర్మానం అతిథేయ దేశం భారత్‌కు గొప్ప దౌత్యవిజయం. హోర్ముజ్‌లో వాణిజ్య రవాణా,నావికుల భద్రత, ట్రంప్ వాణిజ్య సుంకాలు, గాజాలో ఇజ్రాయెల్ ఉల్లంఘనలు, హింసాకాండ, ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదం,ఐక్యరాజ్యసమితి సంస్కరణలపై సదస్సు తీర్మానాలు చేసింది.అమెరికా డాలర్‌లో కాకుండా స్థానిక కరెన్సీలోనే బ్రిక్స్ దేశాల వాణిజ్యం జరగాలని తీర్మానం పేర్కొంది. హోర్ముజ్ జలసంధిలో నావికులకు భద్రత ఇవ్వాలని,వారికి భరోసా ఉండాలని, దీనిని నిర్ధారించాలని కోరింది. పశ్చిమాసియా యుద్ధంలో ఇరు పక్షాలు గరిష్ఠ సంయమనం పాటించాలని, అంతర్జాతీయ చట్టాలకు లోబడి అందుకు అనుగుణంగా చర్చలు, దౌత్యమార్గాల ద్వారా యుద్ధం ముగించాలని పేర్కొంది. ప్రపంచ వాణిజ్యం,గొలుసుకట్టు సరఫరా వ్యవస్థ సజావుగా సాగిపోయేందుకు కలిసి కృషి చేయాలని సభ్యదేశాలు తీర్మానించాయి. ప్రపంచంలోనే అతిపెద్ద కూటమిగా తెరమీదకు వచ్చిన బ్రిక్స్, అమెరికా‒ఇరాన్ యుద్ధం ఏడవనెలలోకి

తరువాయి 8లో

## కాలువలో జారిపడి ఇద్దరు విద్యార్థులు మృతి

### మరొక విద్యార్థిని రక్షించిన స్థానికులు


సూర్యాపేట జిల్లా ముకుందాపురం గ్రామంలో విషాద ఛాయలు



ప్రజాపక్షం/మునగాల

ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌లో జారిపడి ఇద్దరు విద్యార్థులు మృతిచెందిన ఘటన సూర్యాపేట జిల్లా ముకుందాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోదాడ పట్టణానికి చెందిన హరీష్‌నాయుడు, గుడిబండ గ్రామానికి చెందిన లేక స్వరూప్ లు తన స్నేహితుడైన ముకుందాపురం గ్రామానికి చెందిన రణబోతు అప్పిరెడ్డి కుమారుడైన అనుదీప్ ఇంటికి శనివారం వచ్చారు. వీరు ముగ్గురు సరదాగా ఈత కొట్టేందుకు ముకుందాపురంలోని ముక్త్యాలబ్రాంచ్ కెనాల్‌కు వెళ్లారు. కెనాల్‌లోకి దిగిన వీరు కాలుజారీ మునిగిపోయారు. గమనించిన స్థానికులు అనుదీప్‌ను రక్షించగా,

తరువాయి 8లో



# ఇక చిన్న తప్పులకు జరిమానాలే

**జైలు శిక్షలుండవ్**

- పలు నిబంధనలలోని నేరపూరిత పరిధి నుంచి చిన్న చిన్న సాంకేతిక ఉల్లంఘనలను తొలగింపు
- తెలంగాణ 'ప్రజా విశ్వాసం' బిల్లును సభలో ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్‌బాబు ● సిపిఐ, కాంగ్రెస్, బిజెపి, ఎంఐఎం మద్దతు ● శాసనసభ ఆమోదం
- 'ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు మరింత ప్రోత్సాహం : మంత్రి దుద్దిళ్ల

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ చట్టాల తరహాలోనే రాష్ట్రంలోని పలు నిబంధనలలోని చిన్న చిన్న, సాంకేతిక ఉల్లంఘనలను నేరపూరిత పరిధి నుంచి తొలగించేందుకు ఉద్దేశించిన 'తెలంగాణ ప్రజా విశ్వాసం (నిబంధనల సవరణ) బిల్లు'ను శాసనసభ ఆమోదించింది. శాసనసభలో శనివారం 'తెలంగాణ ప్రజా విశ్వాసం (నిబంధనల సవరణ) బిల్లు' ను మంత్రి ప్రవేశపెట్టగా చర్చ అనంతరం బిల్లును సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. బిల్లుకు సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివ రావు, కాంగ్రెస్ సభ్యులు ఆది శ్రీనివాస్ రావు, దానం నాగేందర్, బిజెపి సభ్యులు పాయల్ శంకర్, పాల్వాయ్ హరీశ్ బాబు, ఎంఐఎం సభ్యులు కౌసర్ మొహియుద్దీన్ మద్దతు తెలిపారు. తొలుత రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సభలో బిల్లు ప్రవేశపెడుతూ ఉద్దేశాలను వివరించారు. రాష్ట్రంలో పరిపాలనను మరింత బలోపేతం చేయడంతో పాటు పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. చిన్న తప్పులకు జైలు శిక్షల స్థానంలో జరిమానాలను మాత్రమే విధిస్తూ మార్పులు తీసుకురానున్నట్లు చెప్పారు. తద్వారా పారిశ్రామికవేత్తలకు, వ్యాపారులకు ఊరట లభించడమే కాకుండా వ్యాపార సౌలభ్యం (ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్),

తరువాయి 8లో

## చట్ట సవరణ శుభపరిణామం

- సిపిఐ శాసనసభాపక్షనేత కూనంనేని
- అటవీ, ఎక్సైజ్ చట్టాల్లోని అన్యాయమైన నిబంధనలనూ సవరించాలని విజ్ఞప్తి



ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా చిన్న చిన్న నేరాలకు జైలు శిక్షలకు బదులుగా ఆర్థిక జరిమానాలు విధించేలా చట్టాలను సవరించడం మంచి నిర్ణయమని సిపిఐ శాసనసభా పక్షనాయకులు కూనంనేని సాంబశివరావు అన్నారు. అటవీ, ఎక్సైజ్ చట్టాల్లోని అన్యాయమైన నిబంధనలను కూడా సవరించాలని కోరారు. శాసనసభలో శనివారం తెలంగాణ ప్రజా విశ్వాసం (నిబంధనల సవరణ) బిల్లు 2026పై జరిగిన చర్చలో కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. గతంలో వ్యాపార కార్యకలాపాల అనుమతులు, నిబంధనలకు సంబంధించి జఠిలంగా ఉండేవని, మరోవైపు

తరువాయి 8లో



### గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణ, సమన్వయానికి

# ప్రత్యేక అధికారులు

- వేడుకలు ముగిసేవరకూ మున్సిపల్, పోలీస్ శాఖలు నిరంతర పర్యవేక్షణ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం
- నిమజ్జన ప్రక్రియ సాఫీగా సాగడానికి చెరువుల వద్ద క్రేన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మహానగరంలో గణేశ్ ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖలు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. గణేశ్ ఉత్సవాలు పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో లో గణేశ్ మండపాలకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామని, అయితే, మంటప నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలని చెప్పారు. ఎక్కడెక్కడ మంటపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే సమాచారం అందిస్తే పోలీసులకు ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణకు సులభంగా ఉంటుందని అన్నారు. అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మలకు ఏర్పాటు చేసినట్లే గణేశ్ నిమజ్జనాలకు అనుగుణంగా నిర్మాణ సమయంలోనే అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నిమజ్జన ప్రక్రియ సాఫీగా సాగడానికి చెరువుల వద్ద చుట్టూ క్రేన్లను ఏర్పాటు చేయడానికి అనుగుణంగా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సిఎం ఆదేశించారు. శాసనమండలి సమావేశ హాల్‌లో హైదరాబాద్ మహానగరంలో గణేశ్ ఉత్సవాల ఏర్పాట్లపై ముఖ్యమంత్రి

తరువాయి 8లో

### 'క్యూర్'లో ఆస్తిపన్నులు

# అదనపు వసూళ్లుండవ్

- కనిష్టంగా 10శాతం మించవు ● 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లే లక్ష్యం : మంత్రి శ్రీధర్ బాబు ● 'క్యూర్ బిల్లుకు' శాసనసభ ఆమోదం
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 'క్యూర్ యాక్ట్ 2026'

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచ స్థాయి మెట్రోపాలిటన్ నగరంగా శరవేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్‌లో రాబోయే 20 నుంచి 30 ఏళ్ల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వికేంద్రీకృత నగర పాలనను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. క్యూర్ పరిధిలోని ట్రై కార్పొరేషన్లలో ఆస్థి పన్నులను అదనంగా వసూలు చేయబోమని, కనీష్టంగా పది శాతం పన్నులు మించబోవని స్పష్టం చేశారు. నగర పరిపాలనను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన 'కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ (క్యూర్) బిల్లు 2026'ను శనివారం ఆయన శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు సిపిఐ, కాంగ్రెస్, ఎంఐఎం సభలో మద్దతు ప్రకటించగా, బిజెపి సభ్యులు వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అయితే బిజెపి బహిష్కృత ఎమ్మెల్యే రాజాసింగ్ మాత్రం ఈ బిల్లుకు మద్దతు పలికారు. అంతకుముందు మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌లో భాగంగా 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్ డాలర్లకు,


తరువాయి 12లో

### 'సౌదీ' కీలక చమురు

# పైప్‌లైన్ మూసివేత

**మరింత పెరగనున్న ప్రపంచ చమురు సంక్షోభం**

- ఎర్ర సముద్రంలో వాణిజ్యంపై పట్టు బిగించిన హౌతీ
- బాబ్‌ఎల్‌మండ్ ద్వీపం, మోఖా ఓడరేవుల స్వాధీనం
- ఇరాన్ సారథ్యంలో కొత్త వార్‌ఫ్రంట్
- ఇరాన్‒సౌదీ రాయబారుల చర్చలు
- 106 డాలర్లకు చేరిన ముడి చమురు ధర




**రియాద్ :** ఇరాన్ యుద్ధ పరిధి మరింతగా విస్తరించింది. ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలపై హౌతీ తిరుగుబాటు సైన్యాలు పట్టు బిగించాయి.పశ్చిమాసియాలో ప్రస్తుతం చమురు రవాణాకు ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగపడుతున్న బాబ్‌ఎల్‌మండ్ ద్వీపం,మోఖా ఓడరేవులు ఇరాన్ అనుకూల హౌతీ ఉగ్రవాద తిరుగుబాటు సైన్యాల అధీనంలోకి వెళ్ళిపోయాయి.మరోవైపు ఇరాక్ నుండి సౌదీఅరేబియాపై డ్రోన్ దాడులు జరగడంతో అత్యంత కీలకమైన చమురు సరఫరా పైపులైన్‌ను ఆ దేశ ప్రభుత్వం మూసివేసింది.ప్రపంచంలోనే అతిపెద్ద ముడి చమురు సరఫరాదారు దేశమైన సౌదీఅరేబియా హోర్ముజ్ జలసంధి ద్వారా రవాణాలు తప్పించుకోవడానికి

తరువాయి 12లో



భారత్ – చైనా సంబంధాల అభివృద్ధికి

## సరిహద్దు వెంబడి శాంతి అత్యవసరం

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ప్రధాని మోదీ స్పష్టీకరణ

08




## బైరాన్‌పల్లి మారణకాండ




జలియన్‌వాలా బాగ్ మారణకాండకు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించినప్పటికీ, తెలంగాణ చరిత్ర లో బైరాన్‌పల్లి మారణకాండ స్థానిక జ్ఞాపకాల్లోనే ఎక్కువగా నిలిచిపోయింది. అప్పటి వరంగల్ ప్రాంతానికి చెందిన బైరాన్‌పల్లి గ్రామం రజాకార్ల దాడులను ఎదుర్కొనేందుకు స్థానిక రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంది. గ్రామస్థులు బురుజు వద్ద కాపలా కాస్తూ వడిసెలలు, దేశీ తుపాకులు వంటి పరిమిత ఆయుధాలతో గతంలో జరిగిన దాడులను తిప్పికొట్టారు. రజాకార్లు, హైదరాబాద్ సంస్థాన పోలీసు బలగాలు గ్రామంపై పలుమార్లు దాడి చేసినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. 1948 ఆగస్టు 27న జరిగిన తుది దాడిలో హైదరాబాద్ సంస్థానానికి చెందిన పోలీసులు, సాయుధ బలగాలు, రజాకార్లు పాల్గొన్నట్లు వివిధ వృత్తాంతాలు పేర్కొంటున్నాయి. ఈ దళాలు ఫిరంగులు, బ్రెన్ గన్స్ వంటి అధిక శక్తి కలిగిన ఆయుధాలను ఉపయోగించాయి. గ్రామ రక్షణను ఛేదించిన తరువాత అనేక మంది గ్రామస్థులను ఒకచోట చేర్చి కాల్చి చంపారు. అయితే మృతుల సంఖ్య విషయంలో ఆధారాల మధ్య తేడా ఉంది. కొన్ని స్థానిక వృత్తాంతాలు సుమారు 120 మంది మరణించారని చెబుతుండగా, ఇతర చారిత్రక ఆధారాలు ఆగస్టు 27న జరిగిన హత్యలకు '96 మంది' అనే సంఖ్యను ముందుకు తెస్తున్నాయి. ఏదిఏమైనా బైరాన్‌పల్లిపై దాడులు నిజం.. మారణకాండ జరగడం నిజం. ప్రజలు తుపాకులకు ఎదురొడ్డి పోరాడిన మాట నిజం. ఇది 'తెలంగాణ జలియన్‌వాలా బాగ్' ఘటన అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

## మతపరమైన పోరాటం కాదు...


షోయబుల్లా ఖాన్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని కేవలం హిందూ–ముస్లిం ఘర్షణగా చిత్రీకరించే ప్రయత్నం ఇటీవల కాలంలో జోరు గా సాగుతున్నది. కానీ, ఈ వాదన, ఒక చారిత్రక వాస్తవాన్ని సంకుచి తం చేస్తుంది. ఉద్యమానికి ప్రధాన ప్రాతిపదిక భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా రైతులు సాగించిన వర్గపోరాటం. నిజాం పాలన, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా హిందువులతో పాటు ముస్లిం రైతులు, మేధావులు కూడా ప్రతిఘటించారు. ఈ పోరాటంలో మతపరమైన గుర్తింపుకంటే భూమి, శ్రమ, సామాజిక న్యాయం వంటి ప్రశ్నలు ప్రధానంగా నిలిచాయి. ఈ లౌకిక స్వభావానికి షహీద్ బందగి జీవితం ఒక ముఖ్యమైన ఉదాహరణ. 1946లో సాయుధ పోరాటం ప్రారంభం కావడానికి ముందే, విశునూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డితో తన పూర్వీకుల భూమి హక్కుల కోసం బందగి సుదీర్ఘ న్యాయపోరాటం సాగించాడు. 1940లో దేశ్‌ముఖ్ అనుచరులు అతన్ని హత్య చేశారు. రైతుల భూహక్కుల కోసం అతను చేసిన పోరాటాన్ని తరువాతి తెలంగాణ ఉద్యమానికి ఒక ముందుమాటగా ఉద్యమ చరిత్ర గుర్తించింది. మరో ప్రముఖ ఉదాహరణ ఉర్దూ పాత్రికేయుడు షోయబుల్లా ఖాన్. 'ఇమ్రోజ్' పత్రిక సంపాదకుడిగా నిజాం నిరంకుశ పాలనను ఆయన తీవ్రంగా విమర్శించారు. రజాకార్ల దౌర్జన్యాలను తన రచనల ద్వారా బహిర్గతం చేశారు. 1948 ఆగస్టు 21న రజాకార్లకు అనుబంధంగా ఉన్న వ్యక్తులు హైదరాబాద్‌లో ఆయనపై దాడి చేసి హత్య చేశారు. ఆయన హత్య తెలంగాణ పోరాటంలో ముస్లిం సమాజంలోని ప్రజాస్వామిక, నిరంకుశవాద వ్యతిరేక స్వరాలకు కూడా స్థానం ఉందని చూపించే విషాద ఉదాహరణగా నిలిచింది. అందువల్ల తెలంగాణ పోరాట చరిత్రను మతాల మధ్య ఘర్షణగా మాత్రమే చూడటం కంటే, భూస్వామ్య దోపిడీ, నిరంకుశ పాలన, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా వివిధ వర్గాల ప్రజలు కలసి సాగించిన పోరాటంగా అర్థం చేసుకోవడం చారిత్రకంగా సముచితం.

## ఆయుధాలు లేక...





తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో గెరిల్లా దళాలు తమకు అందుబాటులో ఉన్న సాధనాలతోనే ప్రతిఘటనకు కొత్త పద్ధతులు రూపొందించుకున్నాయి. ఆధునిక తుపాకులు, ఇతర ఆయుధాలతో వచ్చిన రజాకార్లు, ప్రభుత్వ బలగాలను ఎదుర్కొనేందుకు రైతుల వద్ద తగిన ఆయుధాలు ఉండేవి కావు. ఈ పరిస్థితిలో వారు ఉపయోగించిన ప్రత్యేకమైన సాధనాల్లో గిల్లోరాలు (గుల్లెలు లేదా స్లింగులు) కూడా ఉన్నాయి. తోలుతో తయారుచేసిన గుల్లెల్లో చిన్న ఇనుప ముక్కలకు బదులుగా బరువైన, నున్నటి నది రాళ్లను ఉంచి



దూరం నుంచి విసిరేవారు. చెట్ల చాటున దాగి, పలువురు ఒకేసారి రాళ్లు విసిరితే శత్రు దళాల్లో గందరగోళం ఏర్పడేది. రాళ్ల దెబ్బలకు గాయాలు, ఎముకలు విరిగేవి. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో ముందుకు కదిలే రజాకార్లపై ఈ వ్యూహం కొంత ప్రభావం చూపిం ది. ఇలాంటిదే వడిసె కూడా. సాధారణంగా పొలాల్లో పక్షులను చెదరగొట్టడానికి ఉపయోగించి వడిసెల తెలంగాణ పోరాటంలో ఒక కీలకమైన ఆయుధంగా మారింది. 'విడసెల రాళ్లు నింపి, వడివడిగ కొట్టితేను.. నీ మిలటరి పారిపోయిరో నైజాము సర్కరోడా' అంటూ యాదగిరి దాని ప్రాముఖ్యతను చెప్పకనే చెప్పాడు. ఏదిఏమైనా, పరిమిత వనరులతో పోరాడిన రైతాంగం తమ పరిసరాలు, స్థానిక పరిజ్ఞానం, గెరిల్లా వ్యూహాలను ఎలా ఉపయోగించుకున్నదో గుల్లెల వినియోగం సూచిస్తుంది.

## సైనిక చర్య తర్వాత కూడా..



హైదరాబాద్ సంస్థానం 1948 సెప్టెంబర్ 17న భారత యూనియన్‌లో విలీనం కావడంతో తెలంగాణ రైతాంగ పోరాటం ముగిసిపోయిందని సాధారణ చరిత్ర పాఠ్యాలు చెబుతాయి. కానీ వాస్తవానికి రైతాంగ సాయుధ పోరాటం మరో దశలోకి ప్రవేశించింది. నిజాం, రజాకార్లపై సాగిన పోరాటం స్థానంలో భారత సైన్యానికి వ్యతిరేకంగా గెరిల్లా పోరాటం కొనసాగింది. జనరల్ జెఎన్ చౌధురి ఆధ్వర్యంలోని సైనిక పరిపాలన తెలంగాణ గ్రామాల్లో కమ్యూనిస్టు ప్రభావాన్ని అణచివేయడానికి చర్యలు చేపట్టింది. రైతులు భూస్వాముల నుంచి స్వాధీనం చేసుకున్న భూములను తిరిగి వారికి అప్పగించాలన్న ప్రయత్నాలను ప్రతిఘటించారు. వేలాది మందిని అరెస్టు చేసి నిర్బంధ శిబిరాలకు తరలించగా, అనేక గ్రామాల్లో సైనిక దాడులు, చిత్రహింసలు చోటు చేసుకున్నాయి. ఈ పోరాటంలో మరణించిన వారి సంఖ్యపై చరిత్రకారుల మధ్య ఏకాభిప్రాయం లేదు. సుమారు 4,000 నుంచి 5,000 మంది మరణించారన్న వాదన బలంగా ఉంది. అయితే వారిలో 2,517 మందిగా పి. సుందరయ్య నమోదు చేయగా, వారందరినీ భారత సైన్యం చంపలేదని చరిత్రకారుడు డిఎన్ ధనగారే అంటారు.

– బిఎస్ఎస్ మైత్రేయి

# ఆధిపత్యాన్ని బ్రిక్స్ బద్దలు కొట్టేనా?

బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికాలతో కూడిన 'బ్రిక్స్' ను పశ్చిమ దేశాల ఆధిపత్య ధోరణికి గండి కొట్టే ఒక వేదికగా అందరూ ఆకాంక్షిస్తున్నారు. సంపద దోపిడీకి గురవుతున్న దక్షిణార్థ గోళంలోని అధిక అభివృద్ధి చెందిన దేశాలు ఇందులో భాగస్వామి కావడమే ఇందుకు కారణం. రష్యా, చైనాలు పశ్చిమ దేశాలకు దీటుగా నిలుస్తుండగా, భారతదేశం, దక్షిణ ఆఫ్రికా, దక్షిణ అమెరికాలోని బ్రెజిల్ దేశాలు అపారమైన సహజ వనరులు, జనాభా కలిగిన దేశాలు. బలీయమైన అంతర్జాతీయ శక్తులు ఎదిగే అవకాశముంది. బ్రిక్స్‌లో ఈ ఐదు దేశాలే కాకుండా మరో 6 సభ్యదేశాలు కలిపి, ప్రపంచంలో 49 శాతం జనాభా, 40 శాతం జిడిపికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. అందుకే అమెరికా, సహా పశ్చిమ దేశాలకు బ్రిక్స్ సమావేశాల పట్ల పైకి ఆసక్తి లేనట్లు కనిపించినా, ఏమి జరుగుతోందో ఒక కన్నేసి ఉంటాయి.

బ్రిక్స్ అనగానే ప్రధానంగా గుర్తొచ్చేది డాలర్‌కు ప్రత్యామ్నాయంగా బ్రిక్స్ ఉమ్మడి కరెన్సీ. ఈ ప్రతిపాదనను బ్రిజిల్ అధ్యక్షుడు లులా ద సిల్వా బలంగా ముందుకు తీసుకువస్తుంటారు. అలాగే శతకోటీశ్వరులుపై 2 శాతం సంపద పన్ను విధించాలనే ప్రతిపాదన కూడా నలుగుతోంది. ఈ అంశాలు బ్రిక్స్ అనుబంధ ఫోరమ్స్‌లలో చర్చకు వచ్చాయి. బ్రిక్స్ కామన్ కరెన్సీ సాకరమవుతుందేమోననే భయం అమెరికాకు వెంటాడుతూనే ఉంది. అందుకే రియో డి జెనిరోలో జరిగిన గత బ్రిక్స్ సదస్సు సమయంలోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ప్రయత్నాలపై గట్టి హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా డాలర్‌ను పక్కన బెట్టే ఎలాంటి కరెన్సీని అంగీకరించబోమని, అలా చేస్తే ఆయా దేశాలపై టారిఫ్‌ను వంద శాతం పెంచేస్తామని హూంకరించారు ట్రంప్. అయితే, బ్రిక్స్ కామన్ కరెన్సీ ఒక అడుగు ముందు రెండు అడుగులు వెనక్కి అనే మాదిరిగానే సాగుతోంది.

ఈసారి బ్రిక్స్‌కు అధ్యక్షత స్థానంలో ఉన్న భారతదేశ రాజధాని న్యూ ఢిల్లీలో 18వ సమావేశం ప్రారంభమైంది. దీనికి రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్‌లు ఇక్కడకు చేరుకున్నారు. తమ నేలపై బాంబుల వర్షం కురిపిస్తున్నా అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు ఎదురొడ్డి నిలుస్తున్న ఇరాన్ దేశం అధ్యక్షుడు మౌసూద్ పెజిష్కియాన్ ఈ సమావేశంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఢిల్లీ సదస్సు ఉమ్మడి ప్రకటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. బ్రిక్స్ సభ్యదేశాలతో ముడిపడి ఉన్న రష్యా ఉక్రేన్ యుద్ధం, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం, ఇరాన్ – సౌదీ అరేబియా–యుఎఇ సంబంధాలు తదితర అంశాల నేపథ్యంలో సదస్సు ప్రాధాన్యత సంతరించుకున్నది. గత సమావేశాల్లో రష్యా–ఉక్రేన్ దాడుల విషయంలో అనేక తర్జన భర్జనలు జరిగాయి.

పాతికేళ్ల క్రితం మొగ్గ తొడిగిన ఆలోచనతో ఏర్పాటైన బ్రిక్స్ 18 ఏళ్లుగా ప్రస్థానాన్ని సాగిస్తున్నది. జి 7 జి 21 శిఖరాగ్ర కూటములకు భిన్నంగా మానవత, సమతా దృక్పథంతో ఈ కూటమి పని చేస్తుంది. వెన్న వెంటనే ప్రపంచ రాజకీయ చిత్రపటంలో మార్పులు ఆశించడం అత్యాశే అయినప్పటికీ బ్రిక్స్ ఒక సానుకూల వేదిక. పరస్పర సహకారం, అసమాన ఎగుమతి దిగుమతుల అంతరాల తగ్గింపు, డాలర్ రహిత వాణిజ్య ప్రోత్సాహం, సాంకేతిక మార్పిడి, బహుళ ధృవ ప్రపంచ గమనంలో బ్రిక్స్ ఒక ఉత్తమ వేదిక. ఇది సరైన మార్గంలో ముందుకు సాగితే ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థ సాధ్యమే. అగ్ర రాజ్యాల వివక్షా పూరిత ఆధిపత్యానికి చెక్ పెట్టే ఒక సాధనం ఈ కూటమి. ●

# ఐదు దశాబ్దాల ప్రజాస్వామ్య పోరాటానికి గురు 'అవంతే'

**ల్యూక్ రొటెల్లో, మోత్ విస్నెస్కీ**

పోర్చుగల్ రాజధాని లిస్బన్‌కు సమీపంలోని శెజాల్ నగరంలో ఈనెల 4 నుంచి 6 వరకు జరిగిన 'అవంతే ఉత్సవం' (ఫెస్టా డొ అవాంతే) 50వ వార్షికోత్సవంలో లక్షలాది మంది కమ్యూనిస్టులు, కార్మికులు, యువకులు, మద్దతుదారులు పాల్గొన్నారు. ఈ ఉత్సవానికి పేరు పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ ప్రచురించే 'అవంతే!' పత్రిక నుంచి వచ్చింది. ఆ పదానికి ఆంగ్లంలో 'ముందుకు' అనే అర్థం. ఈ భారీ సమాహారాన్ని పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ నిర్వహిస్తుంది. ప్రతి ఏడాది జరిగే ఈ ఉత్సవం 1974 కార్నేషన్ విప్లవం తరువాత పోర్చుగల్‌లో ప్రజాస్వామ్యం కోసం సాగిన పోరాటాన్ని స్మరించుకుంటుంది. వామపక్ష, కమ్యూనిస్టు భావజాలానికి అనుకూలంగా ఉన్న పోర్చుగీస్ సైనిక విభాగాలు నిర్వహించిన ఈ తిరుగుబాటు రక్తపాతం లేకుండా జరిగింది. దాంతో 40 ఏళ్లకు పైగా దేశాన్ని భయానక నిర్బంధం, రాజకీయ అణచివేతతో పాలించిన ఫాసిస్టు 'ఎస్టాడో నోవో' పాలనకు తెరపడింది. ఎస్టాడో నోవో ప్రభుత్వం దేశంలో వేలాదిమంది కమ్యూనిస్టులను అరెస్టు చేసి, జైళ్లలో పెట్టి, చిత్రహింసలకు గురిచేసింది. పోర్చుగీస్ వలస పాలనలో ఉన్న ప్రాంతాల్లో దాని హింస మరింత విస్తృతంగా సాగింది. గినియాబిస్సావు, కేప్ వెర్డే, అంగోలా, మొజాంబిక్, తూర్పు తిమోర్ తదితర ప్రాంతాల్లో శక్తివంతమైన వలస వ్యతిరేక ఉద్యమాలు ఏర్పడ్డాయి. 1960ల నుంచే అవి స్వాతంత్ర్యం కోసం సాయుధ పోరాటాలు ప్రారంభించాయి. విప్లవం జరిగే సమయానికి ఎస్టాడో నోవో ప్రభుత్వం లక్షలాది మందిని, ప్రధానంగా సాధారణ పౌరులను, హతమార్చింది. సైనికుల తుపాకుల గొట్టాలకు శాంతికి ప్రతీకగా కార్నేషన్ పూలను పెట్టినందుకు ఈ విప్లవానికి 'కార్నేషన్ విప్లవం' అనే పేరు వచ్చింది. ఈ విప్లవం వలస విమోచన ఉద్యమాలపై పోర్చుగల్ సాగిస్తున్న యుద్ధాలకు ముగింపు పలికింది. ప్రజాస్వామ్యాన్ని తిరిగి తీసుకొచ్చింది. అయితే ఈసారి కార్మికులు ఉద్యమానికి నాయకత్వం వహించారు. సమ్మెలు, భారీ ప్రజా ఆందోళనలు, విప్లవ వ్యతిరేక కుట్రలతో కూడిన అస్థిరమైన పరివర్తన దశ తరువాత పోర్చుగల్ రాజ్యాంగ పరిషత్‌ను ఎన్నుకుంది. అందులో కమ్యూనిస్టులకు గణనీయమైన ప్రాతినిధ్యం లభించింది. దాని ఫలితంగానే 1976 లో ప్రగతిశీల రాజ్యాంగం రూపొందింది. ప్రతి ఏడాది జరి గే 'అవంతే' ఉత్సవంలో ఈ రాజ్యాంగాన్ని ప్రత్యేకంగా స్మరించుకుంటారు.

ఈ ఉత్సవం విస్తృతమైన సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా నిలుస్తుంది. సాహిత్యం, కళా ప్రదర్శనశాలలు, నాటకం, సినిమా, శాస్త్ర విజ్ఞానం, రాజకీయ చర్చలు, నృత్యం, సంగీతంఅన్నీ ఇందులో భాగమవుతాయి. ప్రధాన మార్గాల్లో డ్రమ్ బృందాల చుట్టూ చిన్న చిన్న సమూహాలు ఏర్పడుతుంటే, సింఫనీ ఆర్కెస్ట్రాలు, రాక్ బ్యాండ్లు వేలాది మందిని ఆకర్షిస్తాయి. వారి ప్రదర్శనల మధ్య '25 డె ఎబ్రిల్ సెంప్రె, ఫాసిస్మో మున్కా మయిస్' (ఏప్రిల్ 25 ఎప్పటికీ; ఫాసిజం మళ్లీ ఎన్నటికీ వద్దు) వంటి నినాదాలు మారుమోగుతాయి. లిస్బన్‌లోని కమ్యూనిస్టు పార్టీ శాఖలు ఆహారం, సమాచార సామగ్రి, పార్టీ ప్రచార వస్తువులతో పెద్ద స్టాళ్లను ఏర్పాటు చేస్తాయి. నగరానికి వెలుపల ఉన్న పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ ప్రాంతీయ శాఖలు కూడా తమ తమ ప్రాంతాల ఆర్థిక, సాంస్కృతిక ప్రత్యేకతలను ప్రతిబింబించే స్టాళ్లను ఏర్పాటు చేస్తాయి. ఆయా ప్రాంతాలకు చెందిన సంప్రదాయ ఆహార పదార్థాలతో పాటు కళా ప్రదర్శనలు, గోడచిత్రాలు కనిపిస్తాయి. సార్వత్రిక ప్రజా రవాణా కోసం, జాతీయ పార్కుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ఆహార స్వావలంబన కోసం స్థానిక డిమాండ్లు ఆ గోడచిత్రాల్లో వ్యక్తమవుతాయి.

పార్టీ యువజన విభాగమైన పోర్చుగీస్ కమ్యూనిస్టు యువజన సంఘం(జెసిపి)కు చెందిన ఒక సభ్యుడు చెప్పినట్లు, ఆహారాన్ని ప్రదర్శించడం కూడా రాజకీయ ప్రకటనగానే మారుతుంది. ఒకవైపు జాతి, మతపరమైన అణచివేతల మధ్య నిలిచిన వంటకాల సంప్రదాయాలను అది ప్రతిబింబిస్తుంది. మరోవైపు దేశం ఆహార స్వావలంబన కోసం సాగిస్తున్న పోరాటాన్ని కూడా ప్రతిబింబిస్తుంది.

యురోపియన్ యూనియన్ (ఇయు) అమలుచేసే ఆర్థిక విధానాలు ప్రతి దేశం కొన్ని నిర్దిష్ట వస్తువుల ఉత్పత్తికి ప్రాధాన్యం ఇచ్చేలా చేస్తాయి. ఫలితంగా పోర్చుగల్ వ్యవసాయ రంగం స్వయం సమృద్ధి స్థితి నుంచి దిగుమతులపై ఆధారపడే స్థితికి చేరింది. భూసంస్కరణలు, వ్యవసాయ సమీకరణలో పోర్చుగల్ గతంలో సాధించిన విస్తృత పురోగతి కూడా ఈ పరిణామంతో ప్రభావితమైంది. ఈ భారాన్ని గ్రామీణ కార్మిక వర్గం మోయాల్సి వచ్చింది. అదే సమయంలో పోర్చుగల్‌లోని అతిపెద్ద నగరాలు, అత్యంత ప్రజాదరణ పొందిన పర్యాటక ప్రాంతాలు గృహాలపై ఊహాజనిత పెట్టుబడులు, ఆర్థిక వ్యవస్థలో అనధికారికత పెరగడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయి. దేశంలో బలవంతంగా సాగిన పారిశ్రామికీకరణ తగ్గుదలతో పాటు ఇయు పౌరులకు స్వేచ్ఛగా దేశాల మధ్య సంచరించే అవకాశాలు పెరిగాయి. దీంతో మొత్తం ఆర్థిక వ్యవస్థ పర్యాటకరంగం వైపు మళ్లింది. ఫలితంగా తరతరాలుగా నివసిస్తున్న ప్రాంతాల నుంచి కార్మికవర్గంలోని విస్తృత వర్గాలు బయటకు వెళ్లాల్సి వచ్చింది. వారు ఆతిథ్య రంగంలోకి, తాత్కాలిక ఉపాధిలోకి బలవంతంగా అడుగుపెట్టక తప్పలేదు. 'అవంతే' ఉత్సవానికి వచ్చిన వారందరూ పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీతో ప్రత్యక్షంగా అనుబంధం ఉన్నవారు కాదు. అయినప్పటికీ 1974 విప్లవం ద్వారా రాజ్యాంగంలో పొందుపరిచిన పౌర స్వేచ్ఛలను కాపాడాలనే పార్టీ పిలుపు దేశంలోని అనేక వామపక్ష, ప్రగతిశీల ఉద్యమాలకు చెందిన ప్రజలను ఆకర్షించింది. అదే సమయంలో ప్రతి రోజూ, ప్రతి సాయంత్రం జరిగే సంగీత కార్యక్రమాలకు వివిధ నేపథ్యాల నుంచి వచ్చిన యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.




ఉత్సవ ప్రాంగణంలోని స్టాళ్లు, దారుల వెంట పోర్చుగీస్ రాజ్యాంగంలోని వివిధ అంశాలను ప్రతిబింబించే గోడచిత్రాలు కనిపించాయి. యంగ్ పయనీర్స్ విభాగంలో అయినా, అంతర్జాతీయ విభాగంలో అయినా, శ్రామిక ప్రజల చట్టబద్ధ హక్కులను కాపాడాలనే భావన మొత్తం ఉత్సవంలో ప్రధాన సాంస్కృతిక ప్రవాహంగా కనిపించింది. రాజకీయ మితవాద శక్తులు రాజ్యాంగంలోని కొన్ని అంశాలను బలహీనపరచడానికి లేదా తమకు అనుకూలంగా కొత్త అర్థాలు చెప్పడానికి న్యాయపరమైన పోరాటం సాగిస్తున్న నేపథ్యంలో, పౌర స్వేచ్ఛల పరిరక్షణ నిరంతర ప్రక్రియ అని కమ్యూనిస్టు పార్టీ ఉత్సవానికి వచ్చిన వారికి గుర్తుచేసింది. కొత్త రాజకీయ, ఆర్థిక పరిస్థితులు ఏర్పడిన ప్రతిసారీ వాటిని ఎదుర్కొంటూ ఆ పోరాటాన్ని కొనసాగించాల్సి ఉంటుందని పార్టీ పేర్కొంది. రాజ్యాంగంలోని 73వ అధికరణాన్ని ఒక జెసిపి సభ్యుడు ప్రస్తావించాడు. శాస్త్రీయ ఆవిష్కరణలు సమష్టి ప్రయోజనం, ప్రజాస్వామ్య స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆ అధికరణం హామీ ఇస్తుంది. అయితే లింగ గుర్తింపుకు అనుగుణమైన వైద్య సేవలు పొందేందుకు పోర్చుగల్‌లోని ట్రాన్స్‌జెండర్ పౌరులు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను ఆయన దానితో పోల్చారు. రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రజాస్వామిక హక్కులను కాపాడకుండా, కొన్ని విభజనవాద శక్తులు వ్యూహాత్మకంగా తీవ్ర మితవాద పక్షంతో చేతులు కలిపి రాజ్యాంగంలోని కొన్ని అంశాలను సవాలు చేయడం ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. ఈ ఏడాది 'అవంతే' ఉత్సవం పోర్చుగల్‌లో తీవ్రతరమైన ఛాందసవాద పార్టీ 'చేగా' (చాలు!) రాజకీయ ప్రభావం పెరుగుతున్న సమయంలో జరిగింది. ఈ పార్టీని అమెరికాలోని 'మగా' ఉద్యమంతో పోలుస్తున్నా రు. శుభ్రమైన పోర్చుగల్ కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చే చేగా నినాదాలతో కూడిన పోస్టర్లు లిస్బన్ అంతటా కనిపిస్తున్నాయి. నగరంలోని వేలాది వీధి దీపాల స్తంభాలపై ఆ పార్టీ నాయకుడి ముఖచిత్రా లు కనిపించాయి. పోర్చుగల్‌లో చాలా సంవత్సరాలుగా సోషలిస్టు పార్టీ (పిఎస్), సోషల్ డెమోక్రటిక్ పార్టీ (పిఎస్‌డి) మారుమారుగా అధికారంలోకి వస్తున్నాయి. అయితే ఈ రెండు పార్టీలూ ఇప్పుడు స్తబ్దతకు గురయ్యాయని, కార్మిక వర్గానికి, చిన్నా పెద్దా పెట్టుబడిదారీ ప్రయోజనాలకు మధ్య ఏర్పడిన సంబంధాలను సమర్థంగా నిర్వహించలేకపోతున్నాయని విమర్శకులు అంటున్నారు. దీనివల్ల ఆర్థిక పెట్టుబడి శక్తులకు మరింత స్వేచ్ఛ లభించింది. అవి పిఎస్, పిఎస్‌డి పార్టీలలోనూ, వెలుపల కూడా ప్రభావాన్ని పెంచుకున్నాయి. అధికారాన్ని క్రమంగా మితవాదుల చేతుల్లోకి మార్చే ప్రక్రియకు అవి మధ్యవర్తిత్వం వహిస్తున్నాయని పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ వాదిస్తోంది. ఈ పరిస్థితుల్లోనూ పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ రాజ్యాంగం, శాంతి, ప్రగతికి గట్టి రక్షకురాలిగా నిలిచింది. గత డిసెంబర్, జూన్ నెలల్లో జరిగిన రెండు సాధారణ సమ్మెల్లో ఇది స్పష్టంగా కనిపించింది. పోర్చుగీస్ కార్మికుల సాధారణ సమాఖ్య (సిజిటిపిఐఎన్) నాయకత్వంలో జరిగిన ఈ సమ్మెలు ప్రభుత్వం ప్రతిపాదించిన కార్మిక చట్టాల ప్యాకేజీని వెనక్కి తగ్గేలా చేశాయి. అదే సమయంలో తీవ్ర కుడిపక్ష రాజకీయాల అసలు ఉద్దేశాలపై పోర్చుగీస్ ప్రజల్లో కొత్తస్థాయి రాజకీయ చైతన్యాన్ని అవి మేల్కొల్పాయి.

ఈ ఉత్సవంలో పాలస్తీనా సంఘీభావం ప్రధాన అంశంగా నిలిచింది. అంతర్జాతీయ ప్రతినిధుల విభాగంలో పాలస్తీనా విమోచన సంస్థ ప్రతినిధులు సమాచార స్టాళ్లను ఏర్పాటు చేశారు. సంగీత కార్యక్రమాల్లో పాలస్తీనా కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. అనేక అధికారిక ప్రదర్శనల్లో పాలస్తీనా జెండాలు కనిపించాయి. పలువురు పాల్గొనేవారు కూడా ఆ జెండాలను చేతబట్టారు. ఉత్సవం ముగింపు దశకు చేరుకున్నప్పుడు వేలాదిమంది పార్టీ సభ్యులు, సందర్శకులు పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ, జెసిపి జెండాలను చేతబట్టి ప్రధాన వేదిక ముందు ఉన్న ప్రాంగణాన్ని నింపారు. 'పిసిపి' అంటూ నినాదాలు, 'క్యూబా వెన్సెర్' (క్యూబా విజయం సాధిస్తుంది!) అంటూ నినాదాలు మారుమోగాయి. ఆ ప్రాంగణాన్ని ఉద్రూతలూగించాయి. పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ నాయకుల ప్రసంగాలను వినేందుకు కూర్చున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి పౌలో రైముండో పాలస్తీనాకు మద్దతుగా ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న అంతర్జాతీయ ఉద్యమానికి పార్టీ సంఘీభావాన్ని మరోసారి ప్రకటించారు. అమెరికా, ఇజ్రాయెల్ విధానాలకు అనుగుణంగా నడిచే ప్రభుత్వాలు చూపించని సంఘీభావాన్ని ప్రపంచవ్యాప్తంగా వీధుల్లోకి వస్తున్న ప్రజలు చూపిస్తున్నారని ఆయన అన్నారు. పాలస్తీనా రాజ్యాన్ని గుర్తించడానికి నిరాకరిస్తున్న పిఎస్/ పిఎస్‌డి ప్రభుత్వం అందుకు ఉదాహరణ అని ఆయన విమర్శించారు. ముగింపు కార్యక్రమంలో క్యూబా అధ్యక్షుడు మిగుయెల్ డియాజ్‌కానెల్ వీడియో సందేశం కూడా ప్రసారం చేశారు. క్యూబా సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ సాగిస్తున్న పోరాటాన్ని ఆయన అభినందించారు. క్యూబా కమ్యూనిస్టు పార్టీ తరపున సంఘీభావాన్ని ప్రకటించారు. 'క్యూబా ప్రజల గౌరవం, ధైర్యం, సిద్ధాంతపరమైన నిబద్ధత, త్యాగ స్ఫూర్తి, విప్లవ స్ఫూర్తిని సామ్రాజ్యవాదులు జీర్ణించుకోలేకపోతున్నారు' అంటూ డియాజ్‌కానెల్ అన్నా రు. 'కమ్యూనిస్టు పార్టీలకు జయహో!' అని ఆయన తన సందేశాన్ని ముగించారు. నాయకుల ప్రసంగాలు ముగిసే సమయానికి ఉత్సవం చివరి ఘట్టం కోసం ప్రజల్లో ఉత్కంఠ పెరిగింది. 'ది ఇంటర్నేషనల్', 'అవంతే, కామరాడా' (ముందుకు, కామ్రేడ్!), ఉత్సవ ఉద్యమ గీతమైన 'కార్వల్హేసా' గీతాలు వినిపించాయి. ప్రపంచ కార్మికవర్గ ఐక్యత అనే సందేశాన్ని నాయకులు ప్రసంగాల్లో వ్యక్తం చేశారు. చివరి ఘట్టంలో అదే ఐక్యత నృత్యంగా, సంగీతం గా, సామూహిక ఉత్సాహంగా ప్రత్యక్షమైంది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కమ్యూనిస్టు జెండాలు వేలాదిమంది చేతుల్లో రెపరెపలాడాయి. చేతుల్లోనూ, మనసుల్లోనూ కార్నేషన్ పూలతో ప్రజలు ఉత్సవానికి ముగింపు పలికారు.

*(పీపుల్స్ వరల్డ్ సౌజన్యంతో ఐపిఎ సర్వీస్ నుంచి)*

# తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు...మల్లు స్వరాజ్యం



**తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా**

నిజాం నిరంకుశత్వానికి, దొరల దాష్టీకాలకు మరియు భూస్వాముల ఆగడాలను వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం 1946 నుండి 1951 వరకు కొనసాగిన 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం' ప్రపంచ చరిత్రలోనే ప్రముఖ స్థానాన్ని సముపార్జించుకుని నిత్యనూతన చైతన్య స్రవంతిగా వెలుగొందుతూనే ఉంది. తెలంగాణ సాయుధ పోరాటంలో 'దున్నేవాడిదే భూమి' అనే నినాదం మార్మోగిపోయింది. 'బాంచెన్ దొరా & నీ కాళ్లు మొక్కుతా' అన్న పీడిత ప్రజానీకం ఆ యుధాలు చేబూని దొరల, భూస్వాముల, పెత్తందారుల అరాచకాలను అంతమొందించారు. వేలాది గ్రామాలు వెట్టి చాకిరీ నుండి విముక్తి పొందాయి. పది లక్షల ఎకరాల భూములు పేద ప్రజలకు పంపిణీ చేయబడ్డాయి. కాని ఈ తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది అమరులు కావడం కడు విషాదకరం. తెలంగాణ సాయుధ పోరాటయోధులలో ఒకరుగా నిలిచిన మల్లు స్వరాజ్యం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని (ప్రస్తుత సూర్యాపేట జిల్లా) తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెం గ్రామంలో వందలాది ఎకరాలు కలిగిన భూస్వామ్య కుటుంబంలో భీంరెడ్డి రాంరెడ్డి, చొక్కమ్మ దంపతులకు 1931వ సంవత్సరంలో జన్మించారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో 'స్వరాజ్' అనే నినాదం పట్ల ఆమె తల్లిదండ్రులు ఎంతగానో ప్రభావితులై ఆ స్వరాజ్యోద్యమ కాలాన్ని గుర్తుచేసే విధంగా ఆమెకు 'స్వరాజ్యం' అని పేరు పెట్టడాన్ని చాలా స్పష్టంగా గమనించవచ్చు. మల్లు స్వరాజ్యం భూ స్వా మ్య కుటుంబంలో జన్మించిన నూ ఆలోచనలు, ఆశయాలు మాత్రం సమ సమాజం వైపుగా పయనింపజేశాయి. ఆమె తన సోదరుడు భీమిరెడ్డి నర్సింహారెడ్డి (బి.ఎన్. రెడ్డి) అడుగుజాడల్లో నడిచి క్రమంగా ఆమె తెలంగాణ సాయుధ పోరుబాట దిశగా ముందుకు సాగారు. స్థానిక భూ స్వామ్యుల, జమీందారుల నిరంకుశత్వానికి, వెట్టిచాకిరి విధానానికి వ్యతిరేకంగా మరియు రజాకారుల అరాచకాలకు, అకృత్యాలకు వ్యతిరేకం గా ప్రారంభమైన తెలంగా ణ సాయుధ పోరాటంలో మల్లు స్వరాజ్యం పదమూడేళ్లకే తుపాకీ పట్టి తెలంగాణ ఉద్యమానికి 'సాయుధ దన్ను'గా నిలిచి ఉద్యమించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో భాగంగా మల్లు స్వరాజ్యం మహిళా కమాండర్ గాను ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్‌జిల్లాలలో ఉద్యమాలు నిర్వహించారు. 1947 లో రజాకార్లు తన ఇంటిని తగులబెట్టిననూ, నిజాం ప్రభుత్వం తనని పట్టించిన వారికి పదివేల రూపాయల జరిమానాను ప్రకటించినా ఏ మాత్రం అధైర్యపడకుండా మరింతగా ముందుకు సాగి తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె ఒక వ్యక్తిగా కాకుండా 'ప్రజాశక్తి'గా ప్రజ్వలించి చివరి దశ వరకు వీరోచిత పోరాటం సాగించారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) తరపున ఉమ్మడి నల్గొండ జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం నుంచి మల్లు స్వరాజ్యం రెండు పర్యాయాలు (1978–1983 & 1983– 1984) శాసనసభ్యురాలుగా కొనసాగారు. కార్మిక కర్షక సమస్యలపై ఆమె ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి ఆయా సమస్యల పరిష్కారాల దిశగా ఉద్యమించారు.అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) లో రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకురాలిగా మల్లు స్వరాజ్యం అనేక మహిళా సమస్యల పరిష్కారాలకోసం అహర్నిశలు ఉద్యమించారు. ఉమ్మ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన మద్యపాన నిషేధ వ్యతిరేక పోరాటంలోనూ ఆమె క్రియాశీలకంగా ఉద్యమించారు. 'నా మాటే తుపాకీ తూటా' అన్న పేరుతో మల్లు స్వరాజ్యం ఆత్మకథ వెలువడి ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచింది. తెలంగాణ సాయుధ పోరాటంలో మల్లు స్వరాజ్యం నిర్వహించిన పాత్ర చారిత్రాత్మకంగా నిలిచింది. పీడిత ప్రజానీకానికి పోరాట స్ఫూర్తిని రగిలించిన మల్లు స్వరాజ్యం తన 91 సంవత్సరాల వయసులో 2022, మార్చి 19 నాడు మరణించారు.

**జె.జె.సి.పి.బాబూరావు,** 94933 19690

# పాడి రైతులకు అండగా నిలుస్తాం

- విజయ డెయిరీని మరింత బలోపేతం చేస్తాం
- శాసనమండలిలో మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విజయ డెయిరీని మరింత బలోపేతం చేసి పాడి రైతులకు అండగా నిలుస్తామని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శాసనమండలిలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ఎల్.రమణ, నెల్లికంటి సత్యం, బండ ప్రకాశ్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఎలినినో ప్రభావంతో పాల సేకరణలో తాత్కాలికంగా స్వల్ప తగ్గుదల నమోదైందన్నారు. 2023–2024లో రోజుకు సగటున 3.60 లక్షల లీటర్లు, 2024–25లో 4 లక్షల లీటర్లు, 2025–26లో 3.36 లక్షల లీటర్ల పాలను సేకరించినట్లు వివరించారు. విజయ డెయిరీ ఆధునీకరణ, నాణ్యమైన పాల ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్‌ను పెంచడంపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. పాల డిమాండ్, సరఫరా మధ్య వ్యత్యాసాన్ని తగ్గిస్తామని చెప్పారు. పశువైద్యశాఖలో 110 మంది వైద్యులు, 304 మంది కాంపౌండర్లను నియమించినట్లు వెల్లడించారు. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి పాడి గేదెల పంపిణీతో పాల ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

**పాడి పరిశ్రమకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి: సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**



పాడి పరిశ్రమకు ప్రభుత్వం భారీగా ప్రోత్సాహకాలు అందించాలని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. వ్యవసాయ రంగంలో పాడి పరిశ్రమ అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. శాసనమండలిలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో విజయ డెయిరీ పాల సేకరణ ప్రశ్నపై జరిగిన చర్చ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వం పాడి పరిశ్రమకు తగిన ప్రోత్సాహం అందించకపోవడంతో ఈ రంగం క్రమంగా క్షీణించిందని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి పాలను దిగుమతి చేసుకునే పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు. భారీ రుణాలు, సబ్సిడీలు అందించి యువ పాడి రైతులను ప్రోత్సహించాలని కోరారు. రైతులకు గతంలో అందించినట్లు రూ.4 సబ్సిడీ అందించాలని సూచించారు. అలాగే ప్రస్తుతం పాల ధరలు భారీగా పెరిగాయని, వాటిని నియంత్రించాల్సిన అవసరం కూడా ఉందన్నారు.

**తెలంగాణను క్రీడా శక్తిగా తీర్చిదిద్దుతాం: మంత్రి వాకిటి శ్రీహరి**

క్రీడలను విద్యతో అనుసంధానం చేసి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (వైపిఇఎస్‌యు)ను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడలశాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శాసనమండలిలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు బల్మూర్ వెంకట్ నర్సింగ్ రావు, బి.మహేశ్ కుమార్ గౌడ్, శ్రీపాల్ తదితరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. వైపిఇఎస్‌యులో స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్, ఫిజికల్ ఎడ్యుకేషన్, పరిశోధనతో పాటు ఆధునిక శిక్షణకు ప్రాధాన్యం ఇస్తామని మంత్రి తెలిపారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో ఖేల్ ఇండియా యూత్ గేమ్స్ నిర్వహించనున్నామని, ఇందుకు రూ.272 కోట్ల అంచనా వ్యయం ఉంటుందని చెప్పారు. గచ్చిబౌలి స్టేడియాన్ని రూ.700 కోట్లతో పిపిపి విధానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరిస్తున్నామని తెలిపారు.

**నాగ్‌పూర్–వరంగల్ హైవే పనులు 2027 డిసెంబర్ నాటికి పూర్తి: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



నాగ్‌పూర్ – మంచిర్యాల వరంగల్ ఖమ్మం విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణాన్ని 2027 డిసెంబర్ 31 నాటికి పూర్తి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శాసనమండలిలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు పోచంపల్లి శ్రీనివాస్, ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ఈ హైవే మొత్తం 310 కిలోమీటర్లు కాగా, అందులో 280 కిలోమీటర్లు తెలంగాణలోనే ఉందని మంత్రి తెలిపారు. భూసేకరణలో రైతులకు మార్కెట్ రేటు ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పరకాల ప్రాంతానికి సమీపంలో ఎగ్జిట్ ఏర్పాటు చేసేలా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు ఆదేశాలు ఇస్తామని పేర్కొన్నారు.

**తెలంగాణ సాధనలో కళాకారులది కీలకపాత్ర: మంత్రి జూపల్లి కృష్ణారావు**



తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శాసనమండలిలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు దాసోజు శ్రవణ్, విజయశాంతి, అద్దంకి దయాకర్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్ర సాధనలో కీలకంగా వ్యవహరించిన కళ, సాహిత్య రంగాలకు చెందిన ఎనిమిది మంది స్మృతిప్రదాతలకు రూ.కోటి చొప్పున ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. తెలంగాణ ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా జానపద కళలు మరుగున పడకుండా కళాకారుల సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జానపద కళలు కనుమరుగైతే రాష్ట్ర సాధన చరిత్రను భావితరాలకు తెలియజేయడం కష్టమవుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

**పరిశ్రమలు తరలివెళ్లడం అబద్ధం: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**



తెలంగాణ నుంచి పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్తున్నాయన్న ప్రచారం అవాస్తవమని ఐటి, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. కొన్ని మీడియా సంస్థలు కావాలనే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని అన్నారు. శాసనమండలిలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుడు పోచంపల్లి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే పరిశ్రమలకు టిజిఐఐసి ద్వారా పారదర్శకంగా స్థలాలను కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి ఒక్క పరిశ్రమ తరలివెళ్లే పరిస్థితి లేదని, పరిశ్రమలను తీసుకొచ్చే సత్తా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందని అన్నారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్‌ను ఐటి హబ్‌గా అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు.

**వ్యవసాయ ఆధారిత కంపెనీలకు ప్రోత్సాహం**

తెలంగాణలో వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం అందిస్తున్నామని ఐటి, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. శాసనమండలిలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రంలో సుమారు 47 ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్లకు స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. సుమారు 229 ఎకరాలకు సంబంధించి రూ.104 కోట్లు చెల్లించామని, తద్వారా 2 వేలకుపైగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. తెలంగాణను వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత కంపెనీలు భారీగా తరలివచ్చేలా ప్రోత్సాహం చేస్తున్నామని మంత్రి తెలిపారు.

**మహిళల అభివృద్ధికి వెయ్యి రోజుల్లో రూ.70 వేల కోట్ల చేయూత: మంత్రి సీతక్క**



మహిళల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. వెయ్యి రోజుల పాలనలో బ్యాంకుల సహకారంతో మహిళలకు రూ.70 వేల కోట్ల మేర ఆర్థిక చేయూత అందించినట్లు వెల్లడించారు. శాసనమండలిలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ గౌడ్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ, మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు, బస్సుల కొనుగోలు, సూక్ష్మ పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, మహిళా రైతులకు డ్రోన్ల అందజేత వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.




# తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలి

- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిజాం రాచరికం, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు సాగించిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చి భవిష్యత్ తరాలకు అందించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్మరించుకుంటూ ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ.టి. నరసింహ మాట్లాడుతూ నిజాం రాచరిక పాలన, భూస్వాముల పెత్తనం, దౌర్జన్యాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. తెలుగు మాధ్యమంలో చదువుకునే అవకాశం లేకపోవడంతో పాటు సభలు, సమావేశాలు నిర్వహించి పాలకులను ప్రశ్నించే హక్కు కూడా ప్రజలకు లేకుండా చేశారని తెలిపారు. ఆంధ్ర మహాసభ నాయకత్వంలో ప్రజల్లో చైతన్యం పెరిగిందని, కమ్యూనిస్టు పార్టీ గ్రామాల్లో భూస్వాముల ఆధిపత్యానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నిర్మించిందన్నారు. రైతులు పండించిన పంటను కూడా ఇళ్లకు తీసుకెళ్లనివ్వకుండా భూస్వాముల గూండాలు దోచుకునేవారని, చాకలి ఐలమ్మ వంటి కౌలు రైతుల పక్షాన ప్రజా ఉద్యమం నిలిచిందని చెప్పారు. దీనిని భరించలేని దేశ్‌ముఖ్, విసునూరు రామచంద్రారెడ్డి, జన్నపరెడ్డి ప్రతాపరెడ్డి లాంటి వేలాది ఎకరాలు కలిగిన భూస్వాములు ప్రజలపై ఆయుధాలతో దాడులు చేశారని, భూస్వాముల ప్రైవేటు సైన్యంగా రజాకారులు ప్రజలపై తీవ్ర హింసలకు పాల్పడ్డారని, మహిళలపై అత్యాచారాలకు తెగబడ్డారన్నారు. ఈ దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజలు సాయుధ పోరాటం సాగించారని, లక్షల ఎకరాల భూములను పేదలకు పంచడంతో పాటు వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించి కౌలుదారుల హక్కుల కోసం పోరాడారని తెలిపారు. రాచరిక, భూస్వామ్య వ్యవస్థలకు వ్యతిరేకంగా సాధారణ ప్రజలు సాగించిన ఈ పోరాటం ప్రపంచంలోని అనేక ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చిందన్నారు.

**తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో ఎలాంటి సంబంధం లేని బిజెపి ఇప్పుడు ఆ చరిత్రను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని ఈ.టి.నరసింహ విమర్శించారు. కాంగ్రెస్‌కు చెందిన సర్దార్ వల్లభాయ్ పటేల్, పి.వి.నరసింహారావు వంటి నాయకులను తమ ఖాతాలో వేసుకోవడంతో పాటు చిట్యాల ఐలమ్మ వంటి కమ్యూనిస్టు ఉద్యమ యోధుల చిత్రాలను ఉపయోగించుకోవడం చరిత్రను దొంగిలించడమేనన్నారు. సాయుధ పోరాటాన్ని మతాల మధ్య జరిగిన యుద్ధంగా చిత్రీకరించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని, వాస్తవ చరిత్రను ప్రజలకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీమాన్ పాల్గొన్నారు.

## రిజర్వేషన్లను వ్యతిరేకించేవారు... జనాభా ప్రాతిపదికన సంపద పంచడానికి సిద్ధమా?

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాల నరసింహ సవాల్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న వారు ముందుగా దేశ సంపద, భూములు, సహజ వనరులు, విద్య, ఉద్యోగాలు, పరిశ్రమల్లో జనాభా ప్రాతిపదికన వాటా పంచడానికి సిద్ధమా? అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాల నరసింహ సవాల్ విసిరారు. విశాఖపట్నంలో డిహెచ్‌పిఎస్ 20వ వార్షికోత్సవం సందర్భంగా అంబేద్కర్ ఆడిటోరియంలో జె.వి.ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా బాల నరసింహ మాట్లాడుతూ శతాబ్దాలుగా సామాజిక, ఆర్థిక అణచివేతకు గురైన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను వ్యతిరేకించడం అన్యాయమన్నారు. రిజర్వేషన్లు ఎవరికీ దానం కాదని, సామాజిక న్యాయం సాధించేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని స్పష్టం చేశారు. దేశ జనాభాలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇతర వెనుకబడిన వర్గాలు గణనీయంగా ఉన్నప్పటికీ సంపద, భూములు, పరిశ్రమలు, విద్య, ఉద్యోగాలు, అధికార వ్యవస్థల్లో వారి వాటా జనాభా నిష్పత్తికి అనుగుణంగా లేదన్నారు. సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతున్న తీరును ప్రశ్నించకుండా రిజర్వేషన్లను మాత్రమే వ్యతిరేకించడం వెనుకబడిన వర్గాలపై వివక్షను కొనసాగించడమేనని విమర్శించారు. కుల వివక్ష, అంటరానితనం, సామాజిక అసమానతలు పూర్తిగా నిర్మూలించే వరకు రిజర్వేషన్ల అవసరం ఉంటుందని అన్నారు. కుల నిర్మూలన, సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ తెలంగాణ అధ్యక్షుడు కె.ఏసురత్నం, ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్, నాయకులు బి.అశోక్, పొన్నగంటి లావణ్య, పొన్నగంటి రాజేష్, బి.సంతోష్, ఆనందరావు, గోపాలరావు, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆటో మీటర్ ఛార్జీలు పెంచాలి

- కనీస ఛార్జి రూ.40.. కిలోమీటర్‌కు రూ.18గా నిర్ణయించాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆటో సంఘాల జెఎసి విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆటో మీటర్ ఛార్జీలను పెంచి కనీస ఛార్జీని రూ.40గా, ప్రతి కిలోమీటర్‌కు రూ.18గా నిర్ణయించాలని తెలంగాణ ఆటో రాష్ట్ర సంఘాల యాప్ ఆధారిత సంఘాల జెఎసి నాయకులు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం మంత్రిని కలిసి ఈ నెల 7న జరిగిన ఆటో యూనియన్ నాయకుల సమావేశంలో చర్చించిన అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు విధివిధానాలను రూపొందిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్‌ను రూపొందించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. జిఓ నంబర్ 263లో మిగిలి ఉన్న ఆటో పర్మిట్లను త్వరలో జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇతర జిల్లాల ఆటోలను హైదరాబాద్‌లో నిషేధిస్తూ, ఆయా జిల్లాల ప్రజల అవసరాల కోసం వారికి హైదరాబాద్ నగరంలో ఆటో పర్మిట్లు ఇవ్వాలని జెఎసి నాయకులు కోరారు. ఈ నెల 7న జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను త్వరగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జెఎసి నాయకులు బి.వెంకటేశం, ఎ.సత్తిరెడ్డి, ముకేష్ గౌడ్, ఎం.ఎ.సలీం, వి.ప్రవీణ్, ఎం.డి.మజీద్, అజయ్ బాబు, రాంకిషన్ తదితరులు ఉన్నారు.

## బిజెపికి బిసిల ఓట్ల బహిష్కరణ

- అసెంబ్లీ బిసి తీర్మానానికి మద్దతివ్వకపోవడం సిగ్గుచేటు: జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణనలో ఓబిసి కాలమ్ చేర్చాలని కోరుతూ తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేయడం హర్షణీయమని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బిసి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో బిసి కులగణన తీర్మానానికి మద్దతు ఇవ్వకుండా బిజెపి సభ్యులు వాకౌట్ చేయడం బిసిలను అవమానించడమేనని విమర్శించారు. బిజెపి అసెంబ్లీని బహిష్కరిస్తే.. వచ్చే ఎన్నికల్లో బిసిలు బిజెపిని ఓట్లతో బహిష్కరిస్తారని హెచ్చరించారు. ఈ డిమాండ్లపై కేంద్రం వైఖరికి, అసెంబ్లీ తీర్మానానికి బిజెపి మద్దతు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 15న రాష్ట్రవ్యాప్తంగా బిజెపి నేతల దిష్టిబొమ్మలను దహనం చేయాలని పిలుపునిచ్చారు. బిసి కులగణనకు అనుకూలంగా అసెంబ్లీలో తీర్మానం చేయడంలో చొరవ చూపిన సిఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, సిపిఐ నేత కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం నేతలకు శ్రీనివాస్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు బిసి కులగణన తీర్మానాన్ని ప్రవేశపెట్టిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బిసి ప్రతినిధుల బృందం కలిసి అభినందించింది. కార్యక్రమంలో బిసి సంఘాల నేతలు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, పిట్ల శ్రీధర్, తాటిపల్లి వీరస్వామి, తిప్పరశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వాయిదా తీర్మానం తిరస్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొత్తగూడెం నియోజకవర్గంలోని పాల్వంచ కెటిపిఎస్ వద్ద ప్రతిపాదిత 2X800 ఎండబ్ల్యు విద్యుత్ విస్తరణ ప్రాజెక్ట్‌ను త్వరితగతిన పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం తీసుకుబోయే తదుపరి చర్యలు, కాలపరిమితిపైన రాష్ట్ర ప్రభుత్వం సభలో స్పష్టమైన ప్రకటన చేయాలని సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు సూచించారు. ఈ అంశంపై సభలో చర్చ చేపట్టాలని శాసనసభలో ఆయన శనివారం ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తిరస్కరించారు. ఎన్‌టిపిసి భాగస్వామ్యంతో విద్యుత్ విస్తరణ ప్రాజెక్ట్‌ను స్థాపించేందుకు ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని కూనంనేని వాయిదాతీర్మానంలో పేర్కొన్నారు. ప్రస్తుత మౌలిక సదుపాయాలను వాడుకుంటూ తక్కువ ఖర్చుతో ,పర్యావరణ అనుకూలంగా ఈ ప్రాజెక్ట్‌ను త్వరితగతిన పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.


## రాష్ట్రంలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు అక్కడక్కడా ఉరుములు, ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ప్రస్తుతం వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రాంతం దక్షిణ ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతాలపై కొనసాగుతోందన్నారు. దీనికి అనుబంధంగా ఉన్న ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందన్నారు. ఇది రాబోయే 24 గంటల్లో దక్షిణ ఛత్తీస్‌గఢ్, విదర్భ మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తాయన్నారు. శని, ఆదివారాల్లో రాష్ట్రంలో చాలా చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉత్తర, ఈశాన్య జిల్లాలైన ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నందున ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు.

అలాగే నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఎల్లో అలర్ట్ జారీ చేశామన్నారు. ఆది, సోమవారాల్లో ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.సోమ, మంగళవారాల్లో ఉత్తర, తూర్పు జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు నమోదు కానున్నాయన్నారు.

## నగరాలను హైదరాబాద్ పరిధిలోకి తీసుకురావాలి

- సిపిఐ శాసనసభాపక్షనేత కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న నల్లగొండ, వికారాబాద్, సంగారెడ్డి, సిద్ధిపేట, మెదక్, మేడ్చల్, రంగారెడ్డి పట్టణాలు, నగరాలను హైదరాబాద్ విశ్వ నగర పరిధిలోనికి తీసుకురావాలని, పరిపాలన బాధ్యతలు మాత్రం ఆయా పట్టణాలు, నగరాలకే అప్పగించాలని సిపిఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. 'గ్రేటర్' హైదరాబాద్‌ను తొలగించి, మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన నేపథ్యంలో 'హైదరాబాద్ విశ్వనగరం' అనే ట్యాగ్ మాత్రం ఉండాలని, తద్వారా పెట్టుబడులను, పరిశ్రమలను, కార్పొరేట్ కంపెనీలను ఆకర్షించేందుకు అవకాశం ఉంటుందన్నారు. శాసనసభలో శనివారం జరిగిన ''ప్రధాన పట్టణ ప్రాంత (సమగ్ర పాలన) బిల్లు (2026 ఎల్.ఎ. బిల్ నంబర్ 27) అంశంపైన జరిగిన చర్చలో కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి లేదా ఇతర ఉన్నతాధికారుల అధ్యక్షతన పరిసర పట్టణాలతో కూడిన పెద్ద హైదరాబాద్ విశ్వనగరంగా ఏర్పాటు చేసి, అందుకువీలుగా ప్రణాళికలను రూపొందించాలని, ఈ విషయమై నిపుణుల సలహాలు కూడా తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. హైదరాబాద్ విశ్వనగరం అనే పేరును నిలబెట్టాలని, నగర విస్తీర్ణం పెంచడం లేదా ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు. హైదరాబాద్ నగరం గతంలో దేశంలోనే రెండవ స్థానంలో ఉండేదని, హైదరాబాద్‌ను తిరిగి ఆ స్థానానికి తీసుకెళ్లాలని సూచించారు.

30 ఏళ్ల క్రితం కాలుష్యరహిత నగరంగా ఉన్న హైదరాబాద్, ప్రస్తుతం కలుషితనగరంగా మారిందని, ఢిల్లీ మొదటి స్థానంలో ఉంటే హైదరాబాద్ రెండు లేదా మూడో స్థానానికి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సిగ్నల్ పడితే 20 నిమిషాలు ట్రాఫిక్ జామ్ అవుతుందని, వర్షాలు పడితే హైదరాబాద్ కంటే గ్రామాలే బాగున్నాయన్నారు. వర్షం నీరు సాఫీగా వెళ్లేందుకు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారని, కానీ ఆ కార్యక్రమం ఇప్పటికీ సాధ్యం కాలేదన్నారు పేపర్‌పైన ఆదర్శాలు ఉంటున్నాయని, వాటిని ఆచరణలో అమలు కావడం లేదన్నారు. కలుషితం, ట్రాఫిక్, వర్షం ఇలాంటి పలు సమస్యలను పరిష్కరించే దిశఘా ప్రభుత్వం ఆలోచన చేయాలని కూనంనేని తెలిపారు. వందకు పైగా కాలం చెల్లిన నిబంధనలను సరిచేసేందుకు ఈ బిల్లును ప్రవేశ పెట్టారని, అవుటర్ రింగ్ రోడ్‌లో ఉన్న ప్రాంతాలను క్యూర్ అని పెట్టారని, దీనిని ఎలా అభివృద్ధి చేయాలి, కేంద్రీకృతమైన అధికారాలను వికేంద్రీకరణ చేసి, తద్వారా విశ్వనగరంగా ఎలా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఈ బిల్లును ప్రవేశపెట్టినట్టుగా తాము భావిస్తున్నామన్నారు.

**రోజురోజుకూ పెరుగుతున్న పట్టణ జనాభా**

రోజురోజుకూ పట్టణీకరణ పెరుగుతోందని, తెలంగాణ రాష్ట్ర జనాభాలోని సగ భాగం ప్రజలు కేవలం మూడు శాతం భూభాగమైన హైదరాబాద్ నగరంలో ఉన్నారని, తద్వారా అనార్థలకు మూలంగా మారుతోందని కూనంనేని సాంబశివరావు తెలిపారు. రాష్ట్ర వైశాల్యం 1,12,077 చదరపు కిలోమీటర్లు ఉండగా, ఇందులో 10,472 చదరపు కిలోమీటర్ల పరిధిలో హైదరాబాద్ నగరం ఉన్నదన్నారు. 2011 ప్రకారం 38.88 శాతం జనాభా ఉంటే, ప్రస్తుతం 50 శాతానికి పెరిగినట్టు అంచనాలు చెబుతున్నాయన్నారు. ఢిల్లీ నగరం 55,083 కిలోమీటర్లు, బెంగుళూరు 8005 కిలోమీటర్లు, హైదరాబాద్ 7257 కిలోమీటర్లు, పూణే 7256 ఆ తర్వాత ముంబయి, చెన్నై, కలకత్తా నగరాలు ఉన్నాయని వివరించారు. ఢిల్లీలో 2011 నాటికి కోటీ 63లక్షల మంది ఉన్న జనాభా ప్రస్తుతంట 3,30కోట్లకు పెరిగిందని, ముంబయి 1.84 కోటీ నుంచి 2.20 కోట్లకు పెరిగిందని, చెన్నైలో 87 లక్షల నుంచి కోటీ 15 లక్షలకు , బెంగుళూరు నగరంలో 85 లక్షల నుంచి కోటీ 30లక్షల మంది పెరిగారని, హైదరాబాద్ నగరంలో 2011 లో 77 కోట్ల జనాభా నుంచి కోటీ 13 లక్షలకు పెరిగారని కూనంనేని వివరించారు. అతి సమీపంలోనే ఢిల్లీ తర్వాత రెండవ స్థానానికి హైదరాబాద్ వెళ్లే అవకాశాలు ఉన్నందున త్వరలోనే స్పష్టమైన ప్రణాళికను రూపా ందించాలని ప్రభుత్వానికి సూచించారు.



శాసనసభలో సిపిఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివ రావు శనివారం ప్యానల్ స్పీకర్‌గా వ్యవహరించారు. శాసనసభలో ప్రధాన పట్టణ ప్రాంత (సమగ్ర పాలన) బిల్లు (2026, ఎల్.ఎ.బిల్ నంబర్ 27)పై జరిగిన చర్చ సమయంలో కూనంనేని ప్యానల్ స్పీకర్‌గా వ్యవహరించారు.

## ప్రొఫెషనల్స్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలి

ఎఐసిసి తెలంగాణ ప్రతినిధులతో మధుయాష్కి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన వృత్తి నిపుణులు, మేధావులను కాంగ్రెస్ పార్టీకి అనుసంధానం చేయడం ద్వారా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని మధుయాష్కి సూచించారు. ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఎఐసిసి) జాతీయ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్‌ను ఎఐసిసి తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు శనివారం బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతాన్ని అడ్డుపెట్టుకుని సాగిస్తున్న విభజన రాజకీయాలను ఎదుర్కొనేందుకు మేధావి వర్గాలను ఒకే వేదికపైకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం, ఎఐసిసి తెలంగాణ రాష్ట్ర చైర్మన్ జి. ఆదిత్యరెడ్డి, డాక్టర్ సౌజన్య, క్వీన్ విక్టోరియా, ధనలక్ష్మి , నితిజ్ఞ, సుబ్బారావు, శశాంక్, భరత్‌రెడ్డి, సంతోష్, అధిత తదితరులు పాల్గొన్నారు.



## వినాయక నిమజ్జన ప్రశాంతంగా నిర్వహించాలి : జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** వినాయక నిమజ్జనాలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మల్కాజ్‌గిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. శనివారం శామీర్‌పేట పెద్ద చెరువును కీసర డిప్యూటీ కమిషనర్ రామలింగం, జిల్లా ఆర్టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డితో కలిసి సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శామీర్‌పేట చెరువులోని నిమజ్జన ప్రాంతాన్ని అధికారులతో కలిసి సందర్శించి చేపట్టాల్సిన కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రత్యేకంగా నిమజ్జన ప్రాంతంలో భద్రత చర్యలను పటిష్టం చేయాలని, ప్రజల రాకపోకలకు అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రదేశంలో అవసరమైన క్రేన్లు, భారికేడ్లు లైటింగ్, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య ఏర్పాట్లు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. నిమజ్జన ప్రాంతంలో విద్యుత్, రహదారులు, పారిశుద్ధ్యం, పోలీస్, ట్రాఫిక్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే దేవరయాంజాల్, పోతాయిపల్లి, చెరువులను అధికారులను, ప్రజాప్రతినిధులతో కలిసి సందర్శించి ఆయా ప్రాంతాల్లో నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో డిఇ మాధవ చారి, ఎఇ నీరిషారెడ్డి, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి రమేష్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.




## పర్యావరణహిత గణేష్ విగ్రహాల పంపిణీ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320హెచ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి పర్యావరణహిత గణేష్ విగ్రహాలను పంపిణీ చేశారు.ఇసిఐఎల్‌లోని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ సిఐ భాస్కర్‌రెడ్డి,ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి క్యాంప్ కార్యాలయం, విద్యుత్, మున్సిపల్, రెవెన్యూ సిబ్బందికి డిస్ట్రిక్ట్ సెక్రెటరీ గ్లోబల్ కాజెస్ లయన్ కొత్తపల్లి రాంబాబు పిఎంజేఎఫ్ ఆధ్వర్యంలో 2500 విగ్రహాలను అందజేశారు.ఎమ్మెల్యే,సిఐ లయన్స్ సభ్యులు చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ,సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్,లయన్స్ క్లబ్ హస్పిటల్ చైర్మన్ కొత్త రామారావు మాట్లాడుతూ సామాజిక అభివృద్ధికి,పేదల సంక్షేమానికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ కోట వెంకట్‌రెడ్డి,ఎం మోహన్,బాలవాసి వెంకటేశ్వర్లు,పెద్ది శ్రీనివాస్,దివాకర్,పిపి రమణ,ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడి ఆకృతిలో విద్యార్థులు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** నాగారం డివిజన్ పరిధిలోని సెరినిటీ పాఠశాలలో విద్యార్థులు వినాయక పండుగను పురస్కరించుకుని వినాయకుని ఆకృతిలో విన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి, ముఖ్య కార్యదర్శి నోముల వసంతలు విన్యాసం చేసిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## వినాయక చవితి,నిమజ్జన భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

### నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** వినాయక చవితి, గణేష్ నిమజ్జన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు భక్తులు, నిర్దీహకులు, ప్రజలు తప్పని సరిగా సూచనలు పాటించాలని కుషాయిగూడ సిఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. గణేష్ మండపాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని,డిజే సౌండ్ సిస్టమ్ ఉపయోగించరాదని,విద్యుత్ తీగలు,విద్యుత్ స్తంభాలు,ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని,అత్యవస పరిస్థితుల్లో అంబులెన్స్,ఫైర్ ఇంజన్‌లాంటి వాహనాలు సులభంగా వెళ్లేందుకు తగినంత రహదారి మార్గాన్ని తప్పనిసరిగా ఖాళీగా ఉంచాలని తెలిపారు.కాప్రా పాండ్‌లో 5 అడుగుల లోపు ఎత్తు కల్గిన గణేష్ విగ్రహాలకు మాత్రమే నిమజ్జనానికి అనుమతి ఉంటుందని,5 అడుగుల కంటే ఎక్కుల ఎత్తు కల్గిన గణేష్ విగ్రహాలను ప్రతిష్టించే ఉత్సవ కమిటీ నిర్వహకులు ముందుగానే ప్రత్యాన్మ నిమజ్జన ప్రదేశాలను ఎంపిక చేసుకుని రాంపల్లి(కీసర),శామీర్‌పేట్ తదితర నిర్దేశిత చెరువులను నిమజ్జనం కోసం వినియోగించుకోవాలి,నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీసులకు సహకిరించాలని అన్నారు

## జోనల్ లెవెల్ టోర్నమెంట్‌లో విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ సర్కిల్ పరిధిలోని బహదూర్ పల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచారు. బిఆర్ఎస్ నాయకులు టి.సుధాకర్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అండర్ 14 గర్ల్స్ విభాగంలో మొదటి స్థానం, అండర్ 14 బాయ్స్ వాలీబాల్ రెండ వ స్థానం, అండర్ 14 గర్ల్స్ వాలీబాల్ రెండో స్థానం, అండర్ 14 అండర్ 17 బాయ్స్ అండ్ గర్ల్స్ డిస్ట్రిక్ట్ లెవెల్ టోర్నమెంట్‌లో సెలెక్ట్ అవ్వడం గర్వకానణమని స్కూల్ ప్రిన్సిపల్ అన్నారు.



# వర్క్‌షాప్‌ల ఆధునీకరణకు ప్రాధాన్యం





**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే వర్క్‌షాప్‌లలో భద్రత, నాణ్యత, సాంకేతిక ఆధునీకరణకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. శనివారం లాలాగూడలోని ఇంజినీరింగ్ వర్క్‌షాప్, మెట్టుగూడలోని సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ వర్క్‌షాప్‌లను ఆయన తనిఖీ చేశారు. లాలాగూడ వర్క్‌షాప్‌లో వెల్డింగ్ షాప్‌ను పరిశీలించిన జీఎం.. ఫ్యాబ్రికేషన్ ప్రమాణాలు, గ్లూడ్ జాయింట్ల తయారీ ప్రక్రియలను తనిఖీ చేశారు. ఉత్పత్తుల విశ్వసనీయతను అంచనా వేసేందుకు నిర్వహించిన పుల్‌అవుట్ పరీక్షను పరిశీలించారు. ప్లాంట్ భద్రత, సిబ్బంది సౌకర్యాలు, పరిశుభ్రత, ఉద్యోగుల సంక్షేమంపై అధికారులతో సమీక్షించారు. అనంతరం మెట్టుగూడ ఎస్‌అండ్‌టి వర్క్‌షాప్‌లో పాయింట్ మెషీన్, ఎలక్ట్రికల్ షాప్‌లను పరిశీలించారు. వర్క్‌షాప్ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు తయారీ ప్రక్రియలో ఖచ్చితత్వాన్ని మెరుగుపరిచే నూతన సిఎన్‌సి బెండింగ్ మెషీన్‌ను ప్రారంభించారు.

సాంకేతిక ఆధునీకరణ, సామర్థ్య నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘా ల ప్రతినిధులతో జీఎం సమావేశమై సిబ్బంది సంక్షేమం, ఉద్యోగుల భాగస్వామ్యంపై చర్చించారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం లో పాల్గొని పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధికి రైల్వే చేపడుతున్న హరిత కార్యక్రమాల ను ప్రోత్సహించారు. ఆయన వెంట ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ డి. ఆంజనేయులు రెడ్డి, ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్ పి.వి.మురళీకృష్ణ, చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ వి.ఎన్.ఎం.రావు, తదితర సీనియర్ అధికారులు ఉన్నారు.

## వినాయక మండపాల కోసం ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలి

**ప్రజాపక్షం/బోడుప్పల్:** వినాయక పర్వదిన సందర్భంగా వివిధ ప్రాంతాల్లో నెలకొల్పే వినాయక మండపాల కోసం ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకొని అనుమతులు తీసుకోవాలని మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి సూచించారు. నిర్వాహకులు మండపాలను ప్రజా రాకపోకలు, అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలుగకుండా మండపాలను ఏర్పాటు చేయాలని, డిజె, మద్యం, జూదం, అసభ్యకర కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. మండపాల వద్దకు వచ్చే సందర్శకులు, భక్తుల కోసం సరైన రీతిలో క్యూ లైన్లు, బ్యారికేడ్లు, వాలంటీర్లు, సిసిటివి కెమెరాలు, పార్కింగ్ సదుపాయం, అవసరమైన భద్రతా సౌకర్యం విషయాల్లో ముందస్తు ఏర్పాట్లు ఉండాలన్నారు. అనుమతులకు ఎలాంటి రుసుం ఉండదన్నారు. అనుమతుల కోసం నిర్వాహకులు బాధ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు, https://policeportal.tspolice.gov.in/userverifcn.htm పోర్టల్‌లో పూర్తి వివరాలు పొందుపరచి, వాటికి సంబంధించిన పత్రాలను పోలీస్‌స్టేషన్‌లో అందచేయాలన్నారు. ప్రతి రోజు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలన్నారు. ఇతరుల మనోభావాలు కించపరచే విధంగా ప్రసంగాలు, పాటలు, ఫ్లెక్సీలు ఉండరాదన్నారు. అదే విధంగా నిమజ్జన సందర్భంగా నిర్వహించే శోభాయాత్రలో సైతం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా జరిగేలా పోలీసులతో పాటు సంబంధించిన అధికారులు, సిబ్బందితో సహకరించాలన్నారు. మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వస్తువులు, కానీ వ్యక్తులు కానీ కనపడితే వెంటనే సమాచారమివ్వాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వందతులను నమ్మటం కానీ ప్రచారం చేయటం కానీ చేయవద్దన్నారు.



## మట్టి వినాయకుడు...పర్యావరణానికి మేలు

**ప్రజాపక్షం/దుండిగల్ :** కొంపల్లి సర్కిల్ దూలపల్లి డివిజన్‌లో పిఎంఎస్ హెచ్‌ఆర్‌ఐ జడ్పీహెచ్‌ఎస్ దూలపల్లి పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఎకో ఫ్రండ్లీ వినాయక విగ్రహాల తయారీ కార్యక్రమంలో విద్యార్థులు సహజసిద్ధమైన మట్టి, ఇతర పర్యావరణహిత పదార్థాలతో వినాయక విగ్రహాలను స్వయంగా తయారు చేసి, వాటిని అందంగా డిస్ప్లే చేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, కళాత్మక నైపుణ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించబడింది. ఈ సందర్భంగా, విద్యార్థులు తయారుచేసిన వినాయక విగ్రహాలు, వాటి ప్రదర్శనను పరిశీలించి, చక్కగా తయారు చేసి ప్రదర్శించిన తరగతుల క్లాస్ టీచర్లకు బహుమతులు అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులు, క్లాస్ టీచర్లు, పాఠశాల సిబ్బందికి హెచ్‌ఎం కెవిఈఎన్‌యు జిటిపిఎల్ అభినందనలు తెలిపారు. మట్టి వినాయకుడు పర్యావరణానికి మేలు, పర్యావరణ పరిరక్షణే మన బాధ్యత అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అనురాగ్‌లో బిల్డథాన్ 2.0



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థుల్లో సృజనాత్మకత,సాంకేతిక నైపుణ్యలను ప్రోత్సహించే లక్ష్యంతో అనురాగ్ యూనివర్సిటీలో బిల్డథాన్ 2.0 నిర్వహించారు.ఇంజినీర్స్‌డేలో భాగంగా సివిల్ ఇంజినీరింగ్ విభాగం, అదానీ సిమెంట్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వినూత్న నమూనాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

జ్యోతి ప్రజ్వలన అనంతరం భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళులు అర్పించారు. విభాగాధిపతి డా.పల్లవి బద్రి. డీన్ డా.వి.విజయ కుమార్, పరీక్షల విభాగం డీన్ ప్రొఫెసర్ ఎం.ముత్తరెడ్డి, వైస్ ఛాన్సలర్ డా. అర్చన మంత్రి,ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎస్.నీలిమ ప్రసంగించారు. ఎపిసిఇ ఇండియా ప్రధాన కార్యదర్శి ఎకెఆర్ అసోసియేట్స్ డైరెక్టర్ ఇంజినీరింగ్ ఎ.కాశీరామ్, అదానీ సిమెంట్ ప్రాంతీయ అధికారి కృష్ణ నున్ని పాల్గొన్నారు. ఏఎఫ్‌కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ టన్నెలింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు డా. లక్ష్మణరావు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ఆధునిక నిర్మాణ సాంకేతికతలు భవిష్యత్ అవకాశాలను వివరించారు. అనురాగ్ యూనివర్సిటీ ఇంజినీరింగ్ ఎం.సుదర్శన్ రెడ్డిని సత్కరించారు అనంతరం బిల్డథాన్ 2.0నమునా ప్రతర్శనను ప్రారంభించారు. పరిశ్రమ, విద్యాసంస్థల అనుసంధానం తో విద్యార్థుల్లో ప్రయోగాత్మక పరిజ్ఞానం సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడమే కార్యక్రమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## రాయదుర్గ్ వక్ఫ్ భూముల పరిరక్షణకు పోరాడుదాం

### ఇప్టు జాతీయ కన్వీనర్ షేక్షావలి

**ప్రజాపక్షం/జవహర్ నగర్:** రాయదుర్గ్ వక్ఫ్ భూముల పరిరక్షణకై పోరాడుదామని, ప్రభుత్వం అమ్ముకోవాలని చూడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఇప్టు జాతీయ కన్వీనర్ షేక్షావలి తెలిపారు. వక్ఫ్ బచావో తహ్రీక్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని శనివారం ప్రకటించారు. వక్ఫ్ భూముల వేలం విషయంలో సిఎం రేవంత్ రెడ్డి ప్రజాస్వామికంగా వ్యవహరించాలని డిమాండ్ చేశా రు.

అధికారుల నిర్లక్ష్యం, అవినీతి వల్ల ముస్లీం మైనార్టీ విద్య, ఉపాధి, ఇతర సామాజిక వర్గాల ప్రయోజనాలు దెబ్బతినే ప్రమాదం ఉన్నందు రాజకీయాలకు అతీతంగా భూముల పరిరక్షణకు ఐకమత్యంతో మెలగాలని సూచించారు. ఇందిరాపార్కు వద్ద ఆదివారం నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో లక్షా 3 వేల 857 కేసులు పరిష్కారం




**ప్రజాపక్షం/చర్లపల్లి:** కుషాయిగూడ జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసుల గూర్చి సంస్థ ప్రధాన కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జిఎస్ఎల్ ప్రియాంక ప్రసంగించారు.జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 24 బెంచులు,అన్ని కోర్టులలో 1 లక్ష 3వ వేల 857 కేసులు పరిష్కరించబడ్డాయి. ఇందులో 46 సివిల్ కేసులు 11 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించారు.లోక్ అదాలత్‌లో 54 లక్షల 75 వేల రూపాయలు పరిహారం కింద చెల్లించబడ్డాయని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి తిరుపతి,బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పోలీసు, కోర్టు, బ్యాంకు, బిఎస్ఎన్ఎల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిఎస్ఐఆర్ యుజిసినెట్‌లో ఈశ్వర్ కుమార్‌కు జాతీయ స్థాయిలో 42వ ర్యాంకు



**ప్రజాపక్షం/దుండిగల్ :** జాతీయ పరీక్షల సంస్థ నిర్వహించిన జాయింట్ సిఎస్ఐఆర్ యుజిసి. యుజిసి నెట్ జూన్ 2026 ఫలితాల్లో నగరానికి చెంది న ఆరకల ఈశ్వర్ కుమార్ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్ విభాగంలో ఆయన ఆల్ ఇండియా 42వ ర్యాంకు సాధించి జూనియర్ రీసెర్చ్ ఫలోషిప్ అసిస్టెంట్ ప్రొఫసర్ అర్హతను దక్కించుకున్నారు. ఈ పరీక్షలో ఈశ్వర్ కుమార్ 200 మార్కులకు గాను 138.400 మార్కులు (98.86 పర్సంటైల్) సాధించారు. కుత్బుల్లాపూర్ గాంధిమైసమ్మ నివాసితులైన ఆరకల రాజ్‌కుమార్, రమాంజన దంపతుల కుమారుడైన ఈశ్వర్ కుమార్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుం చి జియాలజీలో పిజి పూర్తి చేశారు. గతంలో డిగ్రీ స్థాయిలో ఉస్మానియా యూనివర్సిటీ గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు, ప్రతిష్టాత్మక ఇస్రో సీఎస్ఐఆర్ఎన్ఐఓ వంటి సంస్థ ల్లో రీసెర్చ్ ఇంటర్న్‌గా పని చేశారు. జాతీయ స్థాయి లో ఉత్తమ ర్యాంకు సాధించిన ఈశ్వర్ కుమార్‌ను కుటుంబ సభ్యులు, అధ్యాపకులు, మిత్రులు అభినందించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టభద్రులు తగిన బుద్ధి చెప్పాలి..



**ప్రజాపక్షం/నవాబుపేట్:** నవాబుపేట మండల కేంద్రం లోని లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో యువత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై యువత తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకు లు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. పోలీసులకు ప్రభుత్వం అక్రమ ఆదేశాలు ఇస్తూ ప్రజలపై కేసులు నమోదు చేయడం, బైండోవర్ చేయడం ద్వారా ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. రాబోయే బీఆర్ఎస్ ప్రభుత్వంలో విద్యార్థులు, యువతకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని అన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో డిగ్రీ పూర్తి చేసిన యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. యువత రాజకీయాల్లో కి వచ్చి ప్రజా సమస్యలపై పోరాడే నాయకులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మాజీ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనం ద్, రాష్ట్ర విద్య, వైద్య మౌలిక వసతుల మాజీ చైర్మన్ గెద్దం నాగేందర్ గౌడ్, నాయకులు దేశామొల్ల ఆంజనేయులు, విజయ్ ఆర్య, మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు అంతమొల్ల దయాకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు భరత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తం చారి, శాంతి కుమార్, మహేశ్వర్ రెడ్డి, సుభాన్ రెడ్డి, జామ చంద్రం, సుధాకర్, సంతోష్ కుమార్, కావలి రాజు, మాణిక్ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.




## విద్య కాషాయీకరణకు కుట్ర

### 90వ వార్షికోత్సవ మహాసభల సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** ఈ నెల 28 నుండి 30 వరకు హన్మకొండ జిల్లా వేదికగా ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ మహాసభలను భారీ సంఖ్యలో విద్యార్థులు, మేధావులు, పూర్వ ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పిలుపిచ్చారు. శనివారం ఉప్పల్ డిపో కార్యాలయం ఎదుట ఎఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో మహాసభలకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్రోద్యమం, తెలంగాణా సాయుధ పోరాటం, మలిదశ తెలంగాణా ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర పోషించిన ఏకైక విద్యార్థి సంస్థఏఐఎస్ఎఫ్ అని అన్నారు. విద్యారంగాన్ని పాలకులు బలోపేతం చేసే దిశగా కాకుండా నిర్వీర్యం చేసే యత్నాలు చేస్తూ కార్పొరేట్, ప్రయివేట్ సంస్థలకు దారాదత్తం చేస్తున్నాయని విమర్శించారు. కేంద్రం నూతన జాతీయ విద్యా విధానం తీసుకొని వచ్చి విద్యను కాషాయీకరణ చేసేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. ప్రవేశ పరీక్షలు, పోటీ పరీక్షలు సక్రమంగా నిర్వహించలేక పరీక్షా పత్రాల లీకులతో విద్యార్థి లోకానికి తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్, ఉపాధ్యక్షులు హరీష్, దుర్గాప్రసాద్, శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.



## గణేష్ మండపాల దగ్గర డిజెలు పెట్టొద్దు

**ప్రజాపక్షం /దౌల్తాబాద్ :** కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండల పరిధిలోని 33 గ్రామాల్లో గణేష్ మండపాల దగ్గర డీజెలు పెట్టవద్దని ఎస్ఐ వేణుకుమార్ తెలిపారు. రాబోయే 14వ తేదీ నుండి వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేస్తున్న గణేష్ మండపాల్లో డిజెలు ఏర్పాటు చేయవద్దని , సౌండ్‌ను తగ్గించుకోవాలని తెలిపారు. డిజె సౌండ్‌వల్ల గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారికి మరణాలు సంభవించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గణేష్ ఉత్సవ కమిటీ మెంబర్లు, సభ్యులు పాల్గొన్నారు.




## నూతన విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం.. సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ నూతన విద్యార్థుల స్వాగత కార్యక్రమం 'సారంగ్ 2026 ఫ్రెషర్స్ డే' ఘనంగా నిర్వహించారు. శనివారం కళాశాల ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు, అధ్యాపకులు ఆత్మీయ స్వాగతం పలికారు. విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుంటూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పాటలు, నృత్యాలు, వినోద కార్యక్రమాలతో ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహభరితంగా నీర్వహించారు. చదువుతో పాటు సాంస్కృతిక, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని కళాశాల వర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ డాక్టర్ పి.శ్రీధర్ సార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మురళీ ప్రసాద్ నూతన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారిస్తూ, తమ ప్రతిభను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కళాశాలలో లభించే విద్యా, సాంస్కృతిక అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. సంస్థ చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యే, మల్కాజ్‌గిరి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ అను శ్రేయ రెడ్డి, మర్రి ధీరన్ రెడ్డి, ట్రెజరర్ మర్రి మమతా రెడ్డి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.



## మూడు నెలలుగా జీతాల్లేవ్..ఇంకా ఎన్నాళ్లు? సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదు..కార్మికులు

**ప్రజాపక్షం/వికారాబాద్ :** మున్సిపాలిటీలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా పని ప్రదేశాల్లో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. తమకు నెలల తరబడి వేతనాలు అందకపోవడం పట్ల వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య పనులు, చెత్త సేకరణ, రోడ్లు, కాలనీల పరిశుభ్రత తదితర విధులు నిర్వహిస్తున్న తమ కుటుంబాల పరిస్థితిని అధికారులు, ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరుతున్నారు. మూడు నెలలుగా జీతాలు అందకపోవడంతో కుటంబ పోషణ భారంగా మారిందని కార్మికులు వాపోతున్నారు. ఇంటి అద్దె, పిల్లల చదువులు, నిత్యావసరాలను తీర్చుకోవడానికి సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే సమ్మె బాట పట్టక తప్పదని స్పష్టం చేశారు.



## సిఎం రేవంత్‌రెడ్డికి మట్టి వినాయకుడిని అందించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వినాయక చవితి సందర్భంగా పర్యావరణహితమైన మట్టి గణపతుల వినియోగాన్ని ప్రోత్సహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మట్టి వినాయకుడిని మంత్రి అందజేశారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సహా పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రసాయనాలతో తయారైన విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించడం ద్వారా జల, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని పొన్నం పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు.

## సీతారాం ఏచూరి ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలి



**ప్రజాపక్షం/యాచారం :** సితారాం ఏచూరి ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని సిపిఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి ఎ. నర్సింహ్మా అన్నారు. శనివారం మండల పరిధిలోని మాల్ వ్యాపార కేంద్రంలో సితారాం ఏచూరి 2వ వర్ధంతి సందర్భంగా అయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా నర్సింహ్మా మాట్లాడుతూ ఉన్నత కుటుంబంలో పుట్టిన ఏచూరి బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారన్నారు. అయన అశయ సాధన కోసం ప్రతిఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా అయన చేసిన కృషి మరువలేనిదని తెలిపారు. ఇందిరగాంధీ ఎమర్జెన్సీ విధించిన సందర్భంలో అమేకు వ్యతిరేఖంగా మాట్లాడిన మేధావి ఏచూరి అని అన్నారు. రాజ్యసభ సభ్యుడిగా, విద్యార్థులు ఎదురు కుంటున్న సమస్యలపై అయన రాజీలేని పోరాటం నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చందునాయక్,ఎ. జంగయ్య,మండల కమిటి సభ్యులు వెంకటయ్య,తావునాయక్,జగన్,విప్లవ్‌కుమార్,సత్యనారాయణ,సాయికుమార్,జంగయ్య,రాములు,రమేశ వెవకటేశ్, శ్రీకాంత్,రాజు,నర్సింహ్మా తదితరులు పాల్గోన్నారు.

## శాంతియుతంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించుకోవాలి : సిఐ



**ప్రజాపక్షం/షాబాద్:** శాంతి యుతంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించుకోవాలని షాబాద్ సిఐ లక్ష్మీ రెడ్డి అన్నారు. శనివారం షాబాద్ స్టార్ గార్డెన్‌లో గణేష్ పీస్ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో గణేష్ ఉత్సవ కమిటిలు తప్పని సరిగా శాంతి భద్రతలను కాపాడుతు భక్తి భావం అందరూ ఐక్యమత్యంతో వినాయక చవితి జరుపుకోవాలని చెప్పారు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న గణేష్ మండలపాల వివరాలు స్టేషన్‌లో ఇవ్వాలన్నారు. విద్యుత్ అధికారుల అనుమతి మెరకు మండపాల దగ్గర విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలు ఉంటే విద్యుత్ అధికారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల దగ్గర ఎలాంటి అవాంఛనీ సంఘటనలు జరగకుండ ముందస్తుగా గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామంలో గణేష్ మండపాల దగ్గర ఇతరులకు ఇబ్బంది కల్గకుండ డీజే సౌండ్ సిస్టమ్ నిషేదం అన్నారు. ఈ కార్యక్రమంలో షాబాద్ ఎస్సై చెన్నారెడ్డి, విజయ్,ఫైర్ పోలీస్ అధికారి రవీందర్ రెడ్డి, విద్యుత్ అధికారి కోటేశ్వర్ రావు, ఆర్ఐ ఖాజా, వివిధ గ్రామాల గణేష్ మండపాల నిర్వహికులు తదితరులు పాల్గొన్నారు.

## హుడా కాలనీలో మెగా రక్తదాన శిబిరం




**ప్రజాపక్షం/మియాపూర్:** హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీలో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా తాజా మాజీ కార్పొరేటర్లు హమీద్ పటేల్, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి కొండా విజయ్ కుమార్‌ను శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరంలో పాల్గొన్న రక్తదాతలకు ప్రశంసాపత్రాలను గాంధీ అందజేశారు. సామాజిక సేవలో భాగంగా జన్మదిన వేడుకలను రక్తదాన శిబిరం ద్వారా నిర్వహించడం అభినందనీయమని,ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, హోప్ ఫౌండేషన్ ప్రతినిధులు, రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మణాలు

### గురునానక్ కళశాల యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలి : ఒయు జెఎసి డిమాండ్

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు నిర్మిస్తున్న గురునానక్ ఇంజీనీరింగ్ కళశాల యాజమాన్యాంపై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని ఒయు జెఎసి నాయకులు జోగు నరేందర్ డిమాండ్ చేశారు. శనివారం ఇబ్రహీంపట్నంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఖానాపూర్ గ్రామ సమీపంలో సర్వే నెంబర్ 80లో గురునానక్ ఇంజీనీరింగ్ కళశాల యాజమాన్యం అక్రమంగా ప్రభుత్వ భూమిని గతంలో కబ్జా చేస్తే రెవిన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ సూచిక బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆదినంలోకి తీసుకుందని అన్నారు.రెవిన్యూ అధికారుల ఉత్తర్వులను ఉల్లంఘించి మూడు రోజులు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రావటంతో తిరిగి గురునానక్ యాజమాన్యం అక్రమ నిర్మాణ కట్టడాలు చేపడుతుందని ఆరోపించారు.ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోని కబ్జా చేసిన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



# ఒకే నగరం.. ఒకే పరిపాలన

## హైదరాబాద్‌కు ‘క్యూర్-2026’ చట్టం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగర పరిపాలనలో సమూల మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం అమల్లో ఉన్న జిహెచ్ఎంసి 1955 చట్టాన్ని రద్దు చేసి, దాని స్థానంలో ‘క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్)2026’ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టింది. ‘ఒకే నగరం.. ఒకే పరిపాలన.. ఒకే చట్టం’ అనే నినాదంతో రూపొందించిన ఈ బిల్లులో నగర పాలనను సమగ్రంగా ఒకే వ్యవస్థ కిందకు తీసుకురావాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని జిహెచ్ఎంసితో పాటు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలన్నింటికీ ఈ చట్టం వర్తించనుంది. ఐదు భాగాలు, 43 అధ్యాయాలు, 319 సెక్షన్లు, తొమ్మిది షెడ్యూళ్లతో రూపొందించిన ఈ బిల్లులో నగర పరిపాలనకు కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యమంత్రి అధ్యక్షుడిగా అత్యున్నత పరిపాలన మండలి ఉండగా, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి కార్యనిర్వాహక కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. నగర పాలక సంస్థతో పాటు పోలీసు, హైడ్రా, జలమండలి తదితర శాఖలను ఒకే పరిపాలనా వ్యవస్థలో భాగం చేయడం ద్వారా సమన్వయాన్ని పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ బిల్లు ద్వారా వార్డు స్థాయిలో వికేంద్రీకరణను కొనసాగిస్తునే, విధానపరమైన నిర్ణయాల్లో అన్ని విభబూగాలను ఒకే తాటిపైకి తెచ్చి, పారదర్శకమైన వేగవంతమైన ప్రజాపాలనను అందించాలని ప్రభుత్వం భావిస్తుంది.



### వ్యాపార, పౌర అనుకూల సంస్కరణలు

వ్యాపార, పౌర అనుకూల సంస్కరణలు ద్వారా సమగ్ర ట్రేడ్ లైసెన్స్, నైట్ ఎకానామీ జోన్‌లు, ఆన్‌లైన్ భవన నిర్మాణ అనుమతులు. డిమ్డ్ అప్రూవల్ విధానం అమల్లోకి రానుంది.

### పాత నిబంధనల తొలగింపు

1955 నాటి పాతబడిన ఆక్ట్రాయ్ పన్ను, బండ్లు, జంతువుల పన్నులు, కాలం చెల్లిన నిబంధనలను పూర్తిగా రద్దు చేసి, ఆధునిక చట్టాలకు అనుగుణంగా మార్పులు చేశారు.

### అక్రమ నిర్మాణాలపై కఠిన నిబంధనలు..

అక్రమ నిర్మాణాలపై ఈ బిల్లులో అత్యంత కఠిన నిబంధనలను చేర్చారు. అనుమతి లేకుండా నిర్మించిన భవనాలపై ఆస్తి పన్నుకు అదనంగా 100 నుంచి 300 శాతం వరకు జరిమానా విధించే అవకాశం కల్పించారు. అవసరమైతే భవనాలను కూల్చివేయడం, సీజ్ చేయడం, విద్యుత్, తాగునీరు, మురుగునీటి కనెక్షన్లను నిలిపివేయడం వంటి చర్యలు తీసుకునే అధికారం అధికారులకు ఉంటుంది. భవన వినియోగాన్ని అనుమతి లేకుండా మార్చినా జరిమానా విధించనున్నారు.
సెక్షన్ 164 ప్ర కారం అనుమతిలేని నిర్మాణాలకు కమిషనర్ నోటీసు జారీ చేసిన 15 రోజుల్లో యజమానులు స్వయంగా వా టిని తొలగించాలి. అలా చేయకపోతే మున్సిపల్ అధికారులు కూల్చివేసి, వచ్చిన వ్యయాన్ని ఆస్తి పన్నులో జమ చేస్తారు. ప్రజల భద్రతకు ముప్పు ఉన్న భవనాలను సెక్ష న్ 165 ప్రకారం నోటీసు లేకుండానే సీజ్ చేసే అధికారాన్ని అధికారులకు కల్పించారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేని భవనాలకు విద్యుత్, తాగునీరు, మురుగునీటి కనెక్ష న్లు ఇవ్వకుండా సెక్షన్ 167లో స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి, వాటిని రిజిస్ట్రేషన్ చ ట్టంలోని సెక్షన్ 22ఎ కింద నిషేధిత జాబితాలో చేర్చాల ని బిల్లులో ప్రతిపాదించారు. ఇటువంటి వ్యవహారాల్లో ప్రజలు నష్టపోతే కమిషనర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని చట్టంలో పొందుపర్చారు.

### క్యూర్ అప్పిలేట్ అథారిటీ..

మున్సిపల్ కమిషనర్ నిర్ణయాలపై ప్రజలు 30 రోజుల లోపు అప్పీల్ చేసుకునేందుకు క్యూర్ అప్పిలేట్ అథారిటీని ఏర్పాటు చేయనున్నారు. సివిల్ కోర్టు అధికారాలతో పనిచేసే ఈ సంస్థలో ఛైర్‌పర్సన్‌తో పాటు ఇద్దరు నుంచి నలుగురు పూర్తికాల సభ్యులు ఉంటారు. సభ్యులను ప్రభుత్వం, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శితో కూడిన కమిటీ ఎంపిక చేస్తుంది.

### డిజిటల్ విధానంలోకి నగర పరిపాలన..

నగర పరిపాలనను పూర్తిగా డిజిటల్ విధానంలోకి తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఒకే వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా భవన అనుమతులు, పన్నులు, రుసుములు, ఇతర పౌర సేవలు అందించేలా ప్రతిపాదించింది. భవిష్యత్తులో ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన చెల్లింపులను కూడా ఇదే పోర్టల్‌లో సమీకరించాలని నిర్ణయించింది. రియల్‌టైమ్ పర్యవేక్షణ కోసం స్మార్ట్ గవర్నెన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు.

### ప్రతి భవనానికి ప్రత్యేక ఐడెంటిటీ కోడ్

హైదరాబాద్‌లోని ప్రతి భవనానికి ప్రత్యేక ప్రాపర్టీ ఐడెంటిటీ కోడ్ అపార్ట్‌మెంట్‌లలోని ప్రతి ఫ్లాట్‌కు సబ్ ఐడెంటిటీ కోడ్ కేటాయించనున్నారు. ఈ కోడ్ ఆధారంగా ఆస్తి వివరాలు, ఆస్తి పన్ను, నీటి, విద్యుత్ బిల్లులు తదితర చెల్లింపులను ఒకే వేదికపై నిర్వహించే అవకాశం కల్పించనున్నారు.

### హైడ్రాకు చట్టబద్ధమైన అధికారాలు

హైడ్రాకు ఈ బిల్లులో చట్టబద్ధ హోదాతో పాటు అదనపు అధికారాలు కల్పించారు. సొంత పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి కొన్ని నేరాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసే అధికారం ఇవ్వడంతో పాటు అగ్నిమాపక భద్రతా తనిఖీలు, నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌పై చర్యలు తీసుకునే అధికారాలను కూడా హైడ్రాకు అప్పగించేలా బిల్లులో నిబంధనలు చేర్చారు.

### బిల్లుపై ప్రజాభిప్రాయాల సేకరణ

ఈ బిల్లుపై జూలై 4 నుంచి 24 వరకు ప్రభుత్వం ప్రజాభిప్రాయాలను స్వీకరించగా, ఆన్‌లైన్ ద్వారా 4,107, ఈమెయిల్ ద్వారా 400 అభ్యంతరాలు అందాయి. వీటిలో 2,465 అభ్యంతరాలు ఆస్తి పన్ను పెంపును వ్యతిరేకిస్తూ వచ్చాయి. ఎంఐఎం నుంచి 18, బిజెపి నుంచి ఐదు, ఎంపి రఘునందన్‌రావు వ్యక్తిగతంగా ఆరు సూచనలు చేయగా, వాటిలో కొన్నింటిని ప్రభుత్వం బిల్లులో పొందుపరిచింది.

## పోలీసు పిల్లలకు నాణ్యమైన విద్యే సంక్షేమానికి కీలకం


### డిజిపి సి.వి. ఆనంద్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీసు సిబ్బంది పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం పోలీసు సంక్షేమంలో కీలక భాగమని డిజిపి సి.వి. ఆనంద్ అన్నారు. పిల్లల భవిష్యత్తుపై భరోసా కల్పిస్తే పోలీసులు విధులపై మరింత ఏకాగ్రతతో పనిచేయగలరని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా విద్యార్థులను తీర్చిదిద్ది, బాధ్యతాయుత పౌరులుగా తయారు చేయడమే లక్ష్యమని తెలిపారు. మంచిరేవులలోని ఆక్టోపస్–గ్రేహౌండ్స్ ప్రాంగణంలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపిఎస్) అకడమిక్ బ్లాక్–1 నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 2024 డిసెంబరులో పోలీసు సిబ్బంది పిల్లల కోసం ప్రత్యేక పాఠశాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన ట్లు డిజిపి తెలిపారు. ఆర్మీ, సైనిక్ స్కూళ్ల తరహా లో జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో వైఐపిఎస్‌ను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. గతేడాది ఏప్రిల్‌లో 120 మంది విద్యార్థులతో తా త్కాలిక ప్రాంగణంలో ప్రారంభమైన పాఠశాల లో ప్రస్తుతం సుమారు 360 మంది విద్యార్థులు ఉన్నారని, కొత్త భవనం పూర్తయితే వచ్చే ఏడాది విద్యార్థుల సంఖ్య 700–720కు చేరే అవకాశం ఉందన్నారు. విద్యతోపాటు క్రీడలు, క్రమశిక్షణ, సహపాఠ్య కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. క్రికెట్‌తో పాటు రాక్ క్లైంబింగ్, గుర్రపు స్వారీ వంటి సాహస క్రీడల్లోనూ శిక్షణ అందిస్తామని చెప్పారు. పాఠశాలలో హోంగార్డుల పిల్లలతోపాటు సాధారణ విద్యార్థులకు కూడా అవకాశం కల్పిస్తున్నామని, 50 శాతం సీట్లు సాధారణ విద్యార్థులకు కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఒకే ప్రాంగణంలో ప్లస్–2 వరకు విద్య అందించే పూర్తిస్థాయి పాఠశాలగా వైఐపిఎస్‌ను అభివృద్ధి చేస్తామని డిజిపి తెలిపారు. రానున్న రెండు, మూడేళ్లలో అత్యున్నత ప్రమాణాలతో విద్యాసంస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. నిర్మాణ, అభివృద్ధి పనులను సమన్వయంతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో డీజీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, డిజి (ఆక్టోపస్) అనిల్‌కుమార్, సైబరాబాద్ కమిసనర్ రమేష్, ఐజీ గజరావు భూపాల్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, వైఐపీఎస్ ప్రిన్సిపాల్ డా.అనితారెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బీమా రంగంలో మానవీయ కోణం కీలకం

### ఐఐఆర్ఎం పిజిడిఎం 2024–26 బ్యాచ్ స్నాతకోత్సవంలో ఐఆర్‌డిఎ చైర్మన్ అజయ్ సేథ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** బీమా రంగంలో మానవ కోణం ప్రముఖంగా ఉండాలని, బీమా వ్యవస్థలో సానుభూతి కేంద్రంగా ఉండాలని తద్వారా ‘అందరికీ బీమా’ సాధించాలని చైర్మన్ అజయ్ సేథ్ అన్నారు. ఐఆర్‌డిఎ, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్సూరెన్స్, రిస్క్ మేనేజ్‌మెంట్ (ఐఐఆర్ఎం) పట్టభద్రులైన పిజిడిఎం 2024–26 బ్యాచ్ స్నాతకోత్సవ శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐఆర్‌డిఎ చైర్మన్ అజయ్ సేథ్ పట్టభద్రులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రత్యేక కోర్సులలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. భారతదేశ బీమా, రిస్క్ మేనేజ్‌మెంట్ రంగంలో విస్తరిస్తున్న ఉద్యోగ అవకాశాలను ప్రస్తావిస్తూ వేగంగా మారుతున్న బీమా, రిస్క్ మేనేజ్‌మెంట్ రంగంలో నిపుణులు విజయం సాధించడానికి నిజాయితీ, సాంకేతికత, ఆవిష్కరణలు, నిరంతర అభ్యాసం చాలా కీలకమన్నారు. ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ సందీప్ కుమార్ శుక్లా మాట్లాడుతూ పట్టభద్రులు సాంకేతికతను మానవ సామర్థ్యాలతో సమతుల్యం చేసుకోవాలని, సాధనాలు, సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని కానీ మానవ విచక్షణను కోల్పోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఐఐఆర్ఎం డైరెక్టర్ ఆటాను కె.దాస్, కంట్రోలర్ అఫ్ ఎక్సమినేషన్స్ డాక్టర్ సి.మాధవి ప్రసాద్ ప్రసంగించారు.

## బస్సుల బంద్‌తో ప్రయాణికుల ఇబ్బందులు



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని వివిధ గ్రామాలకు సకాలం లో బస్సులు లేక పోవడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారని పిఅర్ జి ఫౌండేషన్ వ్యవస్థాపకులు పోద్దుటూరి రవిందర్ గుప్త తెలిపారు. శనివారం యాచారం మండల కేంద్రంలో అయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పండుగ పూట ఇబ్రహింపట్నం డిపో మేనేజ న్ బస్సులను బంద్ చేయడంతో నానా ఇబ్బందులు ఎదురుకుంటున్నారని తెలిపారు. డిపో మేనేజర్‌కు ఫోన్ చేసిన ఎత్తడం లేదన్నారు.మేడిపల్లి మీ దుగా శెట్టి పల్లి గ్రామానికి వేళ్తున్న ప్రయాణికులు మేడిపల్లి మీదుగా బస్సు ఉందని మేడిపల్లికి వచ్చారు. బస్సులు బంద్ చేయడంతో కాలినడకన శేట్టిపల్లి గ్రామానికి వెల్తున్నారని అయన అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అర్‌టిసి అధికారులు స్పందించి పండుగ వేళల్లో బస్సులు నడుపాలని డి మాండ్ చేవారు. లేనిపక్షంలో అందోళన చేస్తామని అయన హెచ్చరించారు.

## రూ.30 లక్షలతో సీసీ రోడ్డు పనులు

**ప్రజాపక్షం/షాబాద్:** సోలిపేట్ గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు సర్పంచ్ రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని సోలిపేట్ గ్రామంలో గ్రామ పెద్దల సహకారంతో రూ.30 లక్ష ల హెచ్ఎండిఏ నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామంలో మౌలిక వసతులు కల్పించేందు కు ప్రభుత్వం అధికంగా నిధులు మంజూరు చేయాలన్నారు. గ్రామంలో అండర్ డ్రైనేజీ, త్రాగునీటి సమస్య, వీధి దీపాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనార్ధన్ రెడ్డి, గ్రామ వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## పెద్ద అంబర్‌పేట్‌లో భారీగా ట్రాఫిక్ జామ్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి ఎన్‌హెచ్ 65పై శనివారం రాత్రి భారీగా ట్రాఫిక్ స్తంభించింది.పెద్ద అంబర్‌పేట్ శివారులో సుమారు ఎటు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ట్రాఫిక్‌లో ఓ అంబులెన్స్ కూడా చిక్కుకుపోవడం ఆందోళన కలిగించింది. పెద్ద అంబర్‌పేట్ సర్వీస్ రోడ్డుపై వినాయక విగ్రహాల తరలింపు,యూటర్న్ వద్ద భారీ వాహనాలు మళ్లుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడినట్లు స్థానికులు తెలిపారు.దీంతో ఎన్‌హెచ్65పై ఇరువైపులా బస్సులు,కార్లు,ఆటోలు,ద్విచక్ర వాహనాలు భారీగా నిలిచిపోయాయి.దీనికి తోడు సుమారు 2 నుంచి 3 కిలోమీటర్ల వరకు సరైన యూటర్న్ సదుపాయం లేకపోవడంతో ఒకే ప్రాంతంలో వాహనాల రద్దీ అధికమవుతోందని ప్రయాణికులు వాపోతున్నారు.ఇంతటి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడినప్పటికీ ట్రాఫిక్ సిబ్బంది అక్కడ కనిపించకపోవడం గమనార్హం.

## స్పీకర్‌ను అవమానించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే

### రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌ను అవమానించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చే యడమేనని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ(డిసిసి)అధ్యక్షుడు, టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నరసింహారెడ్డి అన్నారు.శనివా రం రంగారెడ్డి జిల్లా అసెంబ్లీలో స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు, పోలీసులపై అవమానకర వ్యాఖ్యలుచేస్తూ,విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై బిఆర్ఎస్ చేసిన దాడులను ఖండిస్తూ తుక్కుగూడలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఇట్టి కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు,టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంచేపట్టడం జరుగుతుంది. ఈ సందర్భంగా చల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీలో బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు గూండాయిజానికి పా ల్పడ్డారని, దళితులను అవమానించేలా దళితులు నడిచిన నేల ను పసుపు నీళ్లతో శుద్ధి చేయడం అనాగరిక చర్యలకు నిదర్శనమని నర్సింహా రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకే బిఆర్ఎస్ నేతలు ఇలాంటి అరాచకాలకు పాల్పడుతున్నారని,భవిష్యత్లో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొని భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీకి దళితుల పట్ల ఉన్న గౌరవం ఏమిటో ఇటీవల అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన పరిణామాలు స్పష్టం చేస్తున్నాయని విమర్శించారు.అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితుల పట్ల జరిగిన అవమానకర ఘటనలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత ప్రజా పాలన లో దళితులకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ దాదాపు నలుగురు దళిత నాయకులు మంత్రివర్గంలో కొనసాగుతున్నారని చల్లా నరసింహారెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన స్పీకర్ పదవిని, పోలీసు వ్యవస్థను కించపరిచేలా వ్యా ఖ్యలు చేయడం,విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడుల కు పాల్పడటం సరికాదని అన్నారు. ఇలాంటి ఘటనలను కాం గ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి,మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కెఎల్ఆర్),రంగారెడ్డి జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి,టిపిసిసి సభ్యులు దేపా భాస్కర్‌రెడ్డి, టిపిసిసి జనరల్ సెక్రటరీ ఏనుగు జంగారెడ్డి,జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు శ్రీధర్,టిపిసిసి జనరల్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డితో పాటు సర్పంచులు,మండల అధ్యక్షులు,వార్డు అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,సోషల్ మీడియా ప్రతినిధులు,ఎన్ఎస్‌యుఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ‘ఢీ 10’ రాజు రిమాండ్‌లో.. కేసు వివరాలు ఎందుకు గోప్యం?

### యువతి ఫిర్యాదుతో ఈ నెల 9న కేసు నమోదు చేసినట్లు సమాచారం

### న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

### అరెస్టు విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంపై చర్చ



**ప్రజాపక్షం/మియాపూర్:** బుల్లితెర డ్యాన్స్ రియాలిటీ షో ద్వారా ప్రేక్షకులకు చేరువైన ‘ఢీ 10’ విజేత రాజు తీవ్రమైన ఆరోపణల కేసులో రిమాండ్‌కు వెళ్లినట్లు సమాచారం. తనపట్ల అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు లైంగికంగా వేధించాడంటూ ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. కేసు నమోదు అనంతరం రాజును అదుపులోకి తీసుకు ని న్యాయస్థానం ఎదుట హాజరుపరిచిన పోలీసులు, న్యాయస్థానం ఆదేశాలతో రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. కాగా డ్యాన్సర్‌గా,కొరియోగ్రాఫర్‌గా గుర్తింపు పొందిన రాజు తనను వేధించాడంటూ ఓయువతి మియాపూర్ పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. ఆమె ఫిర్యాదుపై ప్రాథమిక విచారణ అనంతరం ఈ నెల 9న కేసు నమోదు చేసినట్లు తెలిసింది. కేసు నమోదు చేసిన అనంతరం రాజును అదుపులోకి తీసుకున్న పోలీసులు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు సమాచారం. న్యాయస్థానం ఆదేశాలతో అతన్ని న్యాయ రిమాండ్‌కు తరలించినట్లు తెలుస్తోంది. అయితే కేసులో నమోదు చేసిన చట్టపరమైన సెక్షన్లు, ఎఫ్ఐఆర్ సంఖ్య, ఫిర్యాదులోని పూర్తి ఆరోపణలపై పోలీసుల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. సాధారణంగా సినీ,బుల్లితెర రంగాలకు చెందిన ప్రముఖులపై కేసులు నమోదైతే విషయం త్వరగా వెలుగులోకి వస్తుంది. అయితే రాజుపై ఈ నెల 9న కేసు నమోదై, రిమాండ్‌కు తరలించినట్లు చెబుతున్నప్పటికీ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి రావడం చర్చనీయాంశమైం ది. బాధితురాలి గుర్తింపు, వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచడం చట్టపరంగా అవసరం. దర్యాప్తునకు ఆటంకం కలగకుండా కొన్ని వివరాలను పోలీసులు వెల్లడించకపోవచ్చు. అయితే కేసు నమోదు,అరెస్టు,రిమాండ్ వంటి ప్రాథమిక వివరాలపై కూడా అధికారిక సమాచారం ఎందుకు ఇ వ్వలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాజు అరె స్టు విషయాన్ని పోలీసులు ఉద్దేశపూర్వకంగానే గో ప్యంగా ఉంచారా..? దర్యాప్తు ప్రయోజనాల కోసమే వివరాలు వెల్లడించలేదా? అనే చర్చ జరుగుతోంది.పోలీసు ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడిస్తేనే ఈ వ్యవహారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

### ఆరోపణల నిజానిజాలు దర్యాప్తులోనే

యువతి చేసిన ఫిర్యాదును పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాల్సి ఉంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ప్రముఖుడైనా, సామాన్యుడైనా చట్టం ముందు సమానమే. అదే సమయంలో న్యాయస్థానం దోషిగా నిర్ధారించే వరకు రాజుపై ఉన్నవి ఆరోపణలు మాత్రమే. కేసులో వాస్తవాలు పోలీసుల దర్యాప్తు, తదుపరి న్యాయస్థాన విచారణలో తేలాల్సి ఉంది.

## పెంచిన ఫీజులను తగ్గించాలి



**ప్రజాపక్షం/యూసుఫ్‌గూడ:** ప్రముఖ క్రీడా ప్రాంగణమైన యూసుఫ్‌గూడలోని విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో పిల్లల శిక్షణ కోసం నిర్ణయించిన క్రీడల ఫీజుల పెంపుదలను నిరసిస్తూ తల్లిదండ్రులు, బాల క్రీడాకారులు స్టేడియం వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. ఫీజుల పెంపుదల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులపై అధికారులకు సమర్పించిన వినతిపత్రం ప్రతులను మీడియా ముందు ప్రదర్శించారు. ఈ సందర్భంగా బాల క్రీడాకారుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. క్రీడలను ప్రోత్సహించాల్సిన యాజమాన్యం ఏకపక్షంగా భారీగా ఫీజులు పెంచడం ఏమిటని ప్రశ్నించారు. ఇకనైనా పెంచిన ఫీజుల భారాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## గర్భిణికి గాంధీ వైద్యుల పునర్జన్మ



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** అత్యంత అరుదైన రక్త సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఓ నిండు గర్భిణికి గాంధీ ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా ప్రసవం చేసి ప్రాణాలు నిలిపారు. సూర్యాపేట్ జిల్లా పెన్‌పహాడ్ మండలం ధర్మాపూర్ గ్రామానికి చెందిన 21 ఏళ్ల యడ్ల లక్ష్మి పుట్టుకతోనే ఫ్యాక్టర్ 7 డెఫిషియెన్సీ (అలెగ్జాండర్స్ డిసీజ్) అనే అరుదైన రక్తస్రావ రుగ్మతతో బాధపడుతున్నారు. ఆగస్టు 21న గాంధీ ఆసుపత్రిలో చేరారు.రక్తం గడ్డకట్టే సామర్థ్యం లోపించడం వల్ల ప్రసవ సమయంలో రక్తస్రావమై ప్రాణాపాయం పొంచి ఉండటంతో వైద్యులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించి ఆపరేషన్ నిర్వహించారు. క్లిష్టమైన ఈ కేసును విజయవంతంగా పూర్తి చేసినందుకు కుటుంబ సభ్యులు గాంధీ వైద్యులకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## డాక్టర్ ఉషారాణికి సన్మానం



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ టి.ఉషారాణిని గాంధీ వైద్య కళాశాల పాలకవర్గం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఇందిర నేతృత్వంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ బివి.నాగమోహన్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, హెల్త్ సూపర్వైజర్ వేణుగోపాల్, డాక్టర్ ఉషారాణిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

### బిసి హక్కుల పోరాట వేదిక డిమాండ్



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :**చట్టసభల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిసి హక్కుల పోరాట వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు తోట శ్రీనివాస్ పటేల్, వైస్‌చైర్మన్ కొల్లకుంట నాగరాజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. కేంద్రం కులగణనలో ఒబిసి కాలమ్ చేర్చాలని కోరారు. బిసి మహిళలకు 50శాతం రిజర్వేషన్లు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఫీజురీయింబర్స్ మెంట్ స్కీంను పాత పద్ధతిలో అమలు చేసి, పేద విద్యార్థులకు రూ.8వేల ఫీజు బకాయిలు చెల్లించాలని కోరారు. బిసి హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమిస్తామని తెలిపారు. సమావేశంలో వేదిక నాయకులు నాగేశ్వరరావు, రోహిత్, కౌటం రమేశ్, రాజు బెస్త, నాగరాజు వద్దేపల్లి తదితరులు పాల్గొన్నారు.

## గురువులు దైవ స్వరూపులు




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** విద్యాబుద్ధులు నేర్పుతూ చిన్నారులను సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదితే గురువులు దైవ స్వరూపులని లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్రతినిధులు కొనియాడారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నితీష్ మోర్జారియ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పాత్రికేయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చల్లా శ్రీనివాస్‌రెడ్డి, క్లబ్ ట్రస్ట్ చైర్మన్ పురుషోత్తం హాజరై ఉపాధ్యాయులు పాత్రికేయులను సన్మానించారు.

## ఆపదలో అండగా ఉంటాం



**ప్రజాపక్షం/చార్మినార్:** అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలంగాణ రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా 11 కుటుంబాలకు మొత్తం రూ.7 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బోయనరేష్ పంపిణీ చేశారు.

## 'రింగ్ రోలింగ్' బాలూ ఫోర్జ్ కైవసం

**ప్రజాపక్షం/హైదరాబాద్:**బాలూ ఫోర్జ్ ఇండస్ట్రీస్ దేశంలోని అతిపెద్ద రింగ్ రోలింగ్ ఉత్పత్తి మార్గాన్ని విజయవంతంగా స్వాధీనం చేసుకొన్నట్లు ప్రకటించింది. దీనిద్వారా మొత్తం భారతీయ తయారీ రంగానికి ఒక కీలక ఘట్టమని బాలూ ఫోర్జ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కార్యనిర్వాహక సంచాలకుడు త్రిమాన్ చాండోక్ పేర్కొన్నారు. గరిష్టంగా 6.7 మీటర్ల బాహ్య వ్యాసం (ఒడి) కలిగిన ఫోర్జ్ చేసిన రింగులను ఉత్పత్తి చేయగల సామర్థ్యం దీనికి ఉన్నదన్నారు.

# హిందీని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత

### టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:**జాతీయ భాష హిందీని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణ ప్రదేశ్ లింగ్విస్టిక్ మైనార్టీ సెల్, హైదరాబాద్ హిందీ జర్నలిస్ట్స్ సొసైటి ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన జాతీయ హిందీ దివాస్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. సెక్యులర్ దేశమైన భారత్‌లో అన్ని భాషలు, ప్రాంతాలు, కులాలు, మతాలకు సమాన గౌరవం ఉంటుందన్నారు. తెలంగాణలో తెలుగుతోపాటు హిందీ, ఉర్దూ భాషలు కూడా విస్తృతంగా వాడుకలో ఉన్నాయన్నారు. ప్రస్తుతం హిందీ చదివే వారి సంఖ్య తగ్గిపోతుండటం ఆందోళనకరమన్నారు. హిందీ భాషను ప్రజలకు మరింత చేరువ చేయడానికి తెలంగాణ ప్రదేశ్ లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ చొరవ తీసుకోవాలని సూచించారు. ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్ మాట్లాడుతూ హిందీ భాష దేశ ప్రజలందరినీ కలుపుతుందని, దీనిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. సెల్ చైర్మన్ రాజేశ్ అగర్వాల్ మాట్లాడుతూ హిందీ భాష పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వాలే కృషిచేశాయని గుర్తుచేశారు. హిందీ భాష పరిరక్షణ ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి సంక్షేమశాఖ సలహాదారులు, మాజీ ఎంపి వి.హనుమంతరావు, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి, టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, సెల్ నేతలు రాజేశ్ గోయల్, ప్రకాశ్ రతి, ప్రదీప్ సూరన, ప్రకాశ్ జైన్, హైదరాబాద్ జర్నలిస్ట్స్ సొసైటీ అధ్యక్షులు అజయ్ కుమార్ శుక్ల, ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.సర్వర్, కార్యదర్శి కన్నయ్య సింగ్, కోశాధికారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలను ప్రోత్సహించడమే లక్ష్యం



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** తెలంగాణలో ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపిసి) ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ విభాగాన్ని బలోపేతం చేసి, చిన్న వ్యాపారులు, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడమే తమ లక్ష్యం అని ఏఐపిసి తెలంగాణ ఎంఎస్ఎంఈ హెడ్ పసుపులేటి శశాంక్ అన్నారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలిగా లహరి సుమన్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాండం, ఖమ్మం జిల్లా అధ్యక్షునిగా విక్టేశ్వరరావు నాయకులను నియమించినట్లు తెలిపారు.

## సంతకాల సేకరణ



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** ఆలయం పరిసరాల్లోని మట్టికుప్పను తొలగించాలని కోరుతూ పటేల్‌నగర్ డివిజన్ బిజెపి నాయకులు శనివారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అంబర్‌పేట నియోజకవర్గం బిజెపి మాజీ జాయింట్ కన్వీనర్ మైలారం రాజు ఆధ్వర్యంలో అలీ కేఫ్ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఈ సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నరేష్ గౌడ్, రాజు నేత, భాస్కర్ గౌడ్, చింతల కృష్ణ, ఈశ్వర్, పెంటం రాజు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయాలి

**కాచిగూడ/ప్రజాపక్షం:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అంబర్‌పేట్ నియోజకవర్గం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రబోలు నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం అయిన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చిందని, 1000 రోజులు పూర్తవుతున్నా అనేక హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు.

## మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



**ప్రజాపక్షం/నల్లకుంట:** పర్యావరణ హితమైన మట్టి వినాయకులను అంబర్‌పేట్ డివిజన్ బాపునగర్ అంబేద్కర్ చౌరస్తాలో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకుడు మల్లికార్జున్ యాదవ్ పాల్గొని ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ కిషోర్, డిఈ రఘు, ఎస్ఎఫ్ఏలు భాష అరుణ్, బిఆర్ఎస్ నాయకులు రాహుల్ ముదిరాజ్, రాకేష్, బాబురావు, అఖిల్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ సమావేశాలు




**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా సమన్వయంతో ముందుకు సాగాలని గోషామహల్ బీఆర్ఎస్ ఇంచార్జి ఆర్వీ మహేందర్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం స్థాయి ముఖ్య మహిళా కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు శీలం సరస్వతి, ఎస్.నాగమణి, జి.ఉమారాణి, ఎ.సంగీత, శ్రీలత, పి.మీన, కళ్యాణి, ఉజ్వల, కళావతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## జూలో జంతువుల దత్తత

**ప్రజాపక్షం/బహదూర్‌పురా:** సామాజిక అసెట్ఎన్ఎక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు సిద్ధార్థ్ షా తన కుమారుడు చిన్మయ్ సిద్ధార్థ్ షా 18వ జన్మదినం సందర్భంగా జూపార్క్‌లోని తెల్ల పులి పిల్లను దత్తత తీసుకున్నారు. చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)లో ప్రథమ సంవత్సరం ఇంజినీరింగ్ చదువుతున్న చిన్మయ్ సిద్ధార్థ్ షాకు చిన్ననాటి నుంచే వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక ఆసక్తి ఉంది. కార్యక్రమంలో జూపార్క్ మాజీ క్యూరేటర్ ఎ.శంకరన్, జూ పీఆర్వో హెచ్ఎం హనీఫుల్లా తదితరులు పాల్గొన్నారు.

## టెండర్ ప్రక్రియ ప్రారంభం కాలేదు

### టెండర్ల ఆరోపణలపై టిజిఎస్‌పిడిసిఎల్ వివరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** త్వరలో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ కేబుల్ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ ఇప్పటి వరకు ప్రారంభం కాలేదని.. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌కు అవసరమైన అనుమతులు ఇటీవలే లభించాయని.. తదుపరి దశలో అమలులో ఉన్న ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం ఈటెండరింగ్ విధానంలో టెండర్లను ఆహ్వానించే ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని టిజిఎస్‌పిడిసిఎల్ తేల్చిచెప్పింది. రూ.1,400 కోట్ల అండర్‌గ్రౌండ్ కేబులింగ్ కాంట్రాక్ట్ ఒక్కటే కంపెనీకి ఇచ్చారని.. అసెంబ్లీలో ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ టెండర్ల అంశాన్ని ప్రస్తావించిన నేపథ్యంలో టీజీఎస్పీడీసీఎల్ స్పష్టత ఇవ్వడం జరిగింది. టిజిఎస్‌పిడిసిఎల్ పరిధిలో చేపట్టనున్న యూజీ కేబుల్ పనులకు సంబంధించి టెండర్ ఇప్పటికే ఖరారైందని.. ఏదైనా వ్యక్తి.. సంస్థకు కేటాయించారని వస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని సంస్థ పేర్కొన్నది. టెండర్ ప్రక్రియ ప్రారంభమైన అనంతరం అర్హత కలిగిన అన్ని సంస్థలకు సమాన అవకాశాలు కల్పించడం జరుగుతుందని.. సాంకేతిక, ఆర్థిక అర్హతల ఆధారంగా పూర్తిస్థాయి పారదర్శకతతో టెండర్ ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని టిజిపిఎస్‌డిఎల్ స్పష్టం చేసింది.

## స్వార్థంతో సభా సమయం వృథా

ప్రజాపక్షం/బంజారాహిల్స్: అసెంబ్లీ విలువైన సమయాన్ని తమ స్వార్థ రాజకీయాల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ వృథా చేశాయని బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆమె మీడియాతో మాట్లాడుతూ... ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన ప్రతిపక్ష బీఆర్ఎస్ తనకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేదని మండిపడ్డారు. ఇదే సమయంలో ఎక్కడ సమాధానం చెప్పాల్సి వస్తుందోననే భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కీలక అంశాలపై చర్చకు దూరంగా వెళ్లిందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిపోయిందని.. తెలంగాణలో ప్రత్యామ్నాయం బీజేపీనే అన్నారు.

## ఛత్రినాక చౌరస్తా పేరు మార్చాలి

**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** ఛత్రినాక చౌరస్తాను తెలంగాణ పోరాటాల చౌరస్తాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కన్వీనర్ గడ్డమీది హరినాథ్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో పాతనగర నాన్ పొలిటికల్ జేఏసీ లోకేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాలు, బహిరంగ సభలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించడంతో పాటు అరెస్టులు జరగడంతో జైలుకు కూడా వెళ్లడం జరిగిందని తెలిపారు. చారిత్రక ఛత్రినాక చౌరస్తా పేరును తెలంగాణ పోరాటాల చౌరస్తాగా మార్చాలని ఆయన కోరారు.

## ఆరీఫ్ అల్ సువైదీ సందేశం

**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** నలందా విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ దివంగత మంతెన సూర్యనారాయణరాజు విద్యారంగానికి చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ అబుదాబికి చెందిన ఆరీఫ్ అల్ సువైదీ తాజాగా భావోద్వేగ సందేశాన్ని వెలువరించారు. సూర్యనారాయణరాజు కేవలం పాఠశాలలను నిర్మించలేదని, ఎన్నో తరాల విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారని కొనియాడారు.విద్యార్థులకు బోధించడమే కాకుండా వారి జీవితాలకు దిశానిర్దేశం చేశారని, ఎన్నో పాఠశాలలను స్థాపించి గ్రామీణ ప్రాంతాల్లో విద్యాజ్యోతిని వెలిగించారని పేర్కొన్నారు. ఆయన చేతుల్లో విద్యనభ్యసించిన తరాలు నేడు ఇతరులకు జ్ఞానాన్ని పంచుతున్నాయని, ప్రతి అక్షరం ఆయనకు నిరంతర పుణ్యఫలంగా నిలుస్తుందని అన్నారు.

## పెళ్లి పేరిట మోసం

**ప్రజాపక్షం/పంజాగుట్ట:** పెళ్లి పేరుతో ఉద్యోగినిని మోసం చేసిన వ్యక్తిని పంజాగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలలోకి వెళితే.. ఓ యువతి స్పారో సొల్యూషన్స్ కన్సల్టెన్సీలో రిసెప్షనిస్ట్‌గా చేరింది. సొల్యూషన్ హెడ్ షేక్ జహంగీర్ ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి దగ్గరయ్యాడు. అమ్మాయి పేరు మీద వివిధ సంస్థల నుంచి రూ.6 లక్షల వరకుఫైనాన్స్ తీసుకుని నెలవారీ వాయిదాలు కూడా చెల్లించడం లేదు. అంతేకాకుండా పెళ్లి గురించి అడిగితే వాయిదా వేస్తూ, అనేక పర్యాయాలు కొట్టడంతో పాటు బెదిరింపులకు పాల్పడటం జరిగింది. తాను మోసపోయాయని గ్రహించిన యువతి పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడం జరిగింది.

## 75 ఏండ్ల అన్వేషణ సంపుటి

### భారత రాజ్యాంగం వైరుధ్యాలు ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** భారత రాజ్యాంగ ప్రస్థానంలో 75 ఏళ్లను అన్వేషించే కొత్త సంపుటి వెలువడింది. ప్రముఖ విద్యాసంబంధ ప్రచురణ సంస్థలలో ఒకటైన ఓరియంట్ బ్లాక్స్వాన్, వియన్నా విశ్వవిద్యాలయం, వియన్నా సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్(2026–27)అడ్వాన్స్‌డ్ ఫెలో కల్పనా కన్నబిరాన్ సంపాదకత్వంలో వెలువడిన 'భారత రాజ్యాంగ 75 సంవత్సరాలు.. వైరుధ్యాలు, ప్రాతినిధ్యం, విస్తరణలు, పునరుద్ధరణలు' పుస్తకాన్ని సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న విద్యారణ్య హైస్కూల్లో విడుదల చేశారు. అనంతరం జరిగిన చర్చలో హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జ్యోతిర్మయ శర్మ, నల్సార్ లా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మురళీ కర్ణం, హైదరాబాద్ వర్సిటీ ప్రొఫెసర్ మంజరి కట్టు, సంపుటి సంపాదకురాలు కల్పనా కన్నబిరాన్ పాల్గొన్నారు. భారతదేశ రాజ్యాంగ ప్రస్థానంపై ఒక విస్తృతమైన, విమర్శనాత్మక పరిశీలనను ఈ పుస్తకం అందిస్తుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. పౌరసత్వం, హక్కులు, గుర్తింపు, ప్రజాస్వామ్య పటిష్టత వంటి ప్రశ్నలకు, రానున్న కాలంలో రాజ్యాంగ ఆలోచనకు అవకాశాలను ఈ సంపుటి పరిశీలిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి సమకాలీనంగా ఎదురవుతున్న సవాళ్లకు సంపుటి ద్వారా గణనీయమైన ప్రాధాన్యం లభిస్తుందని పేర్కొన్నారు.

## లోక్‌అదాలత్‌లో 1.60లక్షల కేసుల పరిష్కారం

### కక్షిదారులకు అవార్డుల పంపిణీ



**ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ :**హైదరాబాద్ నాంపల్లి డివిజన్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,60,107కేసులు పరిష్కారం అయ్యాయని ఇంచార్జి సెషన్స్ జడ్జి ఎంఎస్ఎం అర్చనాకుమారి తెలిపారు. ఈ లోక్‌అదాలత్‌లో ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో రాజీ మార్గంలో కేసులను పరిష్కరించామన్నారు. ఈ కేసుల పరిష్కారం ద్వారా 10,88,66,550 రూపాయలు రికవరీ అయ్యాయని ఆమె చెప్పారు. దీని ద్వారా కక్షిదారులకు త్వరితగతిన న్యాయం లభించడంతో పాటు దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియ, సమయం, ఖర్చు ఆదా అయ్యాయన్నారు. ఈ కేసులకు సంబంధించిన అవార్డులను సంబంధిత కక్షిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాల్గవ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి జె.విక్రమ్, హైదరాబాద్ అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం.శ్రీనివాస్, ఇతర అధికారులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు సాధికారతే లక్ష్యం



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** ప్రజాస్వామ్యంలో ఓటు వేయడం మాత్రమే రాజకీయ సాధికారత కాదని, నిర్ణయాలు తీసుకునే స్థాయికి బీసీలు చేరుకోవడమే నిజమైన సాధికారత అని రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ నాయకులు తెలిపారు. శనివారం బిసి ఇంటెలెక్చువల్ ఫోరమ్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు, బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజ్‌గౌడ్ సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బిఆర్ఎస్ ఎంఎల్‌సి మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ ఉద్యమకారుడు తెలంగాణ విటల్, బిసి పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, కటకం నర్సింగరావు, తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ తదితరులు హాజరై మాట్లాడారు. సమావేశంలో ఎంబిసి డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు నీరజ, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్, పాల్గొన్నారు.

## పుట్టి యాదగిరి ముదిరాజ్ మృతి

**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** ముదిరాజ్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పుట్టి యాదగిరి ముదిరాజ్(69) శుక్రవారం రాత్రి మృతి చెందారు. అంబర్‌పేట్ తిరుమలనగర్‌కు చెందిన పుట్టి యాదగిరి ముదిరాజ్‌కు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ముదిరాజ్ సంక్షేమ సంఘాన్ని స్థాపించిన ఆయన ముదిరాజుల సమస్యలు, హక్కుల కోసం ఎనలేని పోరాటం చేశారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఈ మేరకు పుట్టి యాదగిరి ముదిరాజ్ పార్థివ దేహానికి నివాళులర్పించారు.

## గ్రాడ్యుయేషన్ స్థాయిలో విప్లవాత్మక మార్పులు

### 'అవంతి' గ్రాడ్యుయేషన్ వేడుకల్లో ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టా రెడ్డి




**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్:**రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పటిష్టం చేస్తూ గ్రాడ్యుయేషన్ స్థాయిలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టా రెడ్డి అన్నారు. డిగ్రీ దండగ కాదు.. పండగ' అనే నినాదాన్ని నిజం చేస్తూ మూడేళ్లు, నాలుగేళ్లు చదివిన వెంటనే విద్యార్థులకు కొలువులు లభించేలా సరికొత్త సిలబస్‌ను సిద్ధం చేసినట్టు తెలిపారు. శనివారం హైదరాబాద్ కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో అవంతి కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన బాలకిష్టా రెడ్డి విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేసి, మాట్లాడారు. రానున్న విద్యాసంవత్సరం నుంచి ఏవియేషన్, సముద్ర భద్రత, రక్షణ రంగాలకు అవసరమైన నైపుణ్య కోర్సులు అందుబాటులోకి తెస్తామన్నారు. మానవ వనరులను తీర్చిదిద్దడంలో తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో జెఎన్‌టియుహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.వెంకటరమణ, అవంతి విద్యాసంస్థల ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎం.ప్రియాంక, శ్రవణ్ కుమార్, ఎం.వి.ఎస్.ఎస్. నందీశ్, డాక్టర్ వై.జయప్రద, డాక్టర్ శేష తలసాయి, డాక్టర్ ఉమాపతి రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

## ఎంఐఎం చేతుల్లోకి సికింద్రాబాద్

**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ఎంఐఎంకు తొత్తులుగా వ్యవహరిస్తున్నాయని బీజేపీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్ మండిపడ్డారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు కేసీఆర్, నేడు రేవంత్‌రెడ్డి మాట తప్పి అధికారికంగా నిర్వహించకుండా ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పశ్చిమ బెంగాల్ నుంచి వస్తున్న రోహింగ్యాలకు భోలక్‌పూర్, పద్మారావు నగర్, మెట్టుగూడ ప్రాంతాల్లో దొంగ ఓట్లు సృష్టిస్తూ, సికింద్రాబాద్‌ను సైతం పాతబస్తీలా మార్చి ఎంఐఎం చేతుల్లో పెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.

## 'రాజకీయ పార్టీలు ఎరుకలకు ప్రాధాన్యమివ్వాలి'




**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** రాష్ట్రంలోని ఆదివాసి ఎరుకల అభివృద్ధి, సంక్షేమానికి 'ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రూ.500 కోట్ల నిధులివ్వాలని తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు, ప్రధానకార్యదర్శి కుతాడి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. అన్ని రంగాల్లో వెనుకబడిన ఎరుకలకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం కల్పించి, ఎన్నికల్లో సీట్లు, నామినేటెడ్ పదవులివ్వాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్‌టిలో ఎ,బి,సి,డి వర్గీకరణ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదివాసి ఎరుకల కుటుంబాల అభివృద్ధికి ప్రత్యేకంగా ఐటిడిఎను ఏర్పాటు చేయాలన్నారు. పందుల పెంపకందారుల అభివృద్ధికి 'ఎరుకల సాధికారత స్కీం'ను అమలు చేయాలని కోరారు. ఎస్‌టి కార్పొరేషన్ ద్వారా 100శాతం సబ్సిడీతో రూ.12లక్షల రుణాలివ్వాలన్నారు. ఆదివాసి, గిరిజనుల సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రత్యేక ఎస్‌టి కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## గ్లోబల్ సౌత్ దేశాలు నియమాలు

# రూపొందించేవిగా ఎదగాలి


**'బ్రిక్స్' సదస్సు ప్రారంభించిన ప్రధాని మోదీ పిలుపు**




**న్యూఢిల్లీ :** గ్లోబల్ సౌత్ నియమాలను రూపొందించేదిగా మారాలని, ప్రపంచ పాలనలో ప్రస్తుతం ఉన్న 'విశేషాధికారాల పిరమిడ్ నిర్మాణం' స్థానంలో భాగస్వామ్య వేదికకు దారి ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. వాణిజ్య ఘర్షణలు, భౌగోళిక రాజకీయ అస్థిరతలు పెరుగుతున్న ఆర్థిక ప్రతికూలతలను ప్రేరేపిస్తున్న నేపథ్యంలో శనివారం ఆయన ఇక్కడ రెండు రోజుల వార్షిక 'బ్రిక్స్' సదస్సును పారంభించారు. అనంతరం కీలక ప్రసంగం చేశారు. ప్రస్తుత ప్రపంచ, ప్రాంతీయ సంక్షోభాల వల్ల ప్రాంతీయ ముప్పును ఎదుర్కొంటున్న నావికులకు రక్షణ కల్పించేందుకు 'నావికుల అత్యవసర సహాయక వ్యవస్థ' ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తూ, 'బ్రిక్స్' విధానం కింద ప్రపంచ పాలనా సంస్కరణల కోసం, ప్రధానమంత్రి 10అంశాల రోడ్ మ్యాప్‌ను కూడా ఆవిష్కరించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతీన్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, ఇరాన్ ప్రెసిడెంట్ మసూద్ పెజెష్కియన్, దక్షిణ ఆఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో, అబుదాబి యువరాజు మోహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ ఎల్–సిసిలతో సహా పలువురు ప్రపంచ నాయకుల సమక్షంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. తన ప్రసంగంలో నరేంద్ర మోదీ 'బ్రిక్స్' ఒక కీలకమైన ప్రపంచ సంస్థగా ఆవిర్భవించడాన్ని ప్రశంసించారు. అలాగే, తీవ్రమైన ప్రపంచ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి వీలుగా, రాబోయే 20ఏళ్లలో ఈ కూటమికి ఒక నూతన, ప్రతిష్ఠాత్మక అజెండా ఉండాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా సంక్షోభం, ముఖ్యంగా హోర్మజ్ జలసంధి దిగ్బంధనం, ట్రంప్ ప్రభుత్వ వాణిజ్య , సుంకాల విధానాల వంటి ప్రతికూల ప్రభావాలను ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న తరుణంలో, న్యూఢిల్లీలో జరుగుతోన్న ఈ శిఖరాగ్ర సమావేశం మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. బ్రిక్ అధ్యక్షత హోదాలో ఉక్రెయిన్, పశ్చిమాసియాలోని సంఘర్షణల ఆర్థిక పరిణామాల నుంచి అభివృద్ధి చెందుతున్న దేశాలను వేరచేయానికి, భారతదేశం ప్రధానంగా ఆహారం, ఇంధనం, సరఫరా గొలుసు భద్రత కోసం ఆచరణయోగ్యమైన పరిష్కారాలను అన్వేషించడం ద్వారా గ్లోబల్ సౌత్‌ను తన అజెండాకు కేంద్రంగా ఉంచింది. 'ప్రస్తుత ప్రపంచ పాలనా వ్యవస్థ ఒక పిరమిడ్‌ను పోలి ఉంటుంది. అధికారం, నిర్ణయాధికారం పై స్థాయిలో కేంద్రీకృతమై ఉండగా, కింది స్థాయిలలోని దేశాలు ఆ నిర్ణయాల ప్రభావానికి లోనవుతాయి తప్ప, వాటిని రూపొందించే స్థితిలో ఉండవు' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. 'నేడు ప్రపంచ సంక్షోభాలలో గ్లోబల్ సౌత్ ముందు వరుసలో నిలుస్తున్నప్పటికీ, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో మాత్రం వెనకబడి ఉంది. మనం ఈ 'విశేషాధికారాల పిరమిడ్'ను భాగస్వామ్య వేదికగా మార్చాలి. అక్కడ ప్రతీ దేశానికి ఒక గొంతుక ఉండాలి. ప్రతీ సభ్యునికీ ఒక వాటా ఉండాలి. చేసే ప్రతీ ప్రయత్నానికి మానవాళి అభివృద్ధి కేంద్రంగా ఉండాలి' అని మోదీ ఈ దిశగా 'బ్రిక్స్' కూటమి సంస్కరణల రోడ్ మ్యాప్ యొక్క విస్తృత చట్రం కింద ప్రపంచ పాలన సంస్కరణల కోసం 10 సూత్రాల రోడ్ మ్యాప్‌ను సంయుక్తంగా రూపొందించాలని ప్రధానమంత్రి ప్రతిపాదించారు. తదుపరి శిఖరాగ్ర సమావేశం నాటికి ఈ రోడ్ మ్యాప్‌ను ఖరారు చేయాలని మోదీ పేర్కొన్నారు. ఈ రోడ్‌మ్యాప్‌ను 'ప్రాతినిథ్యం' అనే అంశంపై వివరిస్తూ, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణను ఇకపై వాయిదా వేయలేమని, దానిపై చర్చలను ఒక నిర్దిష్ట కాలపరిమితిలోకి స్పష్టమైన ఫలితాలతో తీసుకురావాలని మోదీ వివరించారు. 'మనం గ్లోబల్ సౌత్‌ను నియమాలను పాటించే దేశం నుండి, నియమాలను రూపొందించే దేశంగా మార్చడానికి కృషి చేయాలి' అని ప్రధాని అన్నారు. ప్రపంచ వాణిజ్య ప్రవాహంలో సముద్రయాన కార్మికులు పోషిస్తున్న కీలకపాత్రను ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావిస్తూ, వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అయితే, ప్రపంచ పాలనా నిర్మాణంలో సంస్కరణలు తీసుకురావాలని, 'బ్రిక్స్' కూటమిని మరింత బలోపేతం చేసే మార్గాలను అన్వేషించాలని మోదీ తన ప్రసంగంలో ప్రధానంగా పిలుపునిచ్చారు. 'బ్రిక్స్‌లోని మన ఐక్యతను, ఏకాభిప్రాయాన్ని ప్రపంచ వేదికపై స్పష్టమైన ఫలితాలుగా మలచుకోవాల్సిన సమయం ఇది' అని మోదీ అన్నారు.'బ్రిక్స్' కొనసాగింపు, అమలు యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని మోదీ పిలుపునిచ్చారు.

## భారత దౌత్యస్థానాన్ని, హోదాను పునరుద్ధరించాలి

**బ్రిక్స్ సదస్సు ప్రారంభోత్సవం వేళ మోదీకి కాంగ్రెస్ సూచన**



**న్యూఢిల్లీ :** బ్రిక్స్ వేదికగా భారత్ తన దౌత్య బలాన్ని మరోసారి చాటుకోవాలని కాంగ్రెస్ కోరింది. ప్రపంచ దేశాల్లో ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాల్లో భారత్‌పై ఉన్న నమ్మకాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొంది. బ్రిక్స్ సదస్సు ప్రారంభమైన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పలు సూచనలు చేసింది. సంక్షోభ సమయాల్లో భారత్ నమ్మకమైన, నిర్మాణాత్మక భాగస్వామిగా నిలవాలని కాంగ్రెస్ విదేశీ వ్యవహారాల విభాగం చీఫ్ సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. భారత్ గతంలో అంతర్జాతీయ వ్యవహారాల్లో ప్రత్యేకమైన దౌత్య స్థానం కలిగి ఉండేదని కాంగ్రెస్ పేర్కొంది. ఇప్పుడు ఆ స్థానం, దౌత్యపరమైన ప్రభావాన్ని తిరిగి సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలని సూచించింది. గ్లోబల్ సౌత్‌కు భారత్ గొంతుకగా ఉంటుందని చెప్పడం మాత్రమే కాకుండా అందుకు తగ్గట్టుగా చర్యలు కూడా ఉండాలని ఖుర్షీద్ అన్నారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో బ్రిక్స్ సభ్య దేశాల మధ్య విభేదాలు కనిపిస్తున్నాయని కాంగ్రెస్ తెలిపింది. ముఖ్యంగా బ్రిక్స్ సభ్య దేశమైన ఇరాన్‌పై జరిగిన దాడుల విషయంలో భారత్ వైఖరిపై కొన్ని వర్గాల్లో అనుమానాలు ఉన్నాయని పేర్కొంది. ఆ అనుమానాలను నివృత్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరింది. పశ్చిమాసియా యుద్ధంలో భారత్ దౌత్యపరమైన పాత్ర పరిమితంగా ఉందని విమర్శించింది. బ్రిక్స్ దేశాల మధ్య ఏకాభిప్రాయం తీసుకురావడంలో కూడా ప్రభుత్వం తగినంత ప్రయత్నం చేయలేదని ఆరోపించింది. అదే సమయంలో దౌత్యపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొన్న బ్రిక్స్ వ్యవస్థాపక సభ్య దేశం దక్షిణాఫ్రికాకు భారత్ నుంచి మరింత మద్దతు ఉండాల్సిందని పేర్కొంది.

**బ్లాక్ రాజకీయాలకు దూరంగా!**

ప్రస్తుత బ్రిక్స్ సదస్సును భారత్ దౌత్య నైపుణ్యాన్ని చూపించేందుకు ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ సూచించింది. సభ్య దేశాల మధ్య ఐక్యత పెంచాలి కానీ బ్రిక్స్‌ను మరో అంతర్జాతీయ బ్లాక్‌గా మార్చే రాజకీయాలకు దూరంగా ఉండాలని పేర్కొంది. ప్రపంచ వ్యవస్థలో విభేదాలు పెరుగుతున్న సమయంలో బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ కోరింది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య వాణిజ్యం, ఆర్థిక సహకారం, సరఫరా వ్యవస్థలు, అనుసంధానం వంటి అంశాల్లో భారత్ ముందుండాలని సూచించింది. భారత్ తన ప్రయోజనాలను బలంగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు న్యాయమైన ప్రపంచ వ్యవస్థ కోసం పనిచేసే దేశాలకు నమ్మకమైన భాగస్వామిగా ఉండాలని కాంగ్రెస్ తెలిపింది. గ్లోబల్ సౌత్, గ్లోబల్ నార్త్ మధ్య భారత్ ఒక విశ్వసనీయమైన వారధిగా వ్యవహరించాలని పేర్కొంది. బ్రిక్స్ దేశాలు ప్రపంచ వస్తు వాణిజ్యంలో 19.6 శాతం వాటా కలిగి ఉన్నాయని ఖుర్షీద్ తెలిపారు. అయితే బ్రిక్స్ దేశాలతో భారత్ వాణిజ్య సంబంధాలు సమతూకంగా లేవని అన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ ఉపయోగించుకోవాలని సూచించారు. భారత వస్తువులు, సేవలకు మరింత మార్కెట్ అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కోరింది. ఇతర దేశాల్లో భారత కంపెనీలు ఎదుర్కొంటున్న వాణిజ్య అడ్డంకులను తగ్గించాలని పేర్కొంది. అదే సమయంలో భారత సంస్థలకు పోటీ చేసేందుకు న్యాయమైన, స్పష్టమైన అవకాశాలు కల్పించాలని సూచించింది. బ్రిక్స్ పే వ్యవస్థపై జరుగుతున్న ప్రయత్నాలను కాంగ్రెస్ స్వాగతించింది. సరఫరా వ్యవస్థలు, అనుసంధానంపై కూడా సభ్య దేశాల మధ్య ఒప్పందాలు కుదరాలని కోరింది. 2014లో ఏర్పాటు చేసిన కాంటింజెంట్ రిజర్వ్ అరేంజ్‌మెంట్‌ను మరింత సమర్థంగా అమలు చేయాలని సూచించింది. ఇందులో భారత్ 18 బిలియన్ డాలర్ల నిధులకు హామీ ఇచ్చిందని ఖుర్షీద్ గుర్తు చేశారు.

## మలేషియా, యుఎఇ, వియత్నాం, ఇథియోపియా దేశాధినేతలతో..

# ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు






**న్యూఢిల్లీ :** పెరుగుతున్న ప్రపంచ ఉద్రిక్తతల నుండి, వాణిజ్యం, సరఫరా గొలుసులను కాపాడేందుకు శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ మలేషియా, వియత్నాం, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ), ఇథియోపియా నాయకులతో వేర్వేరు ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. వారితో కీలక ఖనిజాలు, ఇంధనం, ఆహార భద్రత అంశాలపై చర్చలు జరిపారు.' బ్రిక్స్' శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ఈ సమావేశాలు జరిగాయి. అబుదాబి యువరాజు మొహమ్మద్ బిజన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో జరిపిన చర్చల్లో, పశ్చిమ ఆసియాలోని మొత్తం పరిస్థితి, భారత్–యుఎఇ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లే మార్గాల గురించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆయనతో చర్చించారు. 'రక్షణ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), కీలక ఖనిజాలు, ఇంధనం, ఆహారభద్రత, కనెక్టివిటీ రంగాలలో మన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంపై చర్చించాం' అని మోదీ ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. పశ్చిమాసియాలో అనిశ్చితి నెలకొన్న తరుణంలో, బలమైన భారత్–యుఎఇ బంధం స్థిరత్వం, శ్రేయస్సు, శాంతికి ప్రతీకగా నిలుస్తుంది అని మోదీ పేర్కొన్నారు. వారి సమావేశంలో, మోదీ, మలేషియా ప్రధానమంత్రి అన్వర్‌బిన్ ఇబ్రహీం వాణిజ్యం, పెట్టుబడి, రక్షణ, భద్రత, సెమీకండక్టర్లు, మౌలిక సదుపాయాలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, ఇంధనం, ఫిన్‌టెక్ సహా పలురంగాలలో ద్వైపాక్షిక సహకారంలో సాధించిన పురోగతిని సమీక్షించారు. సబాలోని కోటా కినాబాలులో భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి మలేషియా అంగీకారం తెలిపిన విషయాన్ని ఇబ్రహీం మోదీకి తెలియజేశారు.ఆసియన్–భారత్ సంబంధాలను బలోపేతం చేయడంలో మలేషియా అందిస్తున్న నిరంతర మద్దతును ప్రధానమంత్రి మోదీ అభినందించారు. ఇరు దేశాధినేతలు పరస్పర ఆసక్తి ఉన్న కీలక ప్రాంతీయ, ప్రపంచ అంశాలపై పరస్పరం తమ అభిప్రాయాలను పంచుకున్నారు' అని విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఇఏ) తెలిపింది. భారత్–మలేషియా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు తమ నిబద్ధత కొనసాగుతుందని ఇద్దరు నాయకులు అభిప్రాయాలు వ్యక్తం చేశారని ఎంఇఏ వెల్లడించింది. మోదీ వియత్నాం ప్రధానమంత్రి లేమిన్ హంగ్‌ల మధ్య జరిగిన సమావేశం ప్రధానంగా ద్వైపాక్షిక వాణిజ్య పెట్టుబడి సంబంధాలపై దృష్టి సారించింది. మోదీ ఇథియోపియా ప్రధానమంత్రి అభియ్ అహ్మద్ అలీతో జరిపిన చర్చలు కూడా రక్షణ, వాణిజ్య రంగాలలో ఇరుపక్షాల సంబంధాలను మరింత విస్తరించే మార్గాలపైనే కేంద్రీకృతం అయ్యాయి. గత ఏడాది డిసెంబరులో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అడిస్ అబాబా పర్యటన తర్వాత ఈ సమావేశం జరిగింది. ఇరు నేతలు పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై కూడా తమ అభిప్రాయాలను పంచుకున్నారు. బహుపాక్షిక వేదికలలో సన్నిహిత సహకారానికి తమ నిబద్ధతను వారు పునరుద్ఘాటించారు.

## 'కొత్త రూపంలో పాత ఆరోపణలు'

**ఇడి తాజా ఆరోపణలపై కేరళం ప్రతిపక్షనేత పినరయ్ విజయన్**



కన్నూర్ : కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సిఎంఆర్ఎల్) కేసులో తనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) చేసిన తాజా ఆరోపణలను కేరళం అసెంబ్లీ ప్రతిపక్ష నేత పినరయి విజయన్ 'కొత్త రూపంలో పాత ఆరోపణలు'గా అభివర్ణించారు. చట్టాన్ని రాజకీయ ఆయుధంగా మార్చడానికి ఆ సంస్థ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్ఎ) కింద జరిపిన దర్యాప్తు, సోదాలలో సేకరించిన ఆధారాల ఆధారంగా, మాజీ ముఖ్యమంత్రి విజయన్, ఆయన కుటుంబంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ ఇడి ఇటీవల రాష్ట్ర పోలీసు చీఫ్ రావడ ఎ. చంద్రశేఖర్‌కు లేఖ రాసింది. 'ఐటి కన్సల్టెన్సీ సేవలు' అనే ముసుగులో విజయన్ కుమార్తె వీణా టి.కి చెందిన 'ఎక్సలాజిక్ సొల్యూషన్స్' (ప్రస్తుతం మూతపడిన సంస్థ)కు సిఎంఆర్ఎల్ రూ. 2.78 కోట్ల మేర అక్రమ చెల్లింపులు జరిపిందని ఆ సంస్థ ఆరోపించింది. కాగా, శనివారం కన్నూర్ విజయన్ విలేకరులతో మాట్లాడుతూ ఇడి లేవనెత్తిన ఆరోపణల స్వభావంలో ఇప్పుడు పెద్ద మార్పు వచ్చిందన్నారు. ఎటువంటి సేవలు అందించకుండానే ఎక్సలాజిక్ డబ్బు తీసుకున్నందున సిఎంఆర్ఎల్ ఆర్థిక నష్టాన్ని చవిచూసిందని గతంలో ఆరోపణలు వచ్చేవని, ఆ ప్రాతిపదికనే దర్యాప్తు, సోదాలు జరిగాయని ఆయన గుర్తుచేశారు. 'ఇడి ఇప్పుడు చెబుతున్నది దీనికి పూర్తిగా భిన్నమైన విషయం. ఎక్సలాజిక్ పొందిన డబ్బు సేవలకు సంబంధించిన ప్రతిఫలం కాదని, నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సిఎంఆర్ఎల్‌కు అక్రమంగా అనుకూలతలు కల్పించానని, ఆందుకు ప్రతిఫలంగానే ఈ డబ్బును లంచంగా తీసుకున్నానని ఇడి ఇప్పుడు ఆరోపిస్తోంది' అని ఆయన అన్నారు. లంచం ఆరోపణతో ముందుకు వెళ్లే ముందు ఇడి మొదట ఈ ప్రాథమిక వైరుధ్యానికి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఆరోపణల రూపం పదేపదే మారినప్పటికీ, ఒక ముఖ్యమంత్రిగా తాను సిఎంఆర్ఎల్‌కు ఎటువంటి అసాధారణ లేదా నిబంధనలకు విరుద్ధమైన అనుకూలతను కల్పించాననే ప్రాథమిక ప్రశ్నకు మాత్రం సమాధానం దొరకలేదని విజయన్ చెప్పారు.

## విజయన్‌పై ఇడి ఆరోపణలు..

# ఎల్‌డిఎఫ్ రాజకీయంగా ఎదుర్కొంటది

**కేరళం రాష్ట్ర సిపిఐ కార్యదర్శి బినోయ్ విశ్వం**




**తిరువనంతపురం :** అవినీతి ఆరోపణల కేసులో కేరళం మాజీ ముఖ్యమంత్రి, సిపిఐ(ఎం) సీనియర్ నేత పినరయి విజయన్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఇడి ఆదేశించిన నేపథ్యంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం శనివారం స్పందించారు. ఈ వ్యవహారాన్ని ఎల్‌డిఎఫ్ రాజకీయంగా ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. విజయన్ విషయంలో ఆయన నేరుగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. సిఎంఆర్ఎల్ చెల్లింపుల కేసులో విజయన్, ఆయన కుటుంబంపై కేసు నమోదు చేయాలని కోరుతూ కేరళం డిజిపికి ఇడి రాసిన లేఖ గురించి అడిగినప్పుడు, ఆ కేసు వివరాలు తనకు పూర్తిగా తెలియవని విశ్వం చెప్పారు. శనివారం తిరువనంతపురంలో జరిగిన ఒక కార్యక్రమం సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆ కేసు పూర్తి వివరాలు నాకు తెలియవు అని ఆయన అన్నారు. సిపిఐ వైఖరి గురించి మరింతగా అడిగినప్పుడు, తమ పార్టీ రాజకీయ విధానం ఎల్‌డిఎఫ్, వామపక్షాల విధానమేనని విశ్వం చెప్పారు. కేరళలో సిపిఐ(ఎం) నేతృత్వంలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్‌లో సిపిఐ భాగస్వామిగా ఉంది. 'అన్ని అంశాలపై సిపిఐకి ఒక రాజకీయ వైఖరి ఉంటుంది. వామపక్ష విలువలు మాకు రాజీపడని అంశాలు. కేంద్ర సంస్థలు రాజకీయాలు చేస్తే, ఎల్‌డిఎఫ్ దానిని రాజకీయంగా ఎదుర్కొంటుంది' అని ఆయన అన్నారు. ఇడితో సహా కేంద్ర సంస్థల పాత్ర అందరికీ తెలిసిందేనని, అవి కొన్నిసార్లు రాజకీయ ఉద్దేశాలతో వ్యవహరిస్తాయని విశ్వం ఆరోపించారు. అటువంటి చర్య జరిగితే, ఎల్‌డిఎఫ్ దానిని వ్యతిరేకిస్తుంది అదే సిపిఐ విధానం అని ఆయన చెప్పారు. కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న విజయన్‌పై కేసు నమోదు చేయాలన్న ఇడి చర్యపై సిపిఐ తన వైఖరిని స్పష్టం చేస్తుందని ఎల్‌డిఎఫ్ కన్వీనర్ టి.పి. రామకృష్ణన్ ఆశించిన మరుసటి రోజే విశ్వం ఈ వ్యాఖ్యలు చేశారు.

# పశ్చిమాసియా శాంతి సాధనకు బ్రిక్స్‌దేశాల పాత్ర

## చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపు

- రోజురోజుకూ విజృంభిస్తున్న ఏకపక్షవాదం
- ప్రచ్ఛన్నయుద్ధ ఆలోచనాధోరణిని వ్యతిరేకిద్దాం
- మానవాళి ఉమ్మడి భవిష్యత్తుకోసం కలిసి పనిచేద్దాం
- శరవేగంగా వృద్ధిచెందుతున్న దక్షిణార్థగోళ దేశాలు




**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో శాంతి సాధనకు బ్రిక్స్‌దేశాలు తమ వంతు పాత్ర వహించాలని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ పిలుపు ఇచ్చారు. న్యూఢిల్లీ భారత్ మండపంలో శనివారం బ్రిక్స్ 18వ సదస్సులో జిన్‌పింగ్ ప్రారంభోపన్యాసం చేస్తూ,పశ్చిమాసియాలో శాంతి–సామరస్యాల సాధనకు,ఒక ఉత్తమస్థాయీ భవిష్యత్తు నిర్మాణానికి అందరితో కలిసి పనిచేయడానికి బ్రిక్స్ సభ్యదేశాలతో చైనా కలిసి కృషి చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. జిన్హువా వార్తాసంస్థ ఆయన ప్రసంగాన్ని ప్రచురించింది.రోజు రోజుకూ విస్తరిస్తున్న,అభివృద్ధి చెందుతున్న మార్కెట్లకు,అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారానికి బ్రిక్స్ వేదిక ప్రపంచంలోనే అంత్యంత శక్తిమంతమైన వేదిక అని ప్రశంసించారు.ప్రపంచ కృత్రిమ మేధస్సు సహకార సంస్థలో కలిసి పనిచేయడానికి బ్రిక్స్‌దేశాలకు ఆయన స్వాగతం పలికారు.
పశ్చిమాసియాలో శాంతిసాధనకు ద్విముఖపాత్ర పోషించాలన్నారు. ఈ ప్రాంతంలో యుద్ధ పరిస్థితిలో మార్పులు కొనసాగుతున్నాయని,యుద్ధంవల్ల ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర నష్టం జరిగిందని,ఇది అంతర్జాతీయ సమాజ ఉమ్మడి ప్రయోజనాలకు ఎంతమాత్రం దోహదపడదన్నారు.పరస్పర సంబంధాలు,సంభాషణల ద్వారా,విభేదాలను సజావుగా నియంత్రించుకోవడం ద్వారా బ్రిక్స్ సభ్యదేశాలు గాఢమైన అవగాహన పెంపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గడచిన రెండు దశాబ్దాలుగా బ్రిక్స్ సహకార యంత్రాంగం నిరంతరాయంగా వృద్ధిచెందుతూ,విస్తరిస్తోందని,అద్భుతమైన చైతన్యాన్నీ,వేగాన్ని ప్రదర్శించిందన్నారు.ఇరవై సంవత్సరాలుగా స్వయంసమృద్ధి,స్వీయ శక్తిసామర్థ్యాలను సమకూర్చుకుందని,కూటమి దేశాలు వారి వారి జాతీయ పరిస్థితులకు అనుగుణంగా చాలా క్రియాశీలంగా అభివృద్ధి మార్గాలను విస్తరించుకుంటున్నాయని,మరోవైపు వృద్ధిచెందుతున్న మార్కెట్ల మధ్య ఐక్యతను ప్రదర్శిస్తున్నాయన్నారు. ప్రపంచ ఆర్థిక సంక్షోభం దగ్గర నుండి కోవిడ్–19 మహమ్మారి,వాతావరణ మార్పు వంటి విస్తారమైన అంశాల వరకూ బ్రిక్స్‌దేశాలు సవాళ్ళను పరిష్కరించుకోవడానికి ఉమ్మడిగా కృషి చేస్తున్నాయన్నారు. ఈ కూటమి దేశాలు చా లాస్థిరంగా దక్షిణార్థగోళ దేశాల ఉమ్మడి ప్రయోజనాలను ఐక్యంగా సంరక్షిస్తున్నాయని,ప్రపంచానికి స్థిరత్వాన్ని,సానుకూల పురోగతిని సమకూరుస్తున్నాయన్నారు. ప్రచ్ఛన్నయుద్ధ ఆలోచనాధోరణి,సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించడాన్ని, ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడాన్ని బ్రిక్స్‌దేశాలు తీవ్రంగా ప్రతిఘటించాలని కోరారు. శక్తిసామర్థ్యాల విషయంలో దక్షిణార్థగోళ దేశాలు శరవేగంగా వృద్ధిచెందుతున్నాయని,ఈ పరిస్థితుల్లో బహుళధ్రువ ప్రపంచ వాతావరణ పరిస్థితిని ఎవ్వరూ అడ్డుకోలేరన్నారు.ఉమ్మడి,సమగ్ర,సహకార,స్థిరమైన భద్రతాదార్శనికతను బిక్స్‌దేశాలు ప్రముఖంగా చాటి చెప్పాలని,ప్రచ్ఛన్నయుద్ధ మనస్తత్వాన్ని వ్యతిరేకించాలని జిన్‌పింగ్ కోరారు.ఏకపక్షవాదం,అధికార రాజకీయాలు రోజురోజుకూ పేట్రేగిపోతున్నాయన్నారు. అంతర్జాతీయ చట్టాలు,అంతర్జాతీయ క్రమశిక్షణ అడుగంటిపోయిందని,శాంతికి,అభివృద్ధికి,భద్రతకు విఘాతం కలుగుతోందన్నారు. బ్రిక్స్‌దేశాలు చరిత్రలో సరైన పక్షంవైపు దృఢంగా నిలబడాలని,కాలానికి మార్గదర్శకులుగా ఉండాలని,అంతర్జాతీయ వ్యవస్థను మరింత న్యాయబద్ధంగా,సమానత్వం దిశగా నడిపించాలని,మానవాళి ఉమ్మడి భవిష్యత్తుకోసం కలిసి పనిచేయాలని కోరారు.

## బిజెపి హయాంలో గుజరాత్‌లో

# సుజలాం లేదు.. సుఫలాం లేదూ...

- కలుషిత తాగునీటిపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే మండిపాటు



**న్యూఢిల్లీ :** కొన్ని గ్రామాల్లో నీరు కలుషితమైనట్లు వెల్లడించిన కాగ్ నివేదిక ఆధారంగా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శనివారం గుజరాత్ బిజెపి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తమ 28 ఏళ్ల పాలనలో ఆ పార్టీ రాష్ట్రంలో కేవలం అబద్ధపు ప్రచారాన్ని మాత్రమే సాగించిందని ఆయన ఆరోపించారు. 'మోదీ జీ చేసిన 'హర్ ఘర్ జల్' (ప్రతి ఇంటికీ నీరు) వాగ్దానాలు కలుషిత నీటిలో కొట్టుకుపోయాయి' అని ఖర్గే శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. రాష్ట్రంలో 90 శాతం నీటి నమూనాలు తాగడానికి పనికిరావని తేలిందని ఆయన తెలిపారు. 'మోదీ జీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2004లో 'సుజలం–సుఫలం' పథకం గురించి గొప్పగా ప్రచారం చేశారు. కానీ నేటికీ గుజరాత్ ప్రజలు ఒక చుక్క నీటి కోసం తపిస్తున్నారు' అని ఆయన హిందీలో చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. మోదీ ప్రధానమంత్రి అయ్యాక కూడా అదే తరహా నిష్ప్రయోజనమైన ప్రచారం 'జల్ జీవన్ మిషన్' విషయంలోనూ కొనసాగిందని కాంగ్రెస్ అధినేత ఆరోపించారు. '2022 నాటికి 100 శాతం కుళాయి కనెక్షన్లు కల్పించామన్న బిజెపి ప్రభుత్వ వాదనను కాగ్ ఇప్పుడు బట్టబయలు చేసింది. ఇంకా 14 లక్షల కుటుంబాలు నీటి కోసం ఎదురుచూస్తున్నాయి' అని ఖర్గే ఆరోపించారు. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, గత వారమే అహ్మదాబాద్ జిల్లాలోని ధోల్కాలో కలుషిత నీరు తాగడం వల్ల క్యాన్సర్‌తో 54 మంది మరణించినట్లు వార్తలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. సౌరాష్ట్రలోని రాజ్‌కోట్, జామ్‌నగర్ వంటి ప్రాంతాలు ఇంకా తాగునీటి కోసం అల్లాడుతున్నాయని, కచ్ సౌరాష్ట్ర ప్రాంతాల్లో రైతులు కరువుతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. 'గుజరాత్ ప్రజలకు 2047 నాటికి 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్) కలలు చూపించారు, కానీ 28 ఏళ్ల బిజెపి పాలనలో కేవలం తప్పుడు ప్రచారం, కృత్రిమమైన ఆకర్షణీయ చిత్రాల ప్రదర్శన, ప్రజల కళ్లు గప్పే పనులే జరిగాయి! బిజెపి పాలనలో 'సుజలం' (స్వచ్ఛమైన నీరు) లేదు, అలాగే 'సుఫలం' (పండ్లు, సారవంతమైన పంటలతో సమృద్ధిగా ఉండటం) కూడా లేదు!' అని ఖర్గే ఆరోపించారు. గుజరాత్‌లో 'జల్ జీవన్ మిషన్' అమలులో ఉన్న తీవ్ర లోపాలను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ బయటపెట్టింది. ప్రాజెక్ట్ జాప్యాలు, ఆర్థిక అవకతవకలు, రాష్ట్రవ్యాప్తంగా నీటి నాణ్యత పరీక్షలలో ఉన్న లోపాలను ఈ నివేదిక ఎత్తిచూపింది. శుక్రవారం నాడు రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాల చివరి రోజున సమర్పించిన కాగ్ నివేదిక ప్రకారం, ఎంపిక చేసిన గ్రామాల్లో పరీక్షించిన నీటి నమూనాలలో దాదాపు 89 శాతం వినియోగానికి పనికిరానివిగా తేలాయి. అలాగే, తప్పుడు లెక్కలు, నిబంధనలకు విరుద్ధమైన ఖర్చుల కారణంగా కాంట్రాక్టర్లకు కోట్లాది రూపాయల అదనపు చెల్లింపులు జరిగాయి.ఈ ఆడిట్ నివేదిక 2019–20 నుండి 2023–24 వరకు జల్ జీవన్ మిషన్ అమలు తీరును సమీక్షించింది.

## హఫీజ్ సయీద్‌పై ఎన్ఐఎ నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ



**జమ్ము :** కేంద్రపాలిత ప్రాంతంలో పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థలకు ఆయుధాలు, నిధులు సరఫరా, ఆదేశాలు జారీ చేసిన కేసులో భారత్ మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్‌గా భావిస్తున్న లష్కరే తొయిబా (ఎల్ఇటి) వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ప్రస్తుతం సయీద్ పాకిస్థాన్‌లో ఉన్నాడు. రెండు నెలల్లో సయీద్‌పై జారీ అయిన రెండవ నాన్‌బెయిలబుల్ వారెంట్ ఇది. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 75 కింద ఉగ్రవాదిగా ప్రకటించబడిన సయీద్‌పై ఎన్ఐఎ దాఖలు చేసిన దరఖాస్తుపై విచారణ జరుపుతూ, జమ్ములోని ఒక ప్రత్యేక న్యాయస్థానం ఈనెల 8న ఈ నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసింది. ఈ ఏడాది ప్రారంభంలో శ్రీనగర్ శివార్లలోని పాండాచ్ వద్ద జరిగిన తనిఖీలో మహమ్మద్ నఖీబ్ భట్ అరెస్టుకు సంబంధించిన కేసులో, పంజాబ్‌లోని (పాకిస్థాన్) సర్గాధా నివాసి అయిన సయీద్‌ను పరారీలో ఉన్న నిందితుడుగా ఆ దరఖాస్తులో పేర్కొన్నారు. బత్‌పోరా నివాసి అయిన భట్ వద్ద నుండి చైనాలో తయారైన ఒక గ్రెనేడ్ 15 సజీవ తూటాలను స్వాధీనం చేసుకున్నారు. జకోరా పోలీస్ స్టేషన్‌లో భట్‌పై యుఎపిఎ, ఆయుధాల చట్టం, పేలుడు పదార్థాల చట్టం కింద కేసు నమోదు చేశారు. తదుపరి దర్యాప్తు ఒక ఉగ్రవాద నెట్‌వర్క్‌ను ఛేదించడానికి దారితీసింది. దీని ఫలితంగా ఎల్ఇటి, దాని అనుబంధ సంస్థ అయిన రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ఎఫ్)తో సంబంధం ఉన్న పలువురు ఉగ్రవాదులు, ఇద్దరు పాకిస్తానీ జాతీయులను అరెస్టు చేశారు. నిషేధిత ఉగ్రవాద సంస్థ వ్యవస్థాపకుడు అయిన సయీద్ ప్రమేయం దర్యాప్తులో వెలుగులోకి వచ్చిందని, అరెస్టు అయిన పాకిస్తానీ ఉగ్రవాదులకు అతనితో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయని ఎన్ఐఎ తెలిపింది. 'సయీద్ పాకిస్తాన్ నుంచి పనిచేస్తూ, కశ్మీర్ లోయలో పనిచేస్తున్న ఉగ్రవాదులకు ఆయుధాలు, డబ్బు, ఆదేశాలు అందిస్తున్నాడు. సదరు ఉగ్రవాది ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్నాడని, చట్టం కంట పడకుండా తప్పించుకోవడానికి ఉద్దేశపూర్వకంగా అరెస్టును తప్పించుకుంటున్నాడని సమాచారం అందింది' అని ఎన్ఐఏ కోర్టుకు తెలిపింది. ఏజెన్సీ వాదనలు విన్న అనంతరం, ప్రత్యేక న్యాయమూర్తి ప్రేమ్ సాగర్, దర్యాప్తు సమయంలో సయీద్ ప్రమేయం వెలుగులోకి వచ్చిందని, అతను ఉగ్రవాద కార్యకలాపాలలో పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.

# స్వీడన్ ఎన్నికల్లో వామపక్ష కూటమి ఆధిక్యం

**ముందస్తు నివేదికల వెల్లడి**
**నేడు సార్వత్రిక ఎన్నికలు**



**స్టాక్‌హోం:**ఉత్తర యూరప్ స్కాండినేవియన్ ద్వీపకల్పదేశం స్వీడన్‌లో ఆదివారం సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ జరుగుతుంది. సోమవారం సాయంత్రం వరకూ ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది. సోషల్ డెమోక్రాట్స్ తరపున మాగ్దలీనా ఆండర్‌సన్‌ను ప్రధానమంత్రి పదవిలో ప్రతిష్ఠించేందుకు వామపక్షాలు ప్రజల్లోకి వెళ్ళి తీవ్ర కృషి చేస్తున్నాయి. దేశంలో ఎనిమిది మిలియన్ల మంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. స్వీడన్ ప్రజలకు సంకీర్ణ కూటమి రాజకీయాలు అలవాటే. ముందస్తు అంచనా పోలింగ్ సమాచారం ప్రకారం,ఈ ఎన్నికల్లో నాలుగు ప్రగతిశీల పార్టీలు భాగస్వామిగా ఉన్న వామపక్ష కూటమి స్వల్ప ఆధిక్యంలో ఉన్నాయి. ముందస్తు సర్వే నివేదికల ప్రకారం వామపక్ష కూటమికి 50.8 శాతం,మితవాదులకు 47.6 ప్రజల మద్దతు ఉంది. వామపక్ష కూటమిలో భాగస్వామిగా ఉన్న సోషల్ డెమోక్రాట్స్ పార్టీ 28.6 శాతం ఓట్లతో ఆధిక్యంలో ఉంది. వామపక్ష—మితవాద కూటముల మధ్య దేశంలో హోరాహోరీ పోటీ కొనసాగుతోంది. జులై 30వ తేదీన విదేశీలలో ఉండే స్వీడన్ జాతీయులు పోలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. దేశ అత్యున్నత చట్టసభ రిక్స్‌డాగ్ పార్లమెంటులో మొత్తం 349 స్థానాలు ఉండగా, ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ఏ కూటమి అయినా 175 స్థానాలు గెలుచుకోవాలి.ఐతే ఆగస్టు 21వ తేదీన ఒక స్వీడన్ విద్యార్థి పెద్ద కత్తి తీసుకుని పాఠశాలపై దాడిచేసి హత్యలకు పాల్పడిన తర్వాత అనేకమంది నాయకులు తమ ఎన్నికల ప్రసంగాలను వాయిదా వేసుకున్నారు. దేశ పార్లమెంటుకు,స్థానిక చట్టసభలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతూ ఉండటంతో స్వీడన్‌లో రాజకీయ కూటములకు ఈ ఎన్నికలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారాయి. మోడరేట్స్(ఎం పార్టీ),క్రిస్టియన్ డెమోక్రాట్స్,లిబరల్స్,స్వీడన్ డెమోక్రాట్లతో కూడిన పచ్చిమితవాద కూటమి 2022 సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి పరిపాలన సాగించింది. ఈ నాలుగు పార్టీలు టిడో పార్టీలుగా ప్రసిద్ధి చెందాయి. ప్రస్తుతం ఎం పార్టీ నాయకుడు ఉల్ఫ్ క్రిస్టెర్సన్ ప్రధానమంత్రిగా ఉన్నారు. తాను తిరిగి అధికారంలోకి వస్తే పచ్చిమితవాద నాయకులకు మంత్రిపదవులు ఇస్తానని ప్రధానమంత్రి క్రిస్టెర్‌సన్ హామీ ఇచ్చారు.నయా నాజీ మూలాల మద్దతు ఉన్న క్రిస్టెర్‌సన్‌కు స్వీడన్ డెమోక్రాట్ల గట్టి మద్దతు ఉంది. 2024 మార్చిలో స్వీడన్ నాటో కూటమిలో చేరింది.

# ఐర్లాండ్‌కు ఎలాంటి హానీ చేయను:ట్రంప్

**ఎప్పటికైనా ఐర్లాండ్ ఏకీకృతమవుతుంది**



**డబ్లిన్:**ఐర్లాండ్‌కు ఎలాంటి హానీ తలపెట్టాలని కోరుకోవడంలేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. ఏకీకృత ఐర్లాండ్‌ను తాను చూడాలని కోరుకుంటున్నానన్నారు. ఏకీకృత ఐర్లాండ్ ఒక గొప్ప విషయమన్నారు.రెండు రోజుల పర్యటన నిమిత్తం ట్రంప్ ఐర్లాండ్‌కు వెళ్ళారు. ఆ దేశ ప్రధానమంత్రి మైఖేల్ మార్టిన్ (టావోసీచ్),ఇతర నాయకులతో ఆయన సమావేశాలు నిర్వహించారు.ఐర్లాండ్‌తో అమెరికాకు బలమైన బంధం ఉందని మార్టిన్‌తో సమావేశంలో ట్రంప్ వ్యాఖ్యానించారు. రెండు దేశాలూ బాగా పనిచేస్తున్నాయని, ప్రస్తుతం ఉన్న అనుబంధం గతంలో ఎన్నడూలేదని అన్నారు.శనివారం ఉదయం డబ్లిన్ విమానాశ్రయంలో డోనాల్డ్ ట్రంప్‌కు ఐర్లాండ్ ఉప ప్రధానమంత్రి సైమస్‌హారిస్,విదేశాంగమంత్రి హెలెన్ మెక్ స్వాగతం పలికారు. ఏకీకృత ఐర్లాండ్ గురించి తొలుత విలేకరులు ట్రంప్‌ను ప్రశ్నించగా ఐర్లాండ్‌కు తాను ఎలాంటి హానీ తలపెట్టదలచుకోలేదన్నారు.ఐర్లాండ్ ఏనాటికైనా ఏకీకృతమవుతుందని, దీనిని ఏకీకృతం చేయడానికి ప్రస్తుత ప్రధానమంత్రి సరైన నాయకుడని ప్రశంసించారు. ఈ విషయంలో బ్రిటన్‌కు కూడా ఏదో ఒక అభిప్రాయం ఉండే ఉంటుందని అంటూ, ''ఐర్లాండ్ ఏకీకృతం కావడం ఏ విధంగా చెడ్డవిషయం?''అని ప్రశ్నించారు. బ్రిటన్‌తో తమకున్న విభేదాలమధ్య ఐర్లాండ్ ఒక పావు కాబోదని ఆయన అన్నారు. ఉత్తర అట్లాంటిక్‌లో ఉన్న, యూరప్ ఖండంలోని మూడవ అతిపెద్ద ద్వీపం ఐర్లాండ్. ఈ పర్యటనలో ముందుగా ట్రంప్ ఐరిష్ అధ్యక్షుడు క్యాథరిన్ కొన్నోలీని మర్యాదపూర్వకంగా కలిశారు.ట్రంప్ పర్యటన సందర్భంగా రాజధాని డబ్లిన్‌లో వందలమంది ప్రజలు నిరసన ప్రదర్శనకు సిద్ధపడ్డారు. డెమోక్రటిక్ యూనియనిస్టుపార్టీ నాయకుడు గావిన్ రాబిన్‌సన్ మాట్లాడుతూ, ఉత్తర ఐర్లాండ్ రాజ్యాంగ భవిష్యత్తును అక్కడి ప్రజలే నిర్ణయిస్తారని, వాషింగ్టన్,డబ్లిన్,లండన్‌ల నుండి వ్యాఖ్యలు ఎట్టిపరిస్థితుల్లోనూ ఐర్లాండ్ భవిష్యత్తును నిర్ణయించబోవన్నారు. ఎన్నికలు ఎంత ముఖ్యమో చాలామంది కంటే ట్రంప్‌కు బాగా తెలుసునన్నారు.ఉత్తర ఐర్లాండ్ బ్రిటన్‌లో ఒక భాగంగా ఉండటమనేది అక్కడి ప్రజల నిర్ణయమని అన్నారు.

## రష్యాపై ఆంక్షలు ఆమోదిస్తే
# భారత్‌కు కష్టకాలం

**ఇప్పటికే భారీగా పెరిగిన చమురు బిల్లు**
**రేపు అమెరికా ప్రతినిధుల సభలో ఓటింగ్**

**వాషింగ్టన్:**రష్యాకు వ్యతిరేకంగా అమెరికా కాంగ్రెస్‌లో ప్రతిపాదించిన ఆంక్షల బిల్లుపై సోమవారం(సెప్టెంబరు 14) ఓటింగ్ జరుగుతుంది. ప్రతినిధుల సభలో ఈ బిల్లు ఆమోదం పొందితే రష్యా నుండి చమురు దిగుమతి చేసుకుంటున్న ప్రధాన దేశాలలో ఒకటైన భారత్‌పై తీవ్రమైన సుంకాల భారం పడే అవకాశాలున్నాయి.ప్రస్తుతం పశ్చిమాసియా యుద్ధం మరింత తీవ్రస్థాయిలో విస్తృతమవుతున్న దశలో భారత్‌పై తీవ్రంగా పెరుగుతున్న దిగుమతి ఖర్చుల భారం మరింత పెనుభారం అవుతుంది.భారత్,చైనా సహా రష్యాకు చెందిన ఇతర వాణిజ్య భాగస్వామ్య దేశాలపై తీవ్రమైన సుంకాల భారాలు విధించాలని కోరుతూ ఈ బిల్లును అమెరికా కాంగ్రెస్‌లో ప్రతిపాదించారు.గతనెలలో ప్రతిపక్ష డెమోక్రాట్ల తీవ్ర వ్యతిరేకత మధ్య సెనేట్‌లో ఆమోదం పొందిన బిల్లును ''లింద్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026'' అనే పేరుతో ప్రతిపాదించారు. సోమవారం హౌస్ రూల్స్ కమిటీ ఓటింగ్ చేపట్టనున్నది.ఈ బిల్లు ప్రతినిధుల సభ ఆమోదం పొందితే, రష్యాతోపాటు ఆ దేశం నుండి గ్యాస్,చమురు కొనుగోలు చేసే దేశాలపై కఠినమైన ఆంక్షలు విధించడానికి, ఆ దేశాలపై తీవ్రస్థాయిలో సుంకాల భారాలు మోపేందుకు ఇరాన్‌పై ఇప్పటికే ఉన్న ఆంక్షలను మరికొంత కాలం పొడిగించేందుకు ట్రంప్‌కు విశేష అధికారాలు లభిస్తాయి. మైనార్టీ నాయకుడు హకీమ్ జెఫ్రీస్‌తోసహా కాంగ్రెస్‌లో అనేకమంది డెమోక్రాట్లు ఇప్పటికీ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.ఈ బిల్లు ఆమోదం పొందితే ట్రంప్‌కు అత్యంత ప్రమాదకరమైన అధికారాలు లభిస్తాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు.''ఉక్రేన్‌కు మద్దతు ఇచ్చే విషయంలో సభలో డెమోక్రాట్లు నిబద్ధతతో ఉన్నారు, కానీ లింద్సే ఓ గ్రాహం బిల్లు మంచి కంటే ఎక్కువగా హాని కలిగిస్తుంది'' అని కాంగ్రెస్‌లో డెమోక్రటిక్‌పార్టీ సభ్యులు గ్రెగొరీ మీక్స్,డాన్ బేయర్,రిచర్డ్ మీల్ చెప్పారు.ఈ బిల్లు దేశాధ్యక్షుడి అధికారాలను నాటకీయస్థాయిలో విస్తరిస్తుంది, అదే సమయంలో ఈ బిల్లు వల్ల ఆంక్షలను అమెరికా అనివార్యం చేయలేదు,రెండూ ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు, దీనివల్ల దేశంలో ధరలు పెరుగుతాయి, ఉక్రేన్‌కు మద్దతు బలహీనపడుతుంది అని డెమోక్రాట్స్ అన్నారు.

# ద్వైపాక్షిక సంబంధాల్లో స్థిరమైన దీర్ఘకాలిక దృక్పథం

- మోదీతో ముఖాముఖీ సంభాషణలో జిన్‌పింగ్ ఉద్ఘాటన
- విభేదాల నియంత్రణతోపాటే సహకార పటిష్టతకు కృషి
- ఆమోదయోగ్యమైన పరిష్కారానికి నాయకులిద్దరి నిబద్ధత

**న్యూఢిల్లీ:**భారతదేశంతో అనుసరించే ద్వైపాక్షిక సంబంధాలను చైనా ఎల్లప్పుడూ స్థిరమైన దీర్ఘకాలిక దృక్పథంతోనే చూస్తుందని ఆ దేశ అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ స్పష్టం చేశారు. బ్రిక్స్ 18వ సదస్సు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీతో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ విడిగా ముఖాముఖీ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు.శనివారం సాయంత్రం జరిగిన ఈ సమావేశం ఎంతో కీలకమైనదిగా భావిస్తున్నారు.ఇరు దేశాల నాయకులు ఇదే విషయాన్ని పునరుద్ఘాటించినట్లు పిటిఐ వార్తా సంస్థ తెలియజేసింది.వాణిజ్యం సహా అనేక సమస్యలను పరిష్కరించుకోవడానికి ఇరుదేశాలకు ఆమోదయోగ్యమైన,నిష్పక్షపాతమైన,న్యాయబద్ధమైన పరిష్కారాలు సాధించాలని మోదీ—జిన్‌పింగ్ నొక్కిచెప్పారు. సమగ్ర ద్వైపాక్షిక సంబంధాల రాజకీయ దృక్కోణాన్ని, ఇరు దేశాల ప్రయోజనాలను దృష్టిలోపెట్టుకుని నిష్పాక్షిక,సహేతుక పరిష్కారాలు సాధించాలని నాయకులిద్దరూ అభిప్రాయపడ్డారు.ప్రాంతీయ,ప్రపంచ సమస్యలు,సవాళ్ళను ఎదుర్కోవడంలో ఇరువురు నాయకులకు ఉన్న అవగాహనను మరింతగా విస్తరించుకోవాలని అభిప్రాయపడ్డారు. సరిహద్దు సమస్యలపై ఉన్న ఒప్పందాలను అర్థం చేసుకుని పాటించాల్సిన అవసరం ఉందన్నారు.ఇరు దేశాలూ వాణిజ్యలోటు తగ్గించుకోవడం,ఉగ్రవాద సవాళ్ళు ప్రతిఘటించడం,అనేక దేశాలతో వేదికలు పంచుకునే సమయాల్లో వాణిజ్యంపై నిష్పాక్షిక నిర్ధారణలకు రావడం వంటి అనేక అంశాలపై ఇరువురూ చర్చించారు.పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఆసియాలో అగ్రదేశాలైన చైనా—భారత్ ఎక్కువ భారాలను మోయాల్సి వస్తున్నందువల్ల సమ్మిళిత ఆర్థిక భవిష్యత్తుకోసం చేతులు కలపాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.మానవాళి భవిష్యత్తును,ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకోవాలని,సహకార ప్రోత్సాహానికి ముందుకు వెళ్ళాలని భావించారు.సంబంధాలు స్థిరంగా,నిర్మాణాత్మకంగా కొనసాగుతాయని,ఈ విధానానికే ప్రాధాన్యత ఇస్తామని జిన్‌పింగ్ స్పష్టం చేశారు. ఒకవైపు విభేదాలను నియంత్రిస్తూనే,మరోవైపు సంభాషణలను,సహకారాన్ని బలోపేతం చేసుకునేందుకు ఇరు దేశాలు కృషి చేస్తాయన్న విషయాన్ని ఆయన ప్రకటన ప్రతిబింబిస్తోందని ప్రముఖ ఆంగ్ల పత్రిక పేర్కొంది.తక్షణ ఉద్రిక్తతలకు అతీతంగా భారతదేశంతో దీర్ఘకాలిక ద్వైపాక్షిక సంబంధాలను చైనా కోరుకుంటున్నదని చైనా అధ్యక్షుడి మాటలు స్పష్టం చేస్తున్నాయి. అంటే తాత్కాలిక ఉద్రిక్తలను నియంత్రించేందుకు,పరిష్కరించేందుకు, సంయమనం పాటించేందుకు చర్చలు జరుగుతూ ఉంటాయి.కాగా ఇరు దేశాలమధ్యా ముఖ్యమైన సవాళ్ళు ఇంకా మిగిలే ఉన్నాయి.సరిహద్దు సమస్య చాలా సున్నితమైన విషయంగా కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే అనేక విడతల చర్చలు జరిగాయి. మరిన్ని చర్చలకు ఇరు దేశాలు సమాయత్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆసక్తి ఉన్న అంశాలపై ఇరు దేశాల నిరంతర సంప్రదింపులను జిన్‌పింగ్ ఉద్ఘాటించారు.

బ్రిక్స్ సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇచ్చిన సందర్భంగా జరిగిన ఈ సమావేశం అత్యధిక ప్రాముఖ్యత సంతరించుకుంది.ఒకవైపు సుదీర్ఘమైన సరిహద్దురేఖ వెంట అనేకచోట్ల సమస్యల పరిష్కారానికి ఎడతెగని చర్చలు,మరోవైపు అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దు గ్రామాల్లో చొరబాట్ల వివాదం తరుణంలో జిన్‌పింగ్ మాటలకు అధిక ప్రాధాన్యత వచ్చింది. రెండు దేశాలు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలుగా రోజురోజుకూ రూపాంతరం చెందుతున్నాయి.ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడితే బ్రహ్మాండమైన సహకారాన్ని దారితీస్తుంది,విస్తారమైన ఈ ప్రాంతంలో స్థిరత్వానికి,అభివృద్ధికి దోహదం చేస్తుంది.లఢఖ్‌లో ఏడు సంవత్సరాలక్రితం ఘర్షణలు చెలరేగి ఇరువైపులా డజన్లమంది మరణించిన తర్వాత సంబంధాల స్థిరీకరణకు రెండు వైపులా ఇటీవలికాలంలో ముమ్మరకృషి జరుగుతోంది. ఇటీవల భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చైనా వెళ్ళి అక్కడి విదేశాంగమంత్రి వాంగ్ యీతో 25వ విడత సంభాషణలు చేసిన తర్వాత జిన్‌పింగ్ భారత్ పర్యటన ఖరారైంది.న్యూఢిల్లీ బ్రిక్స్ సదస్సుకు ఆయన హాజరయ్యారు. 2014 నుండి ఇప్పటి వరకూ 21 సార్లు తాను ప్రధానమంత్రి మోదీని వివిధ సందర్భాలలో,వివిధ సదస్సులు,సమావేశాలలో కలుసుకున్నానని జిన్‌పింగ్ ప్రకటించారు.వచ్చే ఏడాది బ్రిక్స్ వేదికకు చైనా అధ్యక్ష బాధ్యతలు వహిస్తుంది. 19వ బ్రిక్స్ సదస్సుకు చైనా ఆతిథ్యం ఇవ్వనున్నది.మరో రెండేళ్ళలో మూడు సువర్ణాధ్యాయాలను బ్రిక్స్ పూర్తిచేసుకుంటుంది. జి—7 కంటే ఎంతో విస్తారమైన,బలమైన ఆర్థిక వేదికగా అవతరించింది. అనేక దేశాలు గడచిన రెండు సంవత్సరాలుగా బ్రిక్స్ సభ్యత్వం తీసుకున్నాయి.ప్రపంచదేశాల స్థూలజాతీయోత్పత్తిలో 40 శాతానికి బ్రిక్స్ కూటమి దేశాలే ప్రాతినిధ్యం వహిస్తున్నాయని ముందురోజే రష్యా అధ్యక్షుడు పుతిన్ వాస్తవావిష్కరణ చేశారు.

**సరిహద్దుల్లో శాంతి—సామరస్యం ముఖ్యం**
**ముఖాముఖీలో స్పష్టం చేసిన మోదీ**

భారత్—చైనా దేశాలమధ్యా సంబంధాలకు సరిహద్దుల్లో శాంతి—సామరస్యం—ప్రశాంతత ఎంతో అత్యవసరమైనవని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశం సందర్భంగా మోదీ మాట్లాడుతూ,ఇరు దేశాల సంబంధాలలో పరస్పర గౌరవం,పరస్పర ప్రయోజనం,సున్నితత్వం వంటి అంశాలపై ఇరు దేశాల సంబంధాలు కొనసాగాలని తెలియజేశారు.

## జరిమానాలే
**(మొదటి పేజీ తరువాయి)**

సులభతర వాణిజ్య విధానాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. సుమారు 4 వందలకు పైగా అంశాలను నేర పూరిత పరిధి నుంచి తొలగిస్తున్నామన్నారు.

**న్యాయవ్యవస్థపై భారం తగ్గించాలి : బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్**

కోర్టుల్లో లక్షలాది కేసులు పెండింగ్‌లో ఉండటం పట్ల బిజెపి సభ్యులు పాయల్ శంకర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి చిన్న విషయానికి వేల సంఖ్యలో కేసులు నమోదు కావడం వల్ల న్యాయవ్యవస్థపై విపరీతమైన భారం పెరుగుతోందని, కేసుల విచారణకు గంటలు, రోజుల తరబడి సమయం పడుతుండటంతో వాయిదాల పరంపర కొనసాగుతోందన్నారు. చాలా సందర్భాలలో సబ్ జ్యుడిషియల్ అంశాల పేరుతో అధికారులు జోక్యం చేసుకోకుండా బాధ్యతల నుంచి తప్పుకుంటున్నారని విమర్శించారు. పోలీస్, ఇతర ప్రభుత్వ శాఖల పనితీరును కేవలం నమోదైన కేసుల సంఖ్యతో మాత్రమే ప్రామాణికంగా తీసుకోకూడదని, అధిక కేసులు నమోదు కావడం మంచి పరిపాలనా వాతావరణానికి సూచిక కాదన్నారు. గ్రామం నుంచి రాజధాని వరకు సమగ్ర అభివృద్ధి జరిగినప్పుడే తెలంగాణ పురోగతి సాధ్యమవుతుందన్నారు.

**'ప్రజా విశ్వాసం' బిల్లుకు మద్దతు తెలిపిన పాల్వాయి హరీష్ బాబు**

డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు చిన్న నేరాలను డీక్రిమినలైజ్ చేసి జైలు శిక్షలను కేవలం జరిమానాలుగా మార్చడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. ఫారెస్ట్, ఎక్సైజ్, ఫారెస్ట్ ప్రొడ్యూస్, ఫ్యాక్టరీస్,ఎస్టాబ్లిష్‌మెంట్, లేబర్ వెల్ఫేర్ ఫండ్ వ్యాట్, టిఎస్ఐపాస్ వంటి పలు కీలక చట్టాల్లో సవరణలు తీసుకురావడం మంచి నిర్ణయమన్నారు. అటవీ ప్రాంతాల్లోని రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను హరీశ్ బాబు సభ దృష్టికి తీసుకువచ్చారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ కారిడార్‌లో సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల తవ్వకాల వల్ల పులుల సంచారానికి తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలే గన్నారం గ్రామానికి చెందిన ఓ మహిళ పులి దాడిలో ప్రాణాలు కోల్పోయిన విషాదకర ఘటన జరిగిందన్నారు. భూములకు సంబంధించి ఫారెస్ట్ లేదా రెవెన్యూ భూమి అనే స్పష్టత లేకుండానే అధికారులు రైతుల ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల్లో తసర్ సిల్క్ ఉత్పత్తి కోసం నల్లమద్ది చెట్లపై పురుగుల పెంపకం చేపడుతున్న రైతులను అడ్డుకోవద్దని విజ్ఞప్తి చేశారు. చెన్నూరు, సిర్పూర్ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకు తునికాకు, బీడి ఆకుల సేకరణకు తక్షణమే అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా విశ్వాసం చట్ట సవరణలతో పాటు అటవీ శాఖ అధికారుల అత్యుత్సాహాన్ని కూడా అరికట్టాలని, ప్రజలు, రైతులు, గిరిజనుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని హరీశ్ బాబు కోరారు.

## ప్రత్యేక అధికారులు (మొదటి పేజీ తరువాయి)

ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, ఎంపి వేం నరేందర్ రెడ్డి, నగర ప్రజాప్రతినిధులు, జిహెచ్‌ఎంసి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి), హైడ్రా కమిషనర్లు, పోలీసు ఉన్నతాధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేకంగా ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని సిఎం చెప్పారు. హైదరాబాద్ నగరం ప్రశాంతంగా ఉన్నప్పుడే పెట్టుబడులు వస్తాయని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. గణేశ్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు సాఫీగా సాగేందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలని సిఎం కోరారు. ఈ ఉత్సవాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని నిర్వాహకులకు సిఎం స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గణేశ్ ఉత్సవాలకు సంబంధించి గత సంప్రదాయాన్ని పునరుద్ధరించామని చెప్పారు. నిర్వాహకుల సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికి తానే సమీక్ష నిర్వహిస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. గణేశ్ మండపాలకు అతిథులను ఆహ్వానించిన సందర్భాల్లో ఆ వివరాలను నిర్వాహకులు స్థానిక కమిషనరేట్‌కు అందించాలని సిఎం సూచించారు. అవసరమైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పాటు అనుకోని పరిణామాలు జరిగినప్పుడు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు నిర్వాహకులు అందించే సమాచారం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

## శాసనమండలిలో ప్రజా విశ్వాసం బిల్లు ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'తెలంగాణ ప్రజా విశ్వాసం (నిబంధనల సవరణ) బిల్లు' కు శాసనమండలి ఏకగ్రీవంగా ఆమోద ముద్ర వేసింది. అంతకుముందు ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సభలో బిల్లును ప్రవేశపెట్టి బిల్లు ఉద్దేశాలు, ఉపయోగాలను వివరించారు. తెలంగాణ కార్మిక సంక్షేమ నిధి చట్టం గురించి మంత్రి సంపూర్ణంగా వివరించాలని సిపిఐ సభ్యులు నెల్లికంటి సత్యం కోరడంతో శ్రీధర్‌బాబు వివరించారు. కాలనుగుణంగా చట్టాలను మార్చడం మంచిదేనని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండప్రకాష్ అభిప్రాయపడ్డారు. ఈ బిల్లుపై పెద్దగా చర్చజరగకుండానే ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించారు.

## విద్యార్థులు మృతి (మొదటి పేజీ తరువాయి)

మిగతా ఇద్దరు విద్యార్థులు కాలువలో కొట్టుకుపోయి గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న మునగాల పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో కాలువలో గాలింపు చర్యలు చేపటారు. ఈనేపథ్యంలో ఇద్దరు మృతదేహాలను వెలికితీశారు. ఘటనపై మునగాల ఎస్ఐ సంజీవరెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బ్రిక్స్ దేశాలు ఆందోళన
**(మొదటి పేజీ తరువాయి)**




ప్రవేశించిన తరుణంలో ఈ కీలక తీర్మానం చేసింది. న్యూఢిల్లీ భారత్ మండపంలో శనివారం మొదటిరోజు సదస్సులో ప్రపంచ నాయకుల సమక్షంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏకాభిప్రాయ తీర్మాన పత్రాన్ని ప్రకటించారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్,రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్,ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్,అబుధాబి యువరాజు మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌సహా ఇతర అగ్రనాయకుల సమక్షంలో మోదీ బ్రిక్స్ తీర్మాన పత్రాన్ని ప్రకటించారు.తీర్మానంలో ఉన్న చివరి అంశం వరకూ ఈ చర్చలు జరిగాయి.అడ్డగోలు వాణిజ్య విధానాలు,ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటివో) నిబంధనలకు విరుద్ధంగా పెరుగుతున్న ఏకపక్ష సుంకాలపై కూడా సదస్సు తీర్మానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సుంకాలు, టారిఫేతర చర్యలను విచక్షణారహితంగా పెంచుతున్నారని, పర్యావరణం ముసుగులో, రక్షణవాదం ముసుగులో సుంకాలను అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధంగా పెంచడాన్ని తీర్మానంలో సభ్యదేశాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. డబ్ల్యుటివో నిబంధనలకు వ్యతిరేకంగా వాణిజ్యాన్ని సుంకాలతో పరిమితం చేయడంపట్ల ఆందోళన వ్యక్తం చేసింది. ఉగ్రవాదంపట్ల జీరో టోలరెన్స్ (ఎంతమాత్రం సహించకూడదు) పాటించాలని తీర్మానం పేర్కొంది.ఈ ముప్పు ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలు విడనాడాలని పిలుపు ఇచ్చింది.గాజాలో అదేపనిగా, నిరంతరం ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ హింసాకాండ కొనసాగడంపై తీర్మానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గత ఏడాది అక్టోబరులో ఇజ్రాయెల్—పాలస్తీనా హమాస్ మధ్య శాంతి ఒప్పందం జరిగింది. అప్పటినుండీ ఉల్లంఘనలు ఆగకుండా కొనసాగుతున్నాయని విమర్శించింది. గాజా స్ట్రిప్ నుండి పాలస్తీనియన్లను తరిమికొట్టి వారిని స్థానభ్రంశం చేసే చర్యలు నిలిపివేయాలని,పాలస్తీనా ప్రజల అభేద్యమైన హక్కులకు భంగం కలిగించే ఆక్రమణలను చట్టబద్ధంచేసే చర్యలను విధానాలను, ఏర్పాట్లను నిలిపివేయాలని తీర్మానం పిలుపు ఇచ్చింది.''పశ్చిమాసియాలో విరామం లేకుండా విస్తరిస్తున్న ఉద్రిక్తలపై మేం ప్రగాఢమైన ఆందోళన వ్యక్తం చేస్తున్నాం, మా దేశాల వైఖరులను మేం మననం చేసుకుంటూ ఈ యుద్ధంపై గరిష్ఠ సంయమనం పాటించాలని కోరుతున్నాం, యుద్ధ పరిస్థితులు తీవ్రతరం కాకుండా దూరంగా ఉండాలని బ్రిక్స్ సభ్యదేశాలుగా పిలుపు ఇస్తున్నాం'' అని ప్రకటన పేర్కొంది.''అమెరికా దాడులు చేసింది'' అనే ప్రత్యక్ష ప్రస్తావన లేకుండా పశ్చిమాసియా యుద్ధంపై ఏకాభిప్రాయ తీర్మానం చేయడం భారతదేశ దౌత్యవిజయంగా మీడియా ప్రకటించింది. అంతర్జాతీయ చట్టాలకు లోబడి సంభాషణల ద్వారా,దౌత్య మార్గాల ద్వారా యుద్ధం ముగించాలని భారత్ ఉద్ఘాటించిన వైఖరికి హాజరైన సభ్యదేశాల నాయకులు కట్టుబడి ఉన్నట్లు కనిపించిందని పిటిఐ వార్తాసంస్థ వ్యాఖ్యానించింది.అదేవిధంగా ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో సంస్కరణలకు కూడా బ్రిక్స్ సదస్సు ఏకగ్రీవ తీర్మానపత్రం పిలుపు ఇచ్చింది.ఆఫ్రికా,ఆసియా,లాటిన్ అమెరికా,కరీబియన్ ప్రాంతాలలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ సమితిలో,భద్రతామండలిలో సంస్కరణలు తీసుకురావాలని తీర్మానపత్రం ప్రత్యేకంగా కోరింది. బహుళపక్షాలతో నిర్మాణాత్మకస్థాయిలో భద్రతామండలిలో సమతుల్యంతో కూడిన ప్రాతినిధ్యం,నవీనీకరణకు పిలుపు ఇచ్చింది.ఉగ్రవాదాన్ని తీర్మాన పత్రం తీవ్రంగా ఖండించింది. భద్రతామండలిలో కీలక పాత్ర పోషించాలని అభిలషిస్తున్న భారత్,బ్రెజిల్ దేశాలకు సమితి శాశ్వతసభ్యదేశాలైన చైనా—రష్యా తమ మద్దతును పునరుద్ఘాటించాయని పేర్కొంది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం ప్రపంచ దేశాల బాధ్యత అనీ,ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు ఐక్యరాజ్యసమితి సహా ప్రపంచ చట్టాల ప్రకారం చేసే ప్రయత్నాలకు అనుగుణంగా బాధ్యతలను దేశాలు నెరవేర్చాలని తీర్మానం పేర్కొంది. జాతి,మత,సమూహాలతో ముడిపెట్టకుండా, వాటితో సబంధం లేకుండా ఉగ్రవాదానికి బాధ్యులైనవారిని చట్టం ముందు నిలబెట్టాలని,ఉగ్రవాదంలో పాల్గొన్నవారినీ, వారికి మద్దతు ఇచ్చినవారినీ అంతర్జాతీయ చట్టాల ముందు దోషులుగా నిలబెట్టాలని,జవాబుదారీ చేయాలని పునరుద్ఘాటిస్తున్నట్లు మోదీ ఆ తీర్మాన పత్రాంశాలను చదివి సభకు వినిపించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం దేశాల ప్రాథమిక బాధ్యత అని పేర్కొంటూ 2025 ఏప్రిల్ 22వ తేదీన జమ్మూ కశ్మీరులో ఉగ్రవాదులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తీర్మానం పేర్కొంది. ఈ దాడిలో ఆనాడు 26 మంది మరణించారని తీర్మానం తెలియజేసింది.బ్రిక్స్ వేదిక ఎల్లప్పుడూ ఏకాభిప్రాయంతోనే ముందుకు వెళుతుంది.బ్రిక్స్ నియమావళి ప్రకారం ఏ ఒక్కరు వ్యతిరేకించినాగానీ తుది తీర్మానం స్తంభించిపోయినట్లే అవుతుంది. ఈ దశలో భిన్న వైఖరులను సమర్థించే సభ్యదేశాల మధ్య మోదీ ప్రకటించిన తీర్మాన పత్రాన్ని విధానపరంగా సభ్యదేశాలన్నీ ఆమోదించినట్లే. దీనిని భారతదేశ దౌత్యవిజయంగా అభివర్ణించారు.

## శుభపరిణామం
**(మొదటి పేజీ తరువాయి)**

అవినీతి కూడా అదే స్థాయిలో ఉండేదని, కాలక్రమేనా వాటిని సరళీకరించుకుంటూ రావడంతో అవినీతి తగ్గడమే కాకుండా త్వరితగతన అనుమతులు రావడం తద్వారా వ్యాపార రంగం అభివృద్ధి చెంది దేశం ప్రపంచస్థాయిలో పోటీపడే స్థాయికి చేరుకుందని తెలిపారు. ఈ బిల్లుకు సిపిఐ పూర్తిగా మద్దతు తెలుపుతోందన్నారు. తెలంగాణ అటవీ చట్టం కింద చిన్నచిన్న తప్పులకు కూడా జైలు శిక్షలు, పిడి యాక్ట్ ప్రయోగం వంటి చర్యలు తీసుకోవడం సరికావన్నారు. భూమి కోసం, పేదల హక్కుల కోసం పోరాడే వారిపై కేసులు పెట్టకుండా సంప్రదింపుల ద్వారా సమస్యలు పరిష్కరించాలని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. వన్యప్రాణుల దాడులను నియంత్రించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్సైజ్ చట్టం కింద సైతం పెద్ద నేరస్తుల కంటే చిన్న గుడుంబా తయారీదారులనే జైలుకు పంపుతున్నారని విమర్శించారు. గంజాయి కేసుల్లోనూ అక్రమంగా కేసులు బనాయించే ఆరోపణలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. కార్మిక సంక్షేమం, ఫ్యాక్టరీలు, సంస్థల చట్టాల్లోనూ చిన్న ఉల్లంఘనలకు జైలు శిక్షలకు బదులు జరిమానాలు విధించాలని సాంబశివరావు సూచించారు. కార్మికులకు వేతనాలు అందని సందర్భాల్లో యజమానులను జైలుకు పంపడం కాకుండా లేబర్ శాఖ జోక్యంతో బకాయిలు ఇప్పించాలని కోరుతూ చట్టంలో పేర్కొన్న 30 రకాల నేరాలకు సంబంధించిన శిక్షలు, కేసుల వివరాలను ప్రభుత్వం సభ్యులకు సమగ్రంగా అందించాలని కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు.

## భూములు తగ్గాయ్
**(మొదటి పేజీ తరువాయి)**

ఉన్న భూముల సంఖ్య తగ్గిందే తప్ప పెరగలేదని మంత్రి స్పష్టం చేశారు.

**22ఎ కారణంగా రిజిస్ట్రేషన్లు నిలిపివేశారన్నది అవాస్తం**

భూములను 22ఎ లో పెట్టి రిజిస్ట్రేషన్లు నిలిపివేసారనే ఆరోపణలలో వాస్తవంలేదని, భూముల రిజిస్ట్రేషన్ జరిగిన తేదీలను మంత్రి చదివి వినిపించారు. అలాగే, గత ప్రభుత్వంలో 22ఎ లో భూమికి జిహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఎ, డిటిసిపి లేఔట్‌లకు ఇచ్చిన అనుమతులకు సంబంధించి రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో ఉదాహరణలు ఇచ్చారు. 22ఎ వల్ల గడిచిన 3 నెలల్లో రిజిస్ట్రేషన్ల ఆదాయం తగ్గిందనే ప్రచారానికి గత ఏడాది కంటే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రూ.1,359 కోట్లు పెరిగిందని నెలల వారీగా పెరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలను మంత్రి సభ ముందుంచారు. ధరణి వచ్చిన తరువాత తయారు చేసిన 22ఎ జాబితానే హై కోర్ట్ ఆదేశాల మేరకు డిసెంబర్ 3, 2025న ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేసే సమయంలో పొరపాటు చోటుచేసుకుందని, దానిని సరిదిద్దడం జరిగిందని చెప్పారు. ఉమ్మడి ఎపి రాష్ట్రం నుంచి ఉన్న 22ఎ సమస్యను పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్ళు పరిష్కరించి ఉంటే ప్రస్తుతం ఈ సమస్య వచ్చి ఉండేదికాదన్నారు. దొంగే పోలీస్‌ను పట్టుకుని దొంగా... దొంగా... అని అరిచినట్టుగా బిఆర్ఎస్ నాయకుల వైఖరి ఉందని మంత్రి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 22ఎ సమస్య ఉందని, వీటిలో అర్హత కలిగిన ప్రతి సమస్యను ప్రభుత్వం పూర్తిగా చట్టబద్ధంగా పరిష్కరిస్తూ వస్తోందని చెప్పారు.

**రాజీనామా చేయాల్సింది ఎవరు?**

22ఎ భూముల అంశాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాలు రాజకీయ ఆరోపణలు చేస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అగ్రహం వ్యక్త చేశారు. ప్రజల భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉండగా, అసత్య ప్రచారాలతో ప్రభుత్వాన్ని, తనను లక్ష్యంగా చేసుకోవడం ఎందుకని మంత్రి ప్రశ్నించారు. రూపాయి జీతం తీసుకుని పేదల కోసం పనిచేస్తున్న తాను రాజీనామా చేయలా?, రూ.21 కోట్లు తీసుకుని అసెంబ్లీకి రాకుండా ఫామ్ హౌస్‌కే పరిమితమైన ప్రతిపక్ష నాయకులు కె.చంద్రశేఖరరావు రాజీనామా చేయలా? అని హరీష్ రావును మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు.

**పొంగు అంటే బిఆర్ఎస్‌కు ఎందకంత భయం?**

''పొంగులేటి , పొంగు, పొంగు, పొంగు అని బిఆర్ఎస్ నేతలు అంటున్నారు. పొంగు అంటే బిఆర్ఎస్ నాయకులకు ఎందుకంత భయం. గృహప్రవేశం చేస్తూ పొంగించే పాలు పొంగు శుభసూచికం. అదే అటు గోదావరి, ఇటు కృష్ణా నదులు ఉగ్ర రూపం దాల్చినప్పుడు పొంగితే బిఆర్ఎస్ నేతలే కాదు మొత్తం ఆ పార్టీ కొట్టుకుపోతుంది. అదేనా బిఆర్ఎస్ మీ భయం?'' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బిజెపి నేతల నాటకాలు పనిచేయవని, వచ్చే ఎన్నికల్లోనూ కొలువు దీరేది ఇందిరమ్మ ప్రభుత్వమేనని మంత్రి అన్నారు. 'అధికారంలో ఉంటే అవినీతి చేస్తావు. ప్రతిపక్షంలో ఉంటే బ్లాక్ మెయిల్ చే స్తా వు. ఈ తాటాకు చప్పుళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం భయపడదు' అని మంత్రి స్పష్టం చేశారు. కెసిఆర్ భూమి మీద పొర్లాడినా మరోసారి ముఖ్యమంత్రి కాలేరని, ఆనాడు ఖమ్మం సభలో నేను చెప్పినట్లుగానే వచ్చే ఎన్నికల్లో కూడా ఈ సభలో కూర్చునుది కూడా ఇందిరమ్మ ప్రభుత్వమేనని మంత్రి అన్నారు.

**భూమికి ... మనిషికి వీడదీయరాని బంధం**

'రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఎ కు సంబంధించిన సమస్యల'పై జరిగిన చర్చలో కాంగ్రెస్ సభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ భూమికి మనిషికి విడదీయరాని అనుబంధం ఉంటుందని, కానీ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ధరణిని తీసుకువచ్చి భూ దోపిడీకి తెర లేపిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం జిహెచ్‌ఎంసి పరిధిలో సామాజిక బాధ్యత పేరుతో 51 చెరువులను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించారని, వాటి వివరాలను వెలికితీయాలని కోరారు. కాంగ్రెస్ సభ్యులు అనురుధ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూములు పరిరక్షించబడాలంటే 22ఎ ఉండాల్సిందేనన్నారు. గత ప్రభుత్వ హాయంలో ప్రభుత్వ భూములను ఎలా కాజేశారో వివరించారు. ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూనే ఇప్పటికే ఇలాంటి భూముల్లో ఇళ్లను నిర్మించుకున్న వారికి న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## వాంఖడేలో సచిన్, రహానే పేర్లతో లాంజ్‌లు



భారత మాజీ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, అజింక్యా రహానే లకు మరో గౌరవం దక్కనుంది. దిగ్గజ ఆటగాళ్లుగా కితాబులందుకున్న వీరి పేర్లను వాంఖడే స్టేడియంలోని లాంజ్(విశ్రాంతి గదులకు)లకు పెట్టాలని ముంబై క్రికెట్ సంఘం నిర్ణయించింది. టీమిండియాకు, ముంబై క్రికెట్‌కు విశేష సేవలందించినందున విశ్రాంతి గదులకు సచిన్, రహానే పేర్లను ఎంసిఎ ఖరారు చేసింది. వీరితో పాటు దివంగత మాధవ్ మంత్రి పేరుతో నూ లాంజ్ ఉంటుందని శుక్రవారం ఎంసిఎ తెలిపిం ది.ప్రభుత్వ నిర్ణయాలు తెలుసుకోండి ముంబై క్రికెట్ సం ఘం కీలక నిర్ణయం తీసుకుంది. శుక్రవారం జరిగిన వా ర్షిక సమావేశంలో మాజీ క్రికెటర్ల పేర్లను లాంజ్(విశ్రాంతి గదులకు)లకు పెట్టాలని ఎంసికె తీర్మానించింది. దేశవాళీలో ముంబైకి ఆడిన సచిన్ టెండూల్కర్, ఇటీవలే వీడ్కోలు పలికిన అజింక్యా రహానే.. ముంబై రంజీ జట్టు మాజీ కెప్టెన్, దివంగత మాధవ్ మంత్రి పేర్లను వాంఖడే స్టేడియంలోని లాంజ్‌లకు పెట్టనుంది. సచిన్, రహానే, మాధవ్ పేర్లనే ఏ లాంజ్‌కు పెట్టాలి? వాటిని తీర్చిదిద్దేబాధ్యతను ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీకి, కార్యదర్శులకు అప్పగించామని ఎంసిఎ అధ్యక్షుడు అజింక్యా నాయక్ వెల్లడించారు. ఎంసిఎ ఉపాధ్యక్షుడు జితేంద్ర అవ్హాద్, అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు మిలింద్ నర్వేకర్, సలహాదారుడు ఉజ్వల్ నికమ్ ఈ ముగ్గురు సభ్యుల కమిటీలో ఉన్నారు. వార్షిక సమావేశంలోనే అనుబంధ క్రికెట్ క్లబ్‌లకు రిజర్వ్ మొత్తంగా రూ.100 కోట్లు కేటాయించాలని ఎంసిఎ నిర్ణయించింది

## ఢిల్లీ మ్యాచ్‌కు వరుణుడి అడ్డంకి!

### ఈ మ్యాచ్ రద్దయితే వైభవ్‌కు పెద్ద ఎదురుదెబ్బే



శ్రీలంకపై టెస్ట్ సిరీస్ విజయం సాధించిన అనంతరం భారత క్రికెట్ జట్టు మళ్లీ టీ20 క్రికెట్‌పై దృష్టి సారించింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఆదివారం(సెప్టెంబర్ 13) తొలి పోరుకు టీమిండియా సిద్ధమైంది. అయితే ఈ తొలి మ్యాచ్‌కు వర్షం భారీ అడ్డంకిగా మారే అవకాశం కనిపిస్తుండటంతో క్రికెట్ అభిమానుల్లో ఆందోళన నెలకొంది. ఈ సిరీస్‌లో అందరి దృష్టి 15 ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపైనే ఉంది. విదేశీ పర్యటనల్లో ఇంగ్లాడ్, జింబాబ్వేలపై మెరుపు ఇన్నింగ్స్‌లతో కేవలం 6 టీ20 మ్యాచ్‌ల్లోనే వైభవ్ సూర్యవంశీ సంచలనం సృష్టించాడు. జింబాబ్వేపై రెండు హాఫ్ సెంచరీలతో సహా 189కి పైగా స్ట్రైక్ రేట్‌తో 193 పరుగులు సాధించి అందరినీ ఆకట్టుకున్నాడు. కానీ ఇప్పటివరకు ఇండియాలో జాతీయ జట్టు తరపున ఆడే అవకాశం వైభవ్ సూర్యవంశీకి లభించలేదు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో తుది జట్టులో చోటు దక్కితే.. సొంత గడ్డపై తొలిసారి జెర్సీ ధరించి సత్తా చాటాలని ఆశిస్తున్న వైభవ్ సూర్యవంశీకి ఈ మ్యాచ్ రద్దయితే పెద్ద ఎదురుదెబ్బే అవుతుంది.ఆదివారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం పరిసరాల్లో వర్షం కురిసే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆక్యూవెదర్ నివేదికలు సూచిస్తున్నాయి. ఇప్పటికే శుక్రవారం సాయంత్రం ఢిల్లీలో తేలికపాటి వర్షం కురవడంతో స్టేడియం పరిస్థితులపై ప్రశ్నలు మొదలయ్యాయి. ఆదివారం కూడా ఆకాశం మేఘావృతమై ఉండి జల్లులతో పాటు ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.. ముఖ్యంగా మ్యాచ్ జరిగే సాయంత్రం సమయంలో వర్షం ప్రభావం మరింత ఎక్కువగా ఉండవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. భారత్ వర్సెస్ ఆఫ్ఘనిస్తాన్ టీ20 రికార్డులు టీ20 క్రికెట్ చరిత్రలో భారత్, ఆఫ్ఘనిస్తాన్ జట్లు ఇప్పటివరకు 9 సార్లు తలపడగా.. టీమిండియా పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 2023 ఆసియా క్రీడల సందర్భంగా వర్షం కారణంగా రద్దయిన ఓ మ్యాచ్ మినహా మిగిలిన అన్నింటిలోనూ భారత్ విజయం సాధించింది. ఈ పరిస్థితుల్లో ఢిల్లీలో జరగబోయే మ్యాచ్ ద్వారా ఇండియాపై తమ రికార్డును మెరుగుపరచుకోవాలని ఆఫ్ఘనిస్తాన్ భావిస్తుండగా.. మ్యాచ్ సజావుగా సాగాలని అభిమానులు కోరుకుంటున్నారు.

## ఎడ్జ్‌బాస్టన్ టెస్టులోనూ ఇంగ్లాండ్ జయభేరి




ఎడ్జ్‌బాస్టన్ టెస్టులోనూ ఇంగ్లాండ్ జయభేరి మోగించింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్లు డకౌటైనా కెప్టెన్ జో రూట్(62 నాటౌట్), జోర్డాన్ కాక్స్(59 నాటౌట్) కీలక భాగస్వామ్యంతో పాక్ ఆశలపై నీళ్లు చల్లారు. మొహమ్మద్ అబ్బాస్(2–27) నిప్పులు చెరిగినా.. ఈ జోడీ నింపాదిగా ఆడడడంతో ఆతిథ్య జట్టు 8 వికెట్ల తేడాతో విక్టరీ కొట్టింది. వరసగా మూడు మ్యాచుల్లో గెలుపొందిన ఇంగ్లాండ్ 3–0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. స్వదేశంలో ఇంగ్లాండ్ పంజా విసిరింది. మూడు టెస్టుల సిరీస్‌లో సంపూర్ణ ఆధిపత్యంతో పాకిస్థాన్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. ఎడ్జ్‌బాస్టన్‌లో తొలిరోజు నుంచే పట్టుబిగించిన ఇంగ్లాండ్ నాలుగో రోజే మ్యాచ్‌ను ముగించింది. రెండో ఇన్నింగ్స్‌లో పాక్‌ను 449 పరుగులకే కట్టడి చేసి.. అనంతరం 130 పరుగుల ఛేదనకు దిగిన ఆ జట్టు ఇన్నింగ్స్ మొదటి ఓవర్లోనే ఓపెనర్లను కోల్పోయింది. పాకిస్థాన్ పేసర్ మొహమ్మద్ అబ్బాస్(2–20) ఓవర్లో తొలి బంతికి డకెట్(0) వికెట్ కీపర్ చేతికి చిక్కగా.. ఆఖరి బంతికి ఎమిలియో గే(0)ను ఎల్బీగా వెనుదిరిగాడు. అబ్బాస్ విజృంభణతో సున్నాకే రెండు వికెట్లు పడినా కెప్టెన్ జో రూట్(62 నాటౌట్), జోర్డాన్ కాక్స్(59 నాటౌట్)లు ఒత్తిడికి లోనవ్వలేదు. 23 పరుగుల వద్ద బౌల్డయ్యాడు. కానీ, అది నో బాల్ కావడంతో రూట్ బతికిపోయాడు. పాక్ పేసర్లను ధీటుగా ఎదుర్కొన్న ఈ ద్వయం శతక భాగస్వామ్యం నెలకొల్పగా ఆతిథ్య జట్టు 8 వికెట్ల తేడాతో గెలిచింది. తద్వారా 3–0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది ఇంగ్లాండ్ ఎడ్జ్‌బాస్టన్‌లో ఇప్పటివరకూ ఒక్క మ్యాచూ గెలవని పాక్ ఈసారి కూడా అదే తడబాటుతో మూల్యం చెల్లించుకుంది. ఇక బెన్ స్టోక్స్ వీడ్కోలు తర్వాత మళ్లీ కెప్టెన్సీ చేపట్టిన రూట్ తొలి సిరీస్‌ను ఒడిసిపట్టాడు. డాన్ లారెన్స్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా, ఓలీ రాబిన్సన్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపిక య్యారు.





### ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్‌ఇ)లో సెన్సెక్స్:** ప్రారంభం 76,515.43 పాయింట్లు. ముగింపు 74,781.76 పాయింట్లు. నష్టం 1,733.67 పాయింట్లు.
**జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఇ)లో నిఫ్టీ:** ప్రారంభం 23,897.70 పాయింట్లు. ముగింపు 23,398.10 పాయింట్లు. నష్టం 499.60 పాయింట్లు.

(స్టాక్ మారెట్లు వరుసగా ఐదో వారం కూడా నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. ఫలితంగా 'బేర్' జోరు కొనసాగింది. స్టాక్ మార్కెట్లు కూడా అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి).

## నష్టాల బాట వీడని స్టాక్ మార్కెట్లు



భారత స్టాక్ మార్కెట్లు వరుసగా ఐదో వారంలోనూ నష్టాలను చవిచూడటం ప్రస్తుత పరిస్థితుల్లో సాధారణ సాంకేతిక దిద్దుబాటుగా మాత్రమే చూడలేం. అంతర్జాతీయ పరిణామాలు, ముడిచమురు ధరల పెరుగుదల, రూపాయి బలహీనత, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, అమెరికా వడ్డీ రేట్లపై పెరుగుతున్న అనిశ్చితి తదితర అంశాలన్నీ కలిసి మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీనపరుస్తున్నాయి. ఈ వారం దాదాపు అన్ని ప్రధాన రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ముఖ్యంగా ఐటి, ఆర్థిక సేవలు, ఆటో, ఇంధన సంబంధిత షేర్లలో ఒత్తిడి ఎక్కువగా నమోదైంది. వచ్చే వారం మార్కెట్ దిశను నిర్ణయించే ప్రధాన అంశం పశ్చిమాసియాలోని ఉద్రిక్తతే. అమెరికా–ఇరాన్ ఘర్షణ కారణంగా బ్రెంట్ క్రూడ్ ధర 100 డాలర్లకు పైగా కొనసాగుతోంది. భారత్ తన ముడిచమురు అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతి చేసుకుంటున్నందున అధిక చమురు ధరలు ద్రవ్యోల్బణం, వాణిజ్య లోటు, రూపాయి విలువ, కంపెనీల లాభదాయకతపై ఒత్తిడి పెంచుతాయి. అందువల్ల చమురు ధరలు తగ్గకపోతే ఈక్విటీ మార్కెట్లో బలమైన పునరుద్ధరణకు అవకాశం పరిమితంగానే ఉంటుంది. రూపాయి బలహీనత మరో ప్రతికూల అంశం. డాలర్‌తో పోలిస్తే రూపాయి ఈ వారం గణనీయంగా క్షీణించింది. చమురు దిగుమతుల ఖర్చు పెరగడం దీనిపై మరింత ఒత్తిడి తెస్తోంది. రిజర్వ్ బ్యాంక్ మార్కెట్‌లో జోక్యం చేసుకుంటున్నప్పటికీ, అంతర్జాతీయ పరిస్థితులు అనుకూలించకపోతే రూపాయిపై ఒత్తిడి కొనసాగవచ్చు. వచ్చే వారం అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు కీలకం. అమెరికా ఫెడరల్ రిజర్వ్ తదుపరి వడ్డీ నిర్ణయంపై మార్కెట్లలో ఇప్పటికే అనిశ్చితి పెరిగింది. అమెరికా 'బాండ్ ఈల్డ్స్' పెరగడం కొనసాగితే విదేశీ పెట్టుబడిదారులు అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుంచి నిధులను వెనక్కి తీసుకునే అవకాశం ఉంటుంది. అది భారత మార్కెట్‌పై అదనపు అమ్మకాల ఒత్తిడిని కలిగించవచ్చు. అయితే దేశీయంగా మార్కెట్‌కు కొంత రక్షణ ఉంది. దేశీయ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు, ఆర్థిక వ్యవస్థలోని ప్రాథమిక బలాలు, పన్ను వసూళ్లు వంటి అంశాలు పతనాన్ని కొంతవరకు నియంత్రించగలవు. అందువల్ల వచ్చే వారం ఏకపక్షంగా భారీ పతనం తప్పనిసరి అని చెప్పడం సరికాదు. ప్రతికూల వార్తల మధ్య కూడా మధ్యలో బలమైన కొనుగోళ్లు రావచ్చు. మొత్తం మీద, చూస్తే వచ్చే వారం అస్థిరతతో కూడిన ప్రతికూల ధోరణి కొనసాగే అవకాశం ఎక్కువగా కనిపిస్తున్నది.కాబట్టి వచ్చే వారం పెట్టుబడిదారుల దృష్టి కంపెనీల కంటే ముందుగా చమురు, రూపాయి, అమెరికా ద్రవ్యోల్బణం, ఫెడ్ నిర్ణయం, పశ్చిమాసియా పరిణామాలపైనే ఉండే అవకాశం ఉంది.

## భారత్‌లో పెరుగుతున్న ప్యాకర్స్ అండ్ మూవర్స్ వ్యాపారం

భారత్‌లో పట్టణీకరణ వేగం పెరుగుతున్నకొద్దీ ఇళ్ల మార్పిడి, ఉద్యోగాల కోసం నగరాల మధ్య వలసలు, అద్దె ఇళ్లలో మార్పులు, వ్యాపార సంస్థల కార్యాలయాల తరలింపు వంటి అవసరాలు పెరుగుతున్నాయి. దీంతో ప్యాకర్స్ అండ్ మూవర్స్ సేవలకు డిమాండ్ క్రమంగా విస్తరిస్తోంది. ఒకప్పుడు స్థానికంగా పరిచయాల ఆధారంగా నడిచిన ఈ రంగం ఇప్పుడు సాంకేతికత, ఆన్లైన్ బుకింగ్, డిజిటల్ చెల్లింపులు, రియల్‌టైమ్ ట్రాకింగ్ వంటి మార్పులతో కొత్త రూపాన్ని సంతరించుకుంటోంది. ఇల్లు లేదా కార్యాలయాన్ని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మార్చడం అనేది చాలామందికి శారీరక శ్రమతో పాటు మానసిక ఒత్తిడిని కూడా కలిగిస్తుంది. సామాన్లు సురక్షితంగా ప్యాక్ అవుతాయా, రవాణాలో పాడవుతాయా, నిర్ణయించిన సమయానికి చేరుతాయా, చివర్లో అదనపు చార్జీలు వస్తాయా అనే సందేహాలు వినియోగదారులను వేధిస్తాయి. ముఖ్యంగా అసంఘటిత రంగంలో ప్రమాణాలు, బాధ్యత, ధరల్లో పారదర్శకత లేకపోవడం ఈ ఆందోళనను పెంచుతుంది. సాంకేతిక ఆధారిత సేవలు ఈ సమస్యలను కొంతవరకు తగ్గిస్తున్నాయి. వినియోగదారులు తమ సామాన్ల వివరాలను నమోదు చేసి, సేవల రకాన్ని ఎంచుకుని, ముందుగానే ధరను తెలుసుకుని బుకింగ్ చేసుకునే విధానం పెరుగుతోంది. ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు, గాజు సామాన్లు వంటి సున్నితమైన వస్తువులకు ప్రత్యేక ప్యాకింగ్ అవసరాలను ముందుగానే గుర్తించడం, కదలికను ఆన్‌లైన్‌లో ట్రాక్ చేయడం వంటి సదుపాయాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. ఈ రంగం విస్తరణ యువతకు స్వయం ఉపాధికి మంచి అవకాశాన్ని కల్పించగలదు. పెద్ద పెట్టుబడితో సంస్థను ప్రారంభించాల్సిన అవసరం లేకుండా, ఒక ప్రాంతంలో ప్యాకింగ్, లోడింగ్, రవాణా, అన్‌లోడింగ్ సేవలను సమన్వయం చేస్తూ చిన్న స్థాయి వ్యాపారాన్ని అభివృద్ధి చేయవచ్చు. సరైన శిక్షణ, నాణ్యమైన ప్యాకింగ్ మెటీరియల్, విశ్వసనీయ రవాణా వాహనాలు, డిజిటల్ బుకింగ్ వ్యవస్థ, పారదర్శక ధరలు, వినియోగదారుల వస్తువులపై బాధ్యత వంటి అంశాలను పాటిస్తే ఈ వ్యాపారంలో స్థిరమైన అవకాశాలను సృష్టించుకోవచ్చు. యువతకు మరో అవకాశం సేవలను ప్రత్యేక విభాగాలుగా అభివృద్ధి చేయడంలో ఉంది. వృద్ధుల ఇళ్ల మార్పిడి, కార్యాలయాల తరలింపు, విద్యార్థుల సామాన్ల రవాణా, అంతర్రాష్ట్ర రవాణా వంటి ప్రత్యేక సేవలను అందించవచ్చు. ఈ అవసరాన్ని క్రమబద్ధమైన సేవగా మలచగల యువతకు ఇది ఉపాధి కల్పించే రంగంగా మరింత విస్తరించే అవకాశం ఉంది.



### బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర(సుమారుగా)
24 క్యారెట్లు: రూ.1,52,890
22 క్యారెట్లు: రూ.1,40,150
18 క్యారెట్లు: రూ. 1,14,670
(గమనిక: నగరం, జ్యువెలరీ సంస్థ, మేకింగ్ ఛార్జీలు, జిఎస్‌టిలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు).


మహబూబ్‌నగర్ జిల్లాలో...


చింతకాని మండలంలో...


హనుమకొండ జిల్లాలో...

# త్యాగధనుల పునాదులపై నిజాం సర్కార్‌ను గద్దె దించాం

### తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు చాడ వెంకట్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ :** అప్పంపల్లి అమరత్వం అజరామరమైనదని త్యాగధనుల పునాదులపై నిజాం సర్కార్‌ను గద్దె దించి తెలంగాణ గడ్డలో గోరి కట్టమని తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ అధ్యక్షుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నేతృత్వంలో శనివారం మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండల పరిధిలోని అప్పంపల్లి రైతాంగ సాయుధ పోరాట కేంద్రాన్ని సందర్శించి నిజాం సర్కారులు నేలరాలిన అప్పంపల్లి అమరవీరుల స్మారక స్తూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకంగా ఆనాడు జరిగిన కమ్యూనిస్టు సాయు ధ రైతాంగ పోరాటంతో తెలంగాణ ప్రాంతంలో ఐదువేల అమరవీరుల రక్తపుర్పణంతో పది లక్షల ఎకరాల భూ పంపిణీతో భారత్ యూనియన్‌లో కల్పిన త్యాగం కమ్యూనిస్టు పార్టీదని వారు అన్నారు. చారిత్రాత్మక సాయుధ పోరా ట ఘట్టాలను త్యాగాలను కుట్రపూరితకంగా బిజెపి వక్రీకరిస్తూ హిందూ ము స్లిం పోరాటంగా చిత్రీకరిస్తూ నేటి సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తుందని వారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని వారు డిమాండ్ చేశారు.ఆ నాటి పోరాటంలో ఎందరో త్యాగాలు చేశారని వారిని స్వాతంత్ర సమరయోధులుగా గుర్తించాలని కేంద్రంలో అధికారం లో ఉన్న వాజపేయ్ సర్కార్‌ని అడిగితే వారిని గుర్తించకుండా మొండి చూపిందని వారి సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికైనా కేంద్రంలో ఉన్నటువంటి మోదీ సర్కార్ తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న కుటుంబాలను గుర్తించి వారికి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జి ల్లా కార్యదర్శి బి.బాలకిషన్, మాజీ జిల్లా కార్యదర్శి బి.పరమేశ్వర్ గౌడ్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, ప్రము ఖ గాయని శ్యామల, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాస్, సిపిఐ నాయకులు ఎస్.దేవానంద్, భార్గవి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### సాయుధపోరాట స్ఫూర్తితో ప్రజాఉద్యమాలు చేపట్టాలి : భాగం

**చింతకాని :** నైజాం నిరంకుశపాలన అంతం కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిగా ప్రభుత్వ వ్యతిరేక ప్రజా ఉద్యమాలు చేపట్టాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పిలుపునిచ్చారు. చింతకాని మండలం ప్రొద్దుటూరులో తెలంగాణ సాయుధ పోరాట యోధులు తాళ్ళపల్లి రాములు స్థూపం వద్ద వారోత్సవాల్ని ఆయన ప్రారంభించారు. తొల త తాళ్ల పల్లి రాములు విగ్రహానికి పూలమాల వేసి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబా బు, ఏనుగు గాంధీ, రావి శివరామకృష్ణ, పావులూరి మల్లిఖార్జునరావు, మండ ల కార్యదర్శి దూసరి గోపాలరావు, చిన్నమండవ సర్పంచ్ పర్చా రామచంద్రరావు, రైతు సంఘం మండల కార్యదర్శి పదిమల వెంకటనర్సయ్య, వ్యకాస మండల కార్యదర్శి గోగుల ఆది, ఏఐవైఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోగుల వెంక న్న, నాయకులు పెంట్యాల చలమయ్య, తుపాకుల సైదులు, అంజయ్య, తాళ్లపల్లి అజయ్, చేబ్రోలు ఇంద్రసేన, షేక్ దస్తగిరి, చాట్ల రమేష్, బొరాస నాయకులు పాపినేని రంగారావు, సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మణుగూరులో...

### చరిత్రను వక్రీకరించడం సిగ్గుమాలిన చర్య : సాబీర్ పాషా

**మణుగూరు :** సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా డిమాండ్ చేశారు శనివారం మణుగూరు సిపిఐ పార్టీ కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సభ జక్కుల రాజబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్కే సాబీర్ పాషా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి, ఆ పోరాటంలో కీలక పాత్ర పోషించిన కమ్యూనిస్టుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాలని కోరారు. చారిత్రక వాస్తవాలను పక్కనపెట్టి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించడం సిగ్గుమాలిన చర్య అని సాబీర్ పాషా విమర్శించారు. ముందుగా సిపిఐ జెండాను రైతు సంఘం జిల్లా నాయకులు మంగి వీరయ్య ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ అమరవీరులకు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సర్ రెడ్డి పుల్లారెడ్డి ,మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి మాట్లాడారు. మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, జిల్లా సమితి సభ్యులు వై రాంగోపాల్, ఎడారి రమేష్, సోందే కుటుంబరావు, ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, చింతల దశరథం, మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, సాంబయ్య గూడెం సర్పంచ్ చీడం ఉషారాణి రామంజవరం సర్పంచ్ బాడీశ కల్పన, బాడిస సతీష్, ఎస్ కే సర్వర్, పినపాక మండల కార్యదర్శి తోగటి కుమార్, జిల్లా సమితి సభ్యులు గడ్డం మనోరచారి, కరకగూడెం మండల కార్యదర్శి వంగర సతీష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పోరాట యోధుల విగ్రహాలు ట్యాంక్ బండ్‌పై పెట్టాలి : భిక్షపతి

**ధర్మసాగర్ :** ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల స్ఫూర్తితో ముందుకు సాగాలని, సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో శనివారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రైతన్న సాయుధ పోరాటంలో అడ్రస్ లేని బిజెపి,ఆర్‌ఎస్‌ఎస్ నాటి పోరాటాన్ని ముస్లిం, హిందువుల యుద్ధం అని చేస్తున్న అబద్ధ ప్రచారం మానుకోవాలని, తెలంగాణ రాష్ట్రంలో, కర్ణాటకలోనూ, మహారాష్ట్రలోనూ ఏ గ్రామం ఏ ప్రాంతంకు వెళ్లినా నాటి ఆనవాళ్లు ఇంకా కనిపిస్తాయని, తెలంగాణ సాయుధ పోరాటం నడిపిన చరిత్రను ప్రజలకు ఇప్పటికీ గమనిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మునగాల బిక్షపతి, మండల కార్యదర్శి కొట్టే వెంకటేష్, గోకల రాజయ్య, సాయి పేట రాజన్న,సునీల్, రత్తమ్మ, కొమురయ్య, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

### పోరాట వాస్తవాలు మరుగుపరచాలని చూస్తున్న బిజెపి : రాజారెడ్డి

**జనగామ:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వాస్తవాలను నాలుగున్నర వేల మంది అమరవీరుల బలిదానాలను తప్పుడు పద్ధతుల ద్వారా మరుగు పర్చాలని మతోన్మాద బిజెపి చూస్తుందని జనగామ మాజీ ఎమ్మెల్యే సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం జనగామలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో కావటి యాదగిరి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ 15న జనగామ జిల్లాలో తెలంగాణ రైతాంగ సాయుధ ఓరాట కొదమ సింహం తెలంగాణ టైటర్ నల్ల నర్సింహులు విగ్రహం నుండి ప్రారంభించి నాగారంలోని వీరన్నగౌడ్, కామారెడ్డి గూడెం లోని షేక్ బందగి, జాటోత్ వీరుల స్థూపాలు, పాలకుర్తిలోని చాకలి ఐలమ్మ, రఘునాథపల్లి మండలం గబ్బెటలోని గబ్బెట తిరుమల్‌రెడ్డి, గబ్బెట గోపాల్ రెడ్డి, మోహన్‌రెడ్డి స్థూపాల వద్ద సభలు నిర్వయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, కార్యవర్గ సభ్యులు సొప్పరి జోమయ్య, సదానందం,యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

### కరీంనగర్ రూరల్ మండలానికి చొక్కారావు పేరు : పంజాల

**కొత్తపల్లి :** తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని పేదల కోసం పోరాటాలు నిర్వహించిన చామనపల్లి చొక్కారావు పేరు కరీంనగర్ రూరల్ మండలానికి పెట్టాలని, తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడంతోపాటు సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ సాయుధ పోరాట యోధుడు చామనపల్లి చొక్కారావు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం పార్టీ జెండాను ఆయన ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, చామనపల్లి సర్పంచ్ భోగండ ఐలయ్య, జిల్లా కౌ న్సిల్ సభ్యులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ఏఐవైఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కసిబోసుల సంతోష చారి, గ్రామ శాఖ కార్యదర్శి మెరుగు కొమురయ్య, నాయకులు పెద్ది రాజు, ఇరుకుళ్ల బాబు, ఎం. రాములు, నాంపల్లి పోనాని రాజేశ్వర్ రావు, పెరుమాళ్ల శ్రీనివాస్, కాల్వల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

### రైతాంగ సాయుధ పోరాటం పోరాటాలకే స్ఫూర్తి : బెజవాడ

**అనంతగిరి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పోరాటాలకే స్ఫూర్తిగా నిలిచిందని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని శాంతినగర్‌లో ర్యాలీ నిర్వహించి అమరవీరుల స్థూపాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి ఎర్రసాని రవి, మండల ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి జిల్లా సహాయ కార్యదర్శి డేగ వీరన్న, శాఖ కార్యదర్శి బత్తిని వీరబాబు, గ్రామ సర్పంచ్ వాడకొప్పుల ఉమా, ఉప సర్పంచ్ గరిడేపల్లి స్వాతి, వ్యకాస జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తే సహించం : లక్ష్మణ్

**కోటపల్లి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర అణువంత కూడా లేదని, చరిత్రను వక్రీకరించి తమ ఖాతాలో వేసుకోవాలని బిజెపి చూస్తే ప్రజలు తిప్పికొడతారని సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, దాగం మల్లేష్, రేగుంట చంద్రశేఖర్ హెచ్చరించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార జాతాల్లో వారు మాట్లాడారు. సెప్టెంబర్ 17న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే చలో హైదరాబాద్ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అందే పురుషోత్తం, నాయకులు నెన్నెల సమ్మయ్య, బడికెల మధునయ్య, దేనబోయిన బాపు, వెంకటేష్, శంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


జనగామ జిల్లాలో...


కరీంనగర్ జిల్లాలో...


సూర్యాపేట జిల్లాలో...


మంచిర్యాల జిల్లాలో...

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
ఆదివారం
13-09-2026
www.prajapaksham.in


# బిఆర్ఎస్ డ్రామాలు నడవవు

● ఎమ్మెల్సీ, విప్ బల్మూరి వెంకట్ నర్సింగరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అసెంబ్లీ సమావేశాలను అడ్డుకునే దురుద్దేశంతోనే బిఆర్ఎస్ గందరగోళం సృష్టిస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ, విప్ బల్మూరి వెంకట్ నర్సింగరావు ఆరోపించారు. విద్యా రంగ సమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా అడ్డుకుంటున్నారని విమర్శించారు. 22ఎ భూములపై హరీశ్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కోర్టు కేసులు, వివాదాలు ఉన్న భూములను మాత్రమే నిషేధిత జాబితాలో చేర్చినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉందని పేర్కొన్నారు. ధరణి పేరుతో గతంలో వేలాది ఎకరాల భూములను ఎలా దోచుకున్నారో అసెంబ్లీ సాక్షిగా ఆధారాలతో బట్టబయలు చేస్తామని బల్మూరి వెంకట్ హెచ్చరించారు.

**బిజెపి బిసి వ్యతిరేక వైఖరి బయటపడింది: ఆది శ్రీనివాస్**



బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై చర్చ జరుగుతున్న సమయంలో బిజెపి నేతలు సభ నుంచి వాకౌట్ చేయడం ఆ పార్టీ బిసి వ్యతిరేక వైఖరికి నిదర్శనమని కాంగ్రెస్ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. సభ బయట బిసిలకు మద్దతు ప్రకటిస్తూ.. సభలో మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించి కేంద్రానికి పంపిన 42 శాతం బిసి రిజర్వేషన్ల అంశాన్ని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ ఆమోదించలేదని అన్నారు. కెటిఆర్, హరీశ్‌రావులు ఫ్రస్టేషన్‌లో ప్రభుత్వంపై పిచ్చి ప్రలాపాలు చేస్తూ 22ఎ భూములపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. పదేళ్లపాటు దోచుకున్న దొంగలు ఘనులు మీరంటూ బీఆర్ఎస్ నేతలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఏ భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయో అసెంబ్లీలో ఆధారాలతో వివరిస్తామని తెలిపారు. కోర్టు కేసులు, వివాదాలు ఉన్న భూములనే నిషేధిత జాబితాలో ఉంచారని, భూ భారతి ద్వారా భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. జనగణనలో బిసి కులగణనకు ప్రత్యేక కాలమ్ చేర్చాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

**22ఎ భూములపై ప్రత్యేక అసెంబ్లీ పెట్టే దమ్ముందా?: అద్దంకి దయాకర్**



22ఎ భూములపై బిఆర్ఎస్ నేతలు అవగాహన లేకుండా దుష్ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ, విప్ అద్దంకి దయాకర్ విమర్శించారు. అటవీ, దేవాదాయ శాఖ, ప్రభుత్వ భూములతో పాటు కోర్టు కేసులు, వివాదాలు ఉన్న భూములే నిషేధిత జాబితాలో ఉంచుతారని తెలిపారు. 22ఎ అంశంపై వినాయక చవితి తర్వాత ప్రత్యేకంగా ఒకరోజు అసెంబ్లీ సమావేశం నిర్వహిద్దామని, చర్చకు వచ్చే దమ్ము బిఆర్ఎస్ నేతలకు ఉందా అని సవాల్ చేశారు.ప్రజా సమస్యలపై చర్చకు రాకుండా సభకు దూరంగా ఉండేందుకు బిఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిని కూడా నిషేధిత జాబితాలో పెట్టారని, ప్రభుత్వానికి దురుద్దేశం ఉంటే సిఎం ఇంటిని ఎందుకు ఆ జాబితాలో పెడతారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో కొట్టేసిన భూములు, అక్రమంగా సంపాదించిన ఆస్తులన్నింటినీ త్వరలో బహిర్గతం చేస్తామని అద్దంకి దయాకర్ హెచ్చరించారు. కెసిఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే 22ఎ అంశంపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

**22ఎపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి రండి: చింతకుంట విజయరమణారావు**

22ఎ భూముల విషయంలో లోపాలు ఉన్నాయని భావిస్తే వాటిపై అసెంబ్లీలో చర్చించేందుకు రావాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు బిఆర్ఎస్ నేతలకు సూచించారు. ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే సభలో చర్చకు రావాలని అన్నారు. బిఆర్ఎస్‌లో బావ, బామ్మర్ది పోటీపడి మరీ 22ఎపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అటవీ, పోడు, యూనివర్సిటీ, ప్రభుత్వ భూములతో పాటు కోర్టు కేసులు ఉన్న భూములను నిషేధిత జాబితాలో చేర్చినట్లు తెలిపారు. నిషేధిత జాబితాలో ఉన్న కొన్ని భూములపై ఇప్పటికే క్రయవిక్రయాలు జరిగాయని, అక్కడ ఇళ్లు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఈ అంశంపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా ప్రజలు నమ్మరని అన్నారు. జనగణనతో పాటు బిసి కులగణన కూడా నిర్వహించాలని విజయరమణారావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జనగణనలో బిసి కులగణనకు ప్రత్యేక కాలమ్ చేర్చాలని కోరారు. బిసి ప్రధాని ఉన్నప్పటికీ బిసిలకు ఏం న్యాయం చేస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీని ప్రశ్నించారు. కేంద్రం చర్యలు తీసుకోకపోతే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ కులగణన చేపట్టి, జనాభా దామాషా ప్రకారం బిసిలకు రిజర్వేషన్లు కల్పిస్తుందని తెలిపారు.

# అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ

బిజెపి శాసనసభాపక్ష నాయకులు ఎ.మహేశ్వరరెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత ప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయలు అక్రమాలు జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో లక్షల కోట్ల రూపాయల అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, ఈ అంశాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బిజెపి శాసనసభా పక్ష నాయకులు ఎ.మహేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. శాసనసభలో శనివారం 'రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్22ఎ కు సంబంధించిన సమస్యల'పై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ మనిషికి భూమి అంటే ఆత్మగౌరవమని, అలాంటి భూమిని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. 22ఎ నిషేధిత జాబితాలో ఉన్న భూములను లేనట్లు, లేని భూములను ఉన్నట్లు ఎందుకు చేర్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. నాడు ధరణి, నేడు భూ భారతి రెండు ఒక్కటేనని ఆరోపించారు. అప్పుడు, ఇప్పుడు సమస్యలు ఒకే విధంగా ఉన్నాయని ఆయన అన్నారు. 22ఎ భూములకు సంబంధించి ఎవరు తప్పులు చేశారో తేల్చాలన్నారు. లక్షల కోట్ల విలువైన లక్షల ఎకరాలు భూములు చేతులు మారాయని ఆయన ఆరోపించారు. ఫొరెన్సిక్ ఆడిట్ రిపోర్టు ఎమైందో స్పష్టం చేయాలని, కాగ్ ఆడిట్ రిపోర్ట్‌ను బహిర్గతం చేయాలని మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. పేదల ఇళ్లను కూల్చుతూ వారి భూములను లాక్కుంటున్నారే తప్ప బడాబాబులకు నోటీసులు కూడా ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. సభలో కాంగ్రెస్ సభ్యులు ఉలికిపడడంతోనే రాష్ట్రంలో అక్రమాలు జరిగినట్లు స్పష్టమవుతుందని అన్నారు.

**మహేశ్వర్‌రెడ్డిపై కాంగ్రెస్ సభ్యుల తీవ్ర ఆగ్రహం**

సభలో 22ఎ భూములకు సంబంధించి చర్చ సందర్భంగా బిజెపి శాసనసభ పక్ష నాయకులు మహేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పలువురు మంత్రులు, కాంగ్రెస్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేశ్వర్‌రెడ్డి బిఆర్ఎస్ రాసి ఇచ్చిన స్క్రిప్ట్ చదువుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి 4 గంటల పాటు సభకు అన్ని వివరించారన్నారు. అయినా మహేశ్వరరెడ్డి పదే పదే అవే ఆరోపణలు చేస్తున్నారన్నారు. సెట్టింగ్ అనే పదాన్ని మహేశ్వర రెడ్డి ఉపయోగించడం పట్ల డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అభ్యంతరం చేస్తూ తక్షణమే ఆ పదాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మహేశ్వర్‌రెడ్డి సభలో అన్ని వాస్తవాలు మాట్లాడుతారనుకుంటే పూర్తి అవాస్తవాలు మాట్లాడం సరికాదన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మీ చేయలేదని సిబిఐకి ఇవ్వాలని 24 గంటల్లో చర్యలు తీసుకుంటామని మహేశ్వర రెడ్డి అన్నారని, కానీ 24 నెలలు గడుస్తున్నా ఇప్పటి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 22ఎకు సంబంధించి మహేశ్వర్ రెడ్డి పట్టుదల చూసి పూర్తి వివరాలతో వస్తారనుకుంటే బిఆర్ఎస్ ఇచ్చిన స్క్రిప్ట్ చదువుతున్నారని, నకల్ మారునేకేలియే హాకలు రహెనాహై' అని అన్నారు.

# శాసనమండలి నిరవధిక వాయిదా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనమండలి శనివారం నిరవధికంగా వాయిదా పడింది. ఈ నెల 12వ తేదీన ప్రారంభమైన శాసనమండలి వర్షాకాల సమావేశాలు మొత్తం ఆరు రోజుల పాటు జరిగాయి. సభ మొత్తం6 రోజుల పాటు 19 గంటల 20 నిమిషాలు పాటు సమావేశమైంది. సభలో సభ్యులు మొత్తం 39 ప్రశ్నలు వేయగా, సభ్యులు 32 ప్రసంగాలు చేశారు. మొత్తం నాలుగు ప్రభుత్వ బిల్లులకు సభ ఆమోదం తెలిపినట్లు చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభను నిరవధికంగా వాయిదా వేస్తూ ప్రకటన చేశారు.

# ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన బిఆర్ఎస్ : మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ నిర్వహించిన 'మాక్ అసెంబ్లీ' ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేవిధంగా ఉందని మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆరోపించారు. చట్టసభల పట్ల, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల బిఆర్ఎస్‌కు ఏ మాత్రం గౌరవం లేదనే విషయం మరోసారి స్పష్టమైందన్నారు. శాసనసభ లాబీలో మంత్రి సీతక్క తనను కలిసిన జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఎర్రవల్లిలో బిఆర్ఎస్ఎల్‌పి సమావేశం నిర్వహించిన బిఆర్ఎస్ నాయకులు, తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. అసెంబ్లీకి రావాల్సిన ఎమ్మెల్యేలు తెలంగాణ భవన్ కార్యాలయంలో కూర్చొని అసెంబ్లీని అనుకరించడం ప్రజాస్వామ్యాన్ని గౌరవించడమా ? అని సీతక్క నిలదీశారు. అసెంబ్లీకి హాజరుకాని కెసిఆర్ కనీసం బిఆర్ఎస్ మాక్ అసెంబ్లీకి కూడా రాలేదని ఎద్దేవా చేశారు. కెసిఆర్ అధికారంలో ఉంటే సచివాలయానికి రారని, ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారని ఎద్దేవా చేశారు.

# టిండర్ పరిచయంతో రూ.3.35 కోట్ల సైబర్ మోసం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిండర్ డేటింగ్ యాప్‌లో పరిచయం చేసుకుని, భావోద్వేగ సంబంధాన్ని పెంచుకున్న అనంతరం భారీ పెట్టుబడుల పేరుతో ఓ వ్యక్తి నుంచి ఏకంగా రూ.3.35 కోట్లు కొల్లగొట్టిన సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. టిండర్ ద్వారా పరిచయమైన నిందితురాలు తనను విదేశీయురాలిగా పరిచయం చేసుకుని, వాట్సాప్ ద్వారా సన్నిహిత సంబంధాన్ని పెంచుకుని బాధితుడిని నకిలీ పెట్టుబడి ప్లాట్‌ఫామ్‌లోకి మళ్లించినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) వెల్లడించింది. బాధితుడి నమ్మకాన్ని పొందిన అనంతరం ఫేస్‌బుక్, మెటాకు సంబంధించిన ప్రకటనల ద్వారా భారీగా ఆదాయం పొందుతున్నట్లు నిందితురాలు నమ్మించింది. పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని చెప్పి నకిలీ అప్లికేషన్ లింక్ పంపించింది. ప్రారంభంలో పెట్టుబడులపై లాభాలు వచ్చినట్లు యాప్‌లో చూపించి బాధితుడి నమ్మకాన్ని మరింత పెంచింది. దీంతో అధిక లాభాల కోసం బాధితుడు సుమారు 55 రోజుల వ్యవధిలో మొత్తం రూ.3.35 కోట్లను బదిలీ చేశాడు.అనంతరం డబ్బు ఉపసంహరించుకునేందుకు ప్రయత్నించగా క్రెడిట్ పాయింట్లు కొనుగోలు చేయాలని, క్రెడిట్ స్కోర్ తగ్గిందంటూ మరింత డబ్బు డిపాజిట్ చేయాలని నిందితులు ఒత్తిడి చేశారు. దీంతో అనుమానం వచ్చిన బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి టిజిసిఎస్‌బిని ఆశ్రయించాడు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన టిజిసిఎస్‌బి నిందితులను గుర్తించడంతోపాటు నగదు లావాదేవీల మార్గాలను అన్వేషిస్తూ దర్యాప్తు కొనసాగిస్తోంది. టిండర్, మ్యాట్రిమోనియల్ సైట్లు, సోషల్ మీడియా ద్వారా పరిచయమయ్యే వ్యక్తులు తొలుత వ్యక్తిగత, భావోద్వేగ సంబంధాలను పెంచుకుని అనంతరం పెట్టుబడుల పేరుతో మోసాలకు పాల్పడే అవకాశం ఉందని టిజిసిఎస్‌బి హెచ్చరించింది. తెలియని వ్యక్తులు పంపే పెట్టుబడి యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని, లింక్‌లను క్లిక్ చేయవద్దని సూచించింది. పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థ, ప్లాట్‌ఫామ్ వివరాలను అధికారిక వనరుల ద్వారా నిర్ధారించుకోవాలని తెలిపింది. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి, cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ సూచించారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి

● బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో నిలిచిపోయిన రూ. 15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతం రావుతో కలిసి రాంచందర్ రావు మాట్లాడారు. విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న సిఎం రేవంత్ రెడ్డి, బకాయిల చెల్లింపుపై దాటవేత వైఖరి వీడి స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. జిఓ97 ద్వారా పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను దెబ్బతీస్తున్నారని, హక్కుల కోసం శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులపై పోలీసులతో లాఠీ చార్జ్ చేయించడం అమానుషమని మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఇటాలియన్ భాషలో కూడా లేఖ రాశామని తెలిపారు. కాగా, సీనియర్ పోలీస్ అధికారి (రిటైర్డ్ డిసిపి) శ్రీనివాస్, పలువురు ప్రముఖ వైద్యులు, వ్యాపారవేత్తలు రాంచందర్ రావు సమక్షంలో బిజెపిలో చేరారు.



# శాసనమండలిలో 'క్యూర్' బిల్లు ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ (క్యూర్) బిల్లు 2026' ను బిల్లుకు శాసనమండలి శుక్రవారం ఆమోదముద్ర వేసింది. ఈ బిల్లుకు సిపిఐ, కాంగ్రెస్, ఎంఐఎం, బిఆర్ఎస్ సభ్యులు మద్దతు ప్రకటించగా బిజెపి సభ్యులు మాత్రం వ్యతిరేకించారు. సభలో తొలుత ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బిల్లుకు సంబంధించిన ఉద్దేశాలను, ఉపయోగాలను వివరించారు. బిల్లుపై జరిగిన చర్చల్లో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, సిపిఐ సభ్యులు నెల్లికంటి సత్యం, బిఆర్ఎస్ సభ్యులు దాసోజు శ్రావణ్, బిజెపి సభ్యులు ఎ.వి.ఎన్.రెడ్డి, పి.శ్రీపాల్‌రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు. బిల్లుపై సభ్యులు లేవనెత్తిన పలు అనుమానాలు, ప్రశ్నలకు మంత్రి శ్రీధర్‌బాబు సమాధానమిచ్చారు. అవసరమైతే రానున్న రోజుల్లో ఈ బిల్లులోని అంశాలపై ప్రతి ఒక్కరితో సుదీర్ఘంగా చర్చించేందుకు తమకు అభ్యతరంలేదని, వారి సూచనలు, సలహాలు పొందుపర్చేందుకు తాము భేషాజాలకు పోమని మంత్రి చెప్పారు.

**ఆదర బాదరగా బిల్లు ప్రవేశపెట్టడం తగదు: సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

క్యూర్ బిల్లు 2026 హైదరాబాద్‌లోని 1.30 కోట్ల మందికి సంబంధించిన అంశమని, ఇంత ప్రాధాన్యత గల బిల్లును ఆదరబాదరగా కాకుండా రెండు రోజుల ముందే సభ్యులకు వివరిస్తే బాగుండేదని సిపిఐ సభ్యులు నెల్లికంటి సత్యం అభిప్రాయపడ్డారు. బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాటాడుతూ 400 పేజీలకు పైగా ఉన్న ఈ బిల్లు ఒక రోజులో ప్రవేశపెట్టి చర్చించమంటే సాధ్యమయ్యే పనికాదన్నారు. ప్రజాస్వామ్య పద్దతిలో ప్రభుత్వం వ్యవహరించాలని సూచించారు. ఈ బిల్లుపై మరింత లోతుగా చర్చించేందుకు ప్రజాభిప్రాయం సేకరించేందుకు ప్రభుత్వం పునరాలోచించాలని ఆయన కోరారు. క్యూర్ బిల్లులో ప్రజాప్రతినిధులకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం శోచనీయమన్నారు. ఈ విషయంపై కూడా ప్రభుత్వం పరిశీలించాలని నెల్లికంటి సత్యం కోరారు.

# కార్పొరేట్ శక్తులు, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న కేంద్రం

● సిపిఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/అమరచింత :** దేశంలో ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా ధ్వంసం చేస్తూ నిరంకుశతత్వంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పాలన సాగిస్తోందని సిపిఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. శనివారం అమరచింత మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో చాడా వెంకట్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంటులో గాని, అసెంబ్లీలో గాని ప్రజా సమస్యలపై చర్చించకుండా అధికార పక్షం ప్రధాన ప్రతిపక్షం ప్రతిపక్షాలు ఎవరు గొప్ప అంటూ ఎవరికి వారు దూషణలు చేసుకుంటూ శాసన సభలో గందరగోళం సృష్టిస్తున్నారని ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా పేదరికాన్ని గుర్తించకుండా ప్రభుత్వాలు అధికార దాహం కోసం పాకులాడుతున్నామని ఆయన విమర్శించారు. దేశంలో కార్పొరేట్ శక్తులను, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ దేశాన్ని అదోగతి పాలు చేసిందని కేంద్ర ప్రభుత్వంపై ఆయన ధ్వజమెత్తారు. ప్రధాన ప్రతిపక్షాలు ఒకవైపు ఉంటే అధికారపక్షం మళ్లీ తమ అధికారాన్ని చేజిక్కించుకునేందుకు ప్రాకులాడుతున్నాయని అన్నారు. తెలంగాణలో 90% పేదరికం ఉందని ఆయన గుర్తు చేశారు. ఈ దేశంలో కేవలం కేరళ రాష్ట్రంలోనే పేదరికం తగ్గించిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీలకు ఉందన్నారు. ఆ రాష్ట్రంలో పేదరికం 0.25 కు చేరుకున్నాదని గుర్తు చేశారు. ఈ దేశంలో 100, 60 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయని ఆరోపించారు. పేదలకు కూడు, గుడ్డ, విద్య, వైద్యం అందని ద్రాక్షగా మారిందని ఆరోపించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు మార్చి, రాష్ట్రాల నుంచి 40 శాతం నిధులను వసూలు చేస్తుందన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు ఇవ్వాల్సి ఉండగా ఇందుకు భిన్నంగా వ్యతిరేకంగా రాష్ట్రాల నుండి నిధులు తీసుకోవడం ఎప్పుడూ చూడలేదన్నారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ సిపిఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీ నారాయణ, మక్తల్ నియోజకవర్గ కన్వీనర్ పి.శ్రీహరి, మహబూబ్‌నగర్ జిల్లా మాజీ కార్యదర్శి మహేష్ గౌడ్, సిపిఐ మండల అధ్యక్షులు అబ్రహం, పట్టణ అధ్యక్షులు రవీందర్, శ్యాంసుందర్, భాస్కర్, రఘు, సీనియర్ నాయకులు సీఎన్ శెట్టి, లక్ష్మీ నారాయణ శెట్టి, రఘు, ఎర్రన్న, సౌలు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీకి రావడానికి బిఆర్ఎస్‌కు భయమెందుకు?




మాక్ అసెంబ్లీ పేరుతో కాలయాపన: ఎంపి మల్లు రవి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో ప్రజా సమస్యలపై చర్చించాల్సిన బాధ్యతను విస్మరించి తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించడం ద్వారా బిఆర్ఎస్ నేతలు రాజకీయ డ్రామాకు తెరలేపుతున్నారని నాగర్‌కర్నూల్ ఎంపి డాక్టర్ మల్లు రవి విమర్శించారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీకి వస్తే గత బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలు, అరాచకాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే ఆ పార్టీ నేతలు అసెంబ్లీకి దూరంగా ఉంటున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన వేదికను వదిలి తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. మాక్ అసెంబ్లీల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరని, అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించకుండా బిఆర్ఎస్ నేతలు తమ బాధ్యత నుంచి తప్పించుకోలేరని మల్లు రవి స్పష్టం చేశారు. గత పదేళ్ల పాలనపై సమాధానం చెప్పాల్సిన సమయంలో మాక్ అసెంబ్లీ పేరుతో కొత్త నాటకాలకు తెరలేపుతున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అసెంబ్లీని వేదికగా చేసుకుని నిర్మాణాత్మకంగా చర్చించాల్సిన బాధ్యత ప్రతిపక్షంపై కూడా ఉందన్నారు.

# నిషేధిత జాబితా నుంచి ఎప్పటిలోగా తొలగిస్తారో సమాధానం చెప్పాలి

● ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజల భూములను నిషేధిత జాబితా నుంచి ఎప్పటిలోగా తొలగిస్తారో సమాధానం చెప్పాలని బిఆర్ఎస్ఎల్‌పి ఉపనాయకుడు తన్నీరు హరీశ్ రావు డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభలో అబద్దాలు మాట్లాడారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, మాణిక్‌రావు తదితరులతో కలిసి హరీశ్‌రావు మాట్లాడుతూ 2025 డిసెంబర్ 3న తాము ఒక జాబితాను అప్‌లోడ్ చేశామని, సమస్య అక్కడే వచ్చిందని, సమయం తక్కువగా ఉన్న కారణంగా చూసుకోకుండా అందరి భూములను అప్‌లోడ్ చేశామని మంత్రి పొంగులేటి స్వయంగా వారి తప్పును ఒప్పుకున్నారన్నారు. 22ఎ జాబితాలో ఎన్ని ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టారో సమాధానం చెప్పలేదని, సిఎం ఇల్లు 22ఎ జాబితా నుంచి ఎలా తొలగించారో ప్రజల భూములను కూడా తీస్తారని భావించామని, కానీ అలా చేయలేదన్నారు. ఒక రైతు ఆత్మహత్య చేసుకున్న మిర్దొడ్డి సిద్దిపేట నియోజకవర్గం పరిధిలో కాదని, దుబ్బాక నియోజకవర్గంలో అని, తన మామ అంశాన్ని ప్రస్తావించారని, కొండపాక అనేది సిద్దిపేట నియోజకవర్గంలో కాదని, గజ్వేల్ నియోజకవర్గమని వివరించారు. సింగరేణి కార్మికుల భూములు రెగ్యులరైజ్ చేయడానికి జారీ చేసిన జిఒ 76ను నాటి వై.ఎస్ ప్రభుత్వం కాదని, బిఆర్ఎస్ ప్రభుత్వమే జారీ చేసిందని హరీశ్‌రావు తెలిపారు. తన మామ రిటైర్డ్ బ్యాంకు అధికారి అని, ఆయన చెక్ ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఆయనకు 1995లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిందని, ఆ తర్వాత 2010లో ఆయనకు ఎన్‌వోసీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే జారీ చేసిందని వివరించారు. ఈ భూమి ఎకరం రూ 15 కోట్లు అంటూ తప్పుడు లెక్కలు చెబుతున్నారని, ఈ భూమిని ఎకరా రూ.50 లక్షలకు ఇస్తామని, రిజిస్ట్రేషన్ చేసుకుంటారా? అని మంత్రి పొంగులేటిని హరీశ్‌రావు ప్రశ్నించారు.

పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వట్టి నాగులపల్లిలో రూ 3 వేల కోట్ల భూమి బూదాన్ భూమి తీసుకున్నారని చెబుతున్నారని, తాను తెలంగాణ రాష్ట్రం రాకముందే ఒక ఎకర, 10 గుంటలకు అగ్రిమెంట్ చేసుకున్నామని వివరించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన మొదటి నెలలో ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నామని, ఇది భూదాన్‌లో లేదన్నారు. తన వద్ద ఉన్న భూమిని విక్రయించాలని మంత్రి పొంగులేటి బినామిలు తమను అడిగారని ఆరోపించారు.

# తెలంగాణభవన్‌లో 'మాక్ అసెంబ్లీ'



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో శనివారం 'మాక్ అసెంబ్లీ' జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలుపై బిఆర్ఎస్ నాయకులు వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఈ మాక్ అసెంబ్లీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్‌గా వ్యవహరించగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్రను పోషించి రేవంత్ రెడ్డిని అనుకరిస్తూ మాట్లాడారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పాత్రలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాత్రలో మాజీ మంత్రి గంగుల కమలాకర్ వ్యవహరించారు. ఈ మాక్ అసెంబ్లీ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు, మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, జి.జగదీష్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కె.పి.వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

# 22ఎతో 50 లక్షలమందికి ఇబ్బందులు

● బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 22ఎ నిషేధిత జాబితా కారణంగా రాష్ట్రంలో 50 లక్షల మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ప్రైవేటు ఆస్తులను 22ఎ జాబితాలో ఎందుకు చేర్చారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూ దందాలు, ధరణి వ్యవహారాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ధరణి ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికను సభ ముందు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీలో తమకు మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదని స్పీకర్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై చర్యలు, విచారణ ఎక్కడని ప్రశ్నించిన పాయల్ శంకర్.. మాజీ చీఫ్ సెక్రటరీ, పలువురు కలెక్టర్లపై భూ వ్యవహారాలకు సంబంధించి చర్యలు తీసుకోవాలని కోరినా స్పందించలేదన్నారు. సీబీఐతోపాటు సంబంధిత దర్యాప్తు సంస్థలను ఆశ్రయిస్తామని, ప్రజల తరఫున పోరాడుతామని స్పష్టం చేశారు.

**బిఆర్ఎస్ మాక్ అసెంబ్లీ ఓ డ్రామా: రాంచందర్ నాయక్**

తెలంగాణ సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చి పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోచుకున్న బిఆర్ఎస్.. అసెంబ్లీ సమావేశాలు జరుగకుండా అడ్డుకునే ప్రయత్నంలో భాగంగానే మాక్ అసెంబ్లీ నిర్వహించిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే, విప్ రాంచందర్ నాయక్ ఆరోపించారు. కెసిఆర్ డ్రామా కంపెనీ 'జబర్దస్త్' కార్యక్రమంలా మాక్ అసెంబ్లీ నిర్వహించారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను జీర్ణించుకోలేక ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. హరీశ్‌రావు త్వరలో బీజేపీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని, అమిత్‌షాను రహస్యంగా కలిశారని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు.

**మాక్ అసెంబ్లీకి బెస్ట్ కమెడియన్ అవార్డులు ఇవ్వాలి: ఆది శ్రీనివాస్**

22 అంశంపై బిఆర్ఎస్, బిజెపిలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. 22ఏపై చర్చకు పట్టుబడిన బీజేపీ సభానాయకుడు చర్చ జరుగుతున్న సమయంలో సభలో లేకపోవడం విడ్డూరమన్నారు. 22ఏ కారణంగా నష్టపోయే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

ప్రజా సమస్యలపై చర్చించకుండా బిఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీ కామెడీ షోలా ఉందని ఎద్దేవా చేశారు. మాక్ అసెంబ్లీకి కూడా కేసీఆర్ హాజరుకాలేదని విమర్శించారు. ఇక బిఆర్ఎస్‌కు తెలంగాణ భవన్ మాత్రమే దిక్కుగా మిగులుతుందని, ప్రజలు ఆ పార్టీకే పరిమితం చేస్తారని అన్నారు. బిఆర్ఎస్ హయాంలో ఎవరు ఎంత భూమి ఆక్రమించారో పేర్లతో సహా లెక్కలు బయట పెడుతున్నామని తెలిపారు.

**22ఎపై అపోహలు వద్దు: ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి**

22ఎ భూములపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టత ఇచ్చారని కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బిఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీలో దళిత స్పీకర్‌ను ఏర్పాటు చేసి, ఆయనను అవమానించే విధంగా వ్యవహరించారని ఆరోపించారు. 22ఎపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు 22ఎ అంశంపై ఎలాంటి అనుమానాలు, అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

# బార్ కౌన్సిల్ కీలక పదవులకు రంగంలో 11 మంది

చైర్మన్, వైస్ చైర్మన్‌కు మూడేసి నామినేషన్లు

బిసిఐ సభ్యుడి స్థానానికి ఐదుగురు అభ్యర్థులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో చైర్మన్, వైస్ చైర్మన్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడి పదవులకు పోటీ చేసే అభ్యర్థుల జాబితా ఖరారైంది. నామినేషన్ల పరిశీలన అనంతరం మూడు పదవులకు మొత్తం 11 మంది అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటైనట్లు బార్ కౌన్సిల్ కార్యదర్శి శనివారం ప్రకటించారు. చైర్మన్ పదవికి పొన్నం అశోక్ గౌడ్, టి.హన్మంత్ రెడ్డి, సముల రామ్ రెడ్డి పోటీలో ఉన్నారు. వైస్ చైర్మన్ పదవికి రామారావు గోకుల్, వెంకట్ యాదవ్ చలకాని, జకీర్ హుస్సేన్ జావిద్ నామినేషన్లు చెల్లుబాటు అయ్యాయి. తెలంగాణ నుంచి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడి పదవికి అనంతసేన్ రెడ్డి ఆకుల, జి.అనిల్ కిరణ్ కుమార్, డి.జగదీశ్వర్ రావు, జి.కిరణ్ కుమార్, సుజాత పాశం బరిలో నిలిచారు. తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుల సాధారణ ఎన్నికలు ఈ ఏడాది జనవరి 30న నిర్వహించగా, మార్చి 24న ఫలితాలు వెల్లడయ్యాయి. 23 మంది ఎన్నిక కాగా, మరో ఇద్దరు నామినేషన్ విధానం ద్వారా ఎంపిక కావడంతో మొత్తం 25 మంది సభ్యులుగా ఉన్నారు. వీరి నుంచి చైర్మన్, వైస్ చైర్మన్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిని ఎన్నుకుంటారు.



## బిసిల కులగణన చేపట్టకపోతే బిజెపిని గద్దె దించేందుకు బిసిలు ఐక్యం

దూళిపాళ ధనుంజయనాయుడు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** దేశంలో చేపడుతున్న జనగణనలో ఎస్సీ, ఎస్టీలతో పాటు బిసి కుల గణణ కూడా తప్పని సరిగా చేర్చాలని అందుకు బిజేపి సిద్ధపడకపోతే బిజేపిని గద్దె దించేందుకు రాజకీయాలకు అతీతంగా బిసిలు ఐక్యమై బిజేపిని గద్దె దించేందుకు సిద్ధపడాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని బిసి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఖచ్చితమైన జనాభా లెక్కలు తేలితేనే బిసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో దామాషా ప్రకారం న్యాయం జరుగుతుందని , కులగణన లో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర జనాభాలో బిసిలు 56 శాతం ఉన్నారని తేలిందని అసెంబ్లీలో తీర్మానం చేసిన విధంగా బిసిలకు స్థానిక సంస్థల్లో 422శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్ర సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎఐటియుసి నాయకులు జడ శ్రీనివాస్, బిసి హక్కుల సాధన సమితి నాయకులు కొమ్రరాజు వెంకట్, జక్కుల రమేష్, జక్కుల రమణ పాల్గొన్నారు.

## ఆభరణాలు దొంగిలించే ముఠా అరెస్టు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** బస్టాండ్‌లలో బస్సులు ఎక్కే ప్రయాణికుల నుండి బంగారు ఆభరణాలను దొంగలించే అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు పంపినట్లు దేవరకొండ డిఎస్పి ఎం.వి శ్రీనివాసరావు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ సంవత్సరం మార్చి నుండి జూలై వరకు జరిగిన మూడు నేరాలలో దొంగలించిన 5 తులాల బంగారు ఆభరణాలను ఈ అంతరాష్ట్ర దొంగల ముఠా సభ్యులైన తిరపతమ్మ, కేశవ, జ్యోతిల వద్ద నుండి రికవరీ చేసి ఒక బజాజ్ ఆటో, ఒక హోండో డిలక్స్ మోటార్ సైకిల్‌ను సిజ్ చేసినట్లు తెలిపారు. దొంగల ముఠాను చాకచక్యంగా పట్టుకున్న కొండమల్లేపల్లి సిఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్, క్రైమ్ సిబ్బంది కరుణాకర్, హెచ్ కానిస్టేబుల్ శేఖర్, కానిస్టేబుల్ హేమునాయక్, భాస్కర్, రాంబాబు, శేఖర్, మహిళా కానిస్టేబుల్ నాగసంధ్యలను డిఎస్పి అభినందించారు.

## అంతర్జాతీయ బౌద్ధ భిక్షువుల భిక్షాటన



**ప్రజాపక్షం/నందికొండ:**అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా పేరుగాంచిన నాగార్జునసాగర్‌లో విదేశీ బౌద్ధ భిక్షువుల బృందం శనివారం సంప్రదాయ బద్ధంగా పిండపాత (భిక్షాట) కార్యక్రమాన్ని నిర్వహించింది. థాయిలాండ్, కంబోడియా దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు వర్షావాస కార్యక్రమంలో భాగంగా నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు వీధుల్లో భిక్షాటన చేపట్టారు. బౌద్ధ సంప్రదాయంలో భాగమైన పిండపాత కార్యక్రమాన్ని విదేశీ భిక్షువులు తమ దినచర్యలో భాగంగా నిర్వహించారు.ఈసందర్భంగా భిక్షువులు వీధుల గుండా వెళ్తుండగా స్థానిక ప్రజలు భక్తిశ్రద్ధలతో స్వచ్ఛందంగా తమకు తోచిన ఆహార పదార్థాలను దానం చేశారు.అంతేకాకుండా పలువురు స్థానికులు బౌద్ధ భిక్షువులను తమ నివాసాలకు స్వయంగా ఆహ్వానించి ఆహార పదార్థాలను స్వీకరించాలని కోరడం విశేషంగా నిలిచింది.ఈకార్యక్రమం స్థానికుల్లో బౌద్ధ సంప్రదాయాల పట్ల ఆసక్తిని,భక్తిభావాన్ని పెంపొందించింది.ఈ పిండపాత కార్యక్రమంలో బుద్ధవనం సిబ్బంది కూడా పాల్గొని విదేశీ బౌద్ధ భిక్షువులకు సహకరించారు.

## పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రిక్ వాహనాలనే వాడాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** భవిష్యత్తు అంతా ఎలక్ట్రిక్ వాహనాలదే అని సూర్యాపేట ఆర్‌డిఓ వేణుమాధవ రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎంజి రోడ్డులో మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన జెవిఆర్ ఈ మొబిలిటి ఎలక్ట్రికల్ బైక్ షోరూంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పెట్రోల్, డిజిల్ వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్, నిర్వహణ తక్కువ ఖర్చు ఉండటంతో వాహనదారులు ఎలక్ట్రికల్ వాహనాల వైపు మొగ్గుచూపుతున్నారని అన్నారు. ప్రపంచానికి పర్యావరణ కాలుష్యం ముప్పుగా మారిన నేపథ్యంలో విద్యుత్ వాహనాల వాడకం తప్పనిసరి అన్నారు. అనంతరం జెవిఆర్ ఈ బైక్స్ ఎండి శింగంశెట్టి నీరజ ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ తమ కంపెనీ ఎలక్ట్రిక్ బైక్స్‌ను సామాన్యులకు అందుబాటులో ఉండేలా పర్యావరణ హితమైన తక్కువ ఖర్చుతో కూడిన ప్రయాణాన్ని అందించే లక్ష్యంతో తయారు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జెవిఆర్, రామసాని శ్రీనివాస నాయుడు, దంతాల రాంబాబు, మాజీ ఎంపిపి లక్ష్మి రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, మౌనిక, రామకృష్ణ పాల్గొన్నారు.

## పంట వివరాలు నమోదు చేసుకోవాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలోని రైతులందరూ డిజిటల్ క్రాప్ సర్వేలో తమ పంట వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ తెలిపారు.వానాకాలం సీజన్‌లో జిల్లాలోని రైతులు పత్తి,వరి,కంది,ఉద్యానవన పంటలు,వర్షాభావ పరిస్థితుల వల్ల వేసిన ప్రత్యామ్నాయ పంటలు సాగు చేశారని తెలిపారు. దాదాపు అన్ని రకాల పంటలకు మద్దతు ధరతో పాటు వరి పంటలో ప్రభుత్వం సూచించిన 7 రకాల సన్న వడ్లను సాగు చేసిన వారికి క్వింటాల్ కు రూ.500 బోనస్ కూడా వర్తిస్తుందని పేర్కొన్నారు.ప్రస్తుత సీజన్‌లో ప్రతి సర్వే నంబర్ లో సాగు చేసిన పంటల వివరాలను డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా గ్రామాలలో నియమించబడిన సర్వేయర్లు ప్రతి చేనుకు వెళ్లి ఫోటో తీసి నమోదు చేస్తున్నారని తెలిపారు.ఈ సర్వేలో పంట నమోదుకు ఈనెల 30 వరకు ఉంటుందన్నారు.

# త్యాగాల చరిత్ర పోరాటాలకు మార్గదర్శి

సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** దేశంలో తెలంగాణ ప్రాంతంలో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నేటి తరానికి దిక్సూచి లాంటిదని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఇందిరాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట నాయకుల త్యాగాల చరిత్ర నేటి దోపిడికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు మార్గదర్శిగా నిలుపుకోవాలని కోరారు. నిజాం దోపిడికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం ప్రారంభమై దేశంలో రైతు కార్మికుల హక్కుల కోసం, సమానత్వం కోసం,. సాయుధ పోరాటం స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు, యల్లావుల రమేష్, సోమగాని సైదులు, ఇందిరాల వెంకటేశ్వర్లు, చెన్నగాని సైదులు, మామిడి వెంకయ్య, యల్లావుల ఉమా, జడ వెంకన్న, జక్కుల శ్రీనివాస్, మామిడి నర్సయ్య, జక్కుల రమేష్ పాల్గొన్నారు.

# 12,283 పెండింగ్ కేసులు పరిష్కారం



**ప్రజాపక్షం/నల్లగొండ :** లోక్ అదాలత్ కొరకు జిల్లా వ్యాప్తంగా 14 లోక్ అదాలత్ బెంచిలను ప్రజల సౌకర్యార్థం ఏర్పాటుచేసి 12 వేల 283 పెండింగ్ కేసులను పరిష్కరించడం జరిగిందని జిల్లా జడ్జి,జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ పి.వసంత్ తెలిపారు.శనివారం రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ వారి ఆదేశాలతో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నల్లగొండలోని కోర్ట్ ప్రాంగణాలలో జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ పి.వసంత్ మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్ కొరకు జిల్లా వ్యాప్తంగా 14 లోక్ అదాలత్ బెంచిలను ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈలోక్ అదాలత్ లో 33 సివిలు, 2813 క్రిమినలు, 68మోటార్ వాహన ప్రమాద భీమా కేసులు,9281ట్రాఫిక్ చలాన్ కాసులు,77 బ్యాంకు రికవరీ కేసులు 11 సైబర్ క్రైమ్ కేసులు, మొత్తం 12 వేల 283 పెండింగ్ ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరించబడ్డాయని తెలిపారు. ఇందులో ప్రమాద భీమా కేసులలో రూ.7,62,44,348 నష్టపరిహారం ఇప్పించగ,బ్యాంకు రికవరీ 6217000 ట్రాఫిక్ చలాన్ 31,32,180 సైబర్ క్రైమ్ కేసులలో రూ.117262 రికవరీ డబ్బులు ఇప్పించడం జరిగిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి హిమబిందు గొల్ల, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎ.సతీష్ కుమార్,బి.అశోక్ కుమార్, ఇతర న్యాయవాదులు,కక్షిదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బుల్లెట్ ట్రైన్ సాధనలో ప్రజలంతా భాగస్వాములవ్వాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని మాజీ మార్కెట్ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, సిటి టాలెంట్ పాఠశాల ప్రిన్సిపాల్ మురళి అన్నారు. శనివారం సిటి టాలెంట్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో బుల్లెట్ సాధనకు మద్ధతుగా ర్యాలీ నిర్వహించి అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద బుల్లెట్ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో మాట్లాడారు. వాణిజ్యపరంగా సూర్యాపేట అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బుల్లెట్ ట్రైన్ వస్తే అభివృద్ధి మరింత జరిగే అవకాశం ఉందన్నారు. శంషాబాద్ నుండి వయా సూర్యాపేట మీదుగా చెన్నైకి బుల్లెట్ ట్రైన్ మొదటగా అలైట్‌మెంట్ ఇచ్చిన దాన్ని రద్దు చేస్తూ సూర్యాపేట ప్రజలకు అన్యాయం చేయడం సరికాదన్నారు. సూర్యాపేట ప్రజల ఎన్నో ఏళ్ల ఆకాంక్షైన రైల్వే మార్గం వచ్చేలా ప్రభుత్వాలు సహకరించాలన్నారు. అంతకముందు ఆమ్ ఆద్మీని పార్టీ ఆధ్వర్యంలో రిలే దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిటి టాలెంట్ పూర్వ విద్యార్థులు అంతటి సాత్విక్ సాయి, సుంకరబోయిన ఉదయ్ కుమార్, వాస హర్ష, రేవంత్ బుల్లెట్ ట్రైన్ సాధన సమితి సభ్యులు కుంట్ల ధర్మార్జున్, చల్లమల్ల నరసింహ, సట్టు నాగయ్య, రాములు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఐక్యంగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మిర్యాలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు కొర్ర కృష్ణ కాంత్ నాయక్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు బాణావత్ సైదులు నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మూడ్ తిరుపతి నాయక్, వడ్త్య వెంకట్రామ్ నాయక్, కురూవా నాయక్ హాజరయ్యారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న డీఏ, పీఆర్‌సీ అమలు, సీపీఎస్ రద్దు తదితర ప్రధాన సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ నెల 18వ తేదీ లోగా ప్రభుత్వం నిర్దిష్టమైన ప్రకటన చేయాలని కోరారు.ఈహెచ్ఎస్ విషయంలో ఉపాధ్యాయుల నుంచి గత 6 నెలలుగా ప్రభుత్వం కాంట్రిబ్యూషన్ తీసుకుంటున్నప్పటికీ కార్డుల ద్వారా ఆసుపత్రుల్లో వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం పట్ల సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం తక్షణమే ఈహెచ్ఎస్ కార్డులను వినియోగించుకునే విధంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో క్యాష్‌లెస్ వైద్య సేవలకు అనుమతి కల్పించాలని డిమాండ్ చేసింది. అలాగే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతుల్లో అమలవుతున్న అడ్వకసీ విధానాన్ని రద్దు చేయాలని, పదోన్నతుల్లో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ధీరావత్ విద్యా చందర్, భాషా నాయక్, హను మ నాయక్, హరి నాయక్, నెహ్రూ నాయక్, సక్రు నాయక్, స్కైలాబ్ నాయక్, ధీరావత్ హరి, తులసి రామ్ నాయక్, శ్రీనివాస్ నాయక్, హేమానాయక్ పాల్గొన్నారు.

## తప్పని గ్యాస్ ఇబ్బందులు

చందంపేట మండలంలో

పనులు మానుకొని మరీ పడిగాపులు

**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలంలో గ్యాస్ వినియోగదారుల ఇబ్బందులు కొనసాగుతున్నాయని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ కోసం ఒక రోజు పనులను సైతం మానుకొని తిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వాపోతున్నారు. మండలానికి గ్యాస్ ఎప్పుడు వస్తుందో, రాదో తెలియని పరిస్థితులలో వినియోగదారులు అయోమయంలో ఉన్నారు. చాలా కాలంగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికి సంబంధిత అధికారులు, గ్యాస్ సరఫరా సంస్థలు తగిన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లోకి వారానికి ఒక రోజు గ్యాస్ వాహనం వస్తుందనే సమాచారం తెలిసిన వెంటనే చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సిలిండర్ల కోసం పరుగులు పెట్టాల్సి వస్తుందని అన్నారు.

ప్రభుత్వ ధర కంటే అధిక వసూళ్లు....గ్యాస్ సిలిండర్ కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, కొందరి వద్ద ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే రూ. 70 నుండి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నా దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు నిర్వహించి అధిక ధరలను కట్టడి చేయాలని వినియోగ దారులు కోరుతున్నారు. గ్యాస్ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు మండలంలో తీవ్ర స్థాయిలో వినిపిస్తున్నాయి. మండలానికి ప్రభుత్వం, ఆయిల్ సంస్థల ద్వారా గ్యాస్ సరఫరా అవుతున్నప్పటికి వినియోగదారులకు మాత్రం కొరత ఎందుకు ఏర్పడుతుందో అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చందంపేట మండలంలోని అన్ని గ్రామాలకు నిరంతరంగా, పాదర్శకంగా గ్యాస్ సరఫరా చేయడంతో పాటు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సిలిండర్లు ప్రజలకు అందించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు అధికారులను, గ్యాస్ సరఫరా దారులను కోరుతున్నారు.



# ఓటర్ల నమోదు సద్వినియోగం చేసుకోండి

అడిషనల్ కలెక్టర్ బి. హరిసింగ్





**ప్రజాపక్షం/నూతనకల్/తుంగతుర్తి/అర్వపల్లి/-నాగారం/మద్దిరాల :** కొత్తగా ఓటరు కార్డు కోసం దరఖాస్తు చేసుకునే వారు నేరుగా తమ సమీపంలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తులను సమర్పించవచ్చని అడిషనల్ కలెక్టర్ బి. హరిసింగ్ తెలిపారు. ఈ మేరకు ప్రతి పోలింగ్ బూత్‌లో సంబంధిత బిఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. శనివారం నూతన ఓటర్ల నమోదు ప్రక్రియతో పాటు, ఓటరు నమోదు సంబంధిత దిద్దుబాట్లు, నోటీసుల సమర్పణకు సంబంధించి నూతనకల్, మద్దిరాల, తుంగతుర్తి, నాగారం, అర్వపల్లి మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో సర్ ప్రక్రియ, కొత్త ఓటు నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఓటరు జాబితా నమోదు లేదా సవరణలకు సంబంధించి అధికారులు జారీ చేసిన నోటీసులకు ప్రతిస్పందించాలనుకునే వారు, తమ వద్ద ఉన్న సరైన ధృవీకరణ పత్రాలు తీసుకొచ్చి బిఎల్‌ఓలకు అందజేయాలని సూచించారు. డాక్యుమెంట్లను పరిశీలించిన అనంతరం ఓటరు జాబితాలో పేరు చేర్చేందుకు బిఎల్‌ఓలు పూర్తి సహకారం అందిస్తారని, దరఖాస్తుదారులకు ఏవైనా సందేహాలు ఉంటే అక్కడికక్కడే నివృత్తి చేస్తారని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల అధికారులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభించేలా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని మిర్యాలగూడ ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి సూచించారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని 81వ పోలింగ్ కేంద్రం పరిధిలో కొనసాగుతున్న నోటీసుల విచారణ పనులను తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. గీత మందిర్ ప్రాథమిక పాఠశాల వద్ద నిర్వహించిన ప్రత్యేక విచారణ శిబిరాన్ని సందర్శించి ఓటర్ల వివరాలను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వేగంగా పనులు పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. అనంతరం దామరచర్ల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన నోటీసుల విచారణ తీరును తహసీల్దార్ జవహర్‌లాల్‌తో కలిసి పరిశీలించారు. రాళ్లవాగు తండాలోని 213వ పోలింగ్ బూత్‌లో జరుగుతున్న విచారణ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి బిఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శ్రీనివాస్, జవహర్‌లాల్, కౌన్సిలర్ షబానా అయుబ్, బిఎల్‌ఓ సూపర్‌వైజర్ శ్రీనివాస్, బిఎల్‌ఓలు గౌసియా, విజయ, వెంకటేశ్వర్లు, జ్యోతి పాల్గొన్నారు.



## 'నా పల్లె-గుండ్రాంపల్లి' పాట రచయితకు ఘన సన్మానం

పోరాట చరిత్రను భావితరాలకు చాటిచెప్పిన

సాయి శశాంక్ గౌడ్ :ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/చిట్యాల:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను, గుండ్రాంపల్లి అమరవీరుల త్యాగాలను భావితరాలకు చాటిచెప్పేలా 'నా పల్లె గుండ్రాంపల్లి' పాటను రచించి,ఆలపించిన గాయకుడు,రచయిత గంగాపురం సాయి శశాంక్ గౌడ్‌ను సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ, నెల్లికంటి సత్యం శాలువాతో ఘనంగా సత్కరించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా గుండ్రాంపల్లిలోని స్థానిక అమరవీరుల స్థూపం వద్ద జరిగిన కార్యక్రమంలో సాయి శశాంక్ గౌడ్ రూపొందించిన పాట ద్వారా గ్రామ పోరాట చరిత్ర, అమరవీరుల త్యాగాలు,నాటి పోరాట స్ఫూర్తి ప్రజల్లోకి,ముఖ్యంగా భావితరాల్లోకి చేరుతున్నాయని అభినందించారు. చరిత్రను కేవలం పుస్తకాల్లో కాకుండా పాట రూపంలో ప్రజలకు చేరువ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులు,శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య,సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి జిల్లా సత్యం,సహాయ కార్యదర్శి కేతా రాజు అంజయ్య,సీమ అంజయ్య,సీనియర్ నాయకులు జిల్లా లక్ష్మయ్య, బొబ్బిల శంకర్ రెడ్డి,బొడిగె బక్కశెట్టి,పానుగుల శివ,జిల్లా లింగస్వామి,రెడపాక రవి,రత్నం లింగస్వామి, సర్గాల అశోక్,కసర్ల శంకర్,లింగస్వామి పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవ నిర్వాహకులకు అవగాహన



**ప్రజాపక్షం/నల్లగొండటౌన్ :** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గణేష్ ఉత్సవాలను నిర్వహించనున్న నిర్వాహకులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించాలని సూచించారు.ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని,పోలీస్ శాఖ సూచనలు మరియు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు స్పష్టంగా తెలిపారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను సజావుగా నిర్వహించేందుకు పోలీస్ శాఖకు నిర్వాహకులు సహకరించాలని కోరారు.శాంతిభద్రతలు,ప్రజా క్రమాన్ని కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి,టూ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆదిరెడ్డి,వన్ టౌన్ ఎస్ఐలు జి.ముత్తయ్య,జె.సైదులు, టూ టౌన్ ఎస్ఐసైదాబాబు,రూరల్ ఎస్ఐ శివ ప్రసాద్,మున్సిపల్ అధికారులు,విద్యుత్ శాఖ అధికారులు,శాంతి కమిటీ సభ్యులు,హిందూ, ముస్లిం,క్రిస్టియన్ మత పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ అందించాలని ఆందోళన

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను కనీసం 12 గంటల పాటు నిరంతరాయంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. మండలంలోని య ర్కారం సబ్‌స్టేషన్ ఎదుట రైతాంగంతో కలిసి బిఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం సూర్యాపేట జనగాం ప్రధాన రహదారిపై బైఠాయించి తమ డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలు చేశారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయని రైతు లు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి నాణ్యమైన 12 గంటల విద్యుత్ అందించాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించే వరకు వారికి అండగా నిలిచి పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. విద్యుత్ సరఫరా సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
ఆదివారం
13-09-2026
www.prajapaksham.in

'న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్తో భారీ అంచనాలు పెంచాయి.'

రీల్

# రామ్ పోతినేని సరసన సంయుక్త



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ప్రతిష్ఠాత్మక 23వ సినిమా లో ఎక్సయిటింగ్ స్టార్ చేరారు. టాలెంటెడ్ హీరోయిన్ సంయుక్త ఈ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్లో భాగమయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పోస్టర్ను విడుదల చేశారు. ఆమె ఈ సినిమాలో భాగమైన విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. ఆమె చేరికతో ఇప్పటికే ఆసక్తిని రేకెత్తిస్తున్న ఈ ప్రాజెక్ట్పై మరింత క్యూరియాసిటీ పెరిగింది. నియోనోయిర్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్గా తెరకెక్కిస్తున్నారు. రామ్ పోతినేని దర్శకుడిగా తొలిసారి పరిచయం అవుతున్నారు. తన విజన్ను తెరపైకి తీసుకొచ్చే బాధ్యతను ఆయనే పూర్తి గా తీసుకున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్పై కృష్ణ పోతినేని నిర్మిస్తున్నారు. ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ హైదరాబాద్లో శరవేగంగా జరుగుతోంది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమాటోగ్రాఫర్ తిరునావుక్కరసు (తిరు) విజువల్స్ అందిస్తున్నారు. సామ్ సిఎస్ సంగీతం సమకూరుస్తుండగా, ఎవిఎస్ ప్రకాశ్ ప్రొడక్షన్ డిజైనర్గా వ్యవహరిస్తున్నారు. విక్రమ్ మోర్, పీటర్ హెయిన్ యాక్షన్ సీక్వెన్స్లకు కొరియోగ్రఫీ చేస్తున్నారు.



# 18న వస్తున్న 'హనుమాన్ అంశ్'

బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించి, రికార్డ్ స్థాయి వసూళ్లు అందుకుంటున్న 'హనుమాన్ అంశ్' సినిమాను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్. ఆయన సమర్పణలో ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థ ఈ చిత్రాన్ని 18న తెలుగులో థియేట్రికల్ రిలీజ్ చేస్తోంది. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా జీవిత చరిత్ర ఆధారంగా దర్శకుడు డా. విశాల్ చతుర్వేది 'హనుమాన్ అంశ్' సినిమాను రూపొందించారు. రాగిని ఎస్, నమ్రత. జి. సింగ్, అనుప్రియ ఎ నగర్, డా.విశాల్ చతుర్వేది నిర్మించారు. 'హనుమాన్ అంశ్' సినిమాలో శోభిత్ శ్రీవాత్సవ, చందన్ ఆనంద్, పూర్ణిమ తివారి, వివాన్ షెగ్గే కీలక పాత్రల్లో నటించారు. గత నెల 7వ తేదీన బాలీవుడ్లో రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద 150 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లు సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తుండటం మరింతగా అంచనాలు పెంచుతోంది. తెలుగు ఆడియెన్స్ ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో తెలుగులో 'హనుమాన్ అంశ్' సినిమా మంచి విజయం సాధిస్తుందనే ఎక్స్ పెక్టేషన్స్ ఏర్పడుతున్నాయి.

# 'నీ పరిచయం' సాంగ్కు హ్యూజ్ రెస్పాన్స్



రాజ్ తరుణ్ హీరోగా నటిస్తున్న 'టార్టాయిస్' సినిమా మ్యూజికల్ గా బ్లాక్ బస్టర్ జర్నీ స్టార్ట్ చేసింది. ఈ సినిమా నుంచి ఇటీవల రిలీజ్ చేసిన 'నీ పరిచయం..' సాంగ్ మ్యూజిక్ లవర్స్ను అలరిస్తూ అతి తక్కువ టైమ్లో 10 మిలియన్స్కు పైగా డిజిటల్ వ్యూస్ సాధించింది. సినిమా నుంచి రిలీజ్ చేసిన తొలి పాటే ఇంత హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకోవడం 'టార్టాయిస్' మూవీపై అంచనాలు పెంచుతోంది. మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ బ్యూటిఫుల్ మెలొడీ ట్యూన్తో 'నీ పరిచయం..' సాంగ్ను కంపోజ్ చేసి మ్యాజిక్ చేశారు. ప్రేమికుల మనసుకు అద్దం పడుతూ, వారి ప్రేమ భావాలను ఈ పాటలో సాహిత్యంలో అందంగా వ్యక్తీకరించారు ఆస్కార్ విన్నింగ్ లిరిక్ రైటర్ చంద్రబోస్. సింగర్ చిన్మయి ఈ పాటను మళ్లీ మళ్లీ వినేలా పాడారు. విజువల్ ఫెస్ట్లా 'నీ పరిచయం..' గీత్ మెలోడీగా రూపొందిద్దుకుంది. ఇటీవల రాజ్ తరుణ్ చిత్రాల్లో మ్యూజికల్గా మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటున్న సినిమా 'టార్టాయిస్' అనే చెప్పుకోవచ్చు. 'టార్టాయిస్' ఈ చిత్రంలో అమృత చౌదరి, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'టార్టాయిస్' సినిమాను ఎస్ కె గోల్డెన్ ఆర్ట్స్, ప్రతిష్ఠ ఎంటర్టైన్మెంట్, ఎస్ఎవిఎల్ క్రియేషన్స్ బ్యానర్స్ పై విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. ఈ సినిమాను సస్పెన్స్, డ్రామా కలిసిన ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు రిత్విక్ కుమార్ రూపొందిస్తున్నారు. మానస కుమార్ కో-ప్రొడ్యూసర్గా వ్యవహరిస్తున్నారు. ఇటీవల రిలీజ్ చేసిన ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ అందరి దృష్టినీ ఆకర్షించింది.

# మరుగున పడ్డ జాతి కథ

## 'ది ప్యారడైజ్' దర్శకుడు శ్రీకాంత్ ఓదెల

న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్తో భారీ అంచనాలు పెంచాయి. ఈ చిత్రం 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్లో నాని మాట్లాడుతూ సెప్టెంబర్ 24న వస్తున్నాం. ఆయా షేర్, ఏష నాగుల కట్ట, గ్లింప్స్, టీజర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాకి ఒక డెస్టినీ ఉంది అనే బలమైన నమ్మకం వచ్చింది. సెప్టెంబర్ 24న ఆడియన్స్కి ఒక అద్భుతమైన అనుభూతిని అందించడానికి నిద్రాహారాలు లేకుండా పని చేస్తున్నాం. మీరందరూ చాలా అంచనాలతో థియేటర్కి వస్తారని తెలుసు. మేమందరం దానికోసం కష్టపడుతున్నాం అన్నాడు.



డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ సినిమా మొదలైనప్పటి నుంచి మీడియా వారు చాలా సపోర్ట్ చేస్తున్నారు. సినిమా రిలీజ్ అయ్యే వరకు ఈ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. సినిమా నుంచి ఏది వచ్చినా సరే ఆడియన్స్లో బ్లాస్ట్ అవుతుంది. సాంగ్స్, టీజర్ను చాలా పాజిటివ్గా తీసుకుంటున్నారు. నా 'సినిమా' అనేకంటే 'జనం సినిమా' అనడం కరెక్ట్ అని నాకు అనిపిస్తుంది. అంతలా ఈ కంటెంట్ను ఆదరించారు. ఇది రెవల్యూషనరీ ఎమోషనల్ ఫిలిం. ఒక తల్లీ, కొడుకుల కథ. ఒక సవారీ జాతి కథ. పుట్టుక మనది, చావు మనది, బతుకంతా దేశానిది అని కాళోజీ గ మాట ఉంటుంది. ఆ దేశం కోసం కొట్లాడిన వారిని ఆ దేశంతోనే సంబంధం లేదు అంటే.. వాళ్లందరూ ఏం చేయాలో తెలియక, మరుగునపడ్డ జాతి కథ. 'ది ప్యారడైజ్' కథ ఏమిటో అవగాహన కోసం ఇది చెప్తున్నాను అన్నాడు. ఈ ప్రెస్ మీట్లో నిర్మాత సుధాకర్ కూడా పాల్గొన్నారు.

# ఆదర్శ కుటుంబం– AK47' టీజర్ విడుదల

విక్టరీ వెంకటేష్, డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్లో తెరకెక్కుతున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం – AK47' టీజర్ విడుదలైంది. కుటుంబ నేపథ్యంతో కూడిన వినోదం, యాక్షన్, చమత్కారమైన సంభాషణలతో టీజర్ ఆద్యంతం ఆకట్టుకునేలా ఉంది. మధ్యతరగతి కుటుంబం.. ఆ కుటుంబంలో చోటుచేసుకునే సరదా సంఘటనలు.. వాటి చుట్టూ అల్లుకున్న వినోదం.. ఇలా 'ఆదర్శ కుటుంబం – AK47' ప్రపంచాన్ని టీజర్ ఆసక్తికరంగా పరిచయం చేసింది. వెంకటేష్ తనదైన కామెడీ టైమింగ్తో అలరించగా, త్రివిక్రమ్ శ్రీనివాస్ మార్క్ చమత్కారమైన రచన, పదునైన సంభాషణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అదే సమయంలో టీజర్ లోని ఎనర్జిటిక్ యాక్షన్ సన్నివేశాలు సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో నారా రోహిత్, నివేదా పేతురాజ్, యువిన, రాజ్ ప్రజ్వల్, రావు రమేష్, సత్య, బ్రహ్మాజీ, ఉదయ్బీర్ సంధు, వెన్నెల కిషోర్, రఘుబాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం థమన్ ఎస్, ప్రొడక్షన్ డిజైన్ ఎ.ఎస్. ప్రకాష్, ఎడిటింగ్ నవీన్ నూలి, సినిమాటోగ్రఫీ రవి కె. చంద్రన్.హారిక అండ్ హాసిని క్రియేషన్స్ ప్రతిష్ఠాత్మక బ్యానర్పై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆదర్శ కుటుంబం – AK47' అక్టోబర్ 2, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



# ఆదిలాబాద్ ఎయిర్పోర్టు పనుల్లో పురోగతి



కేంద్ర బొగ్గుగనుల శాఖమంత్రి జి. కిషన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతమయ్యాయని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ఎయిర్పోర్ట్ పురోగతిపై న్యూఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆదిలాబాద్లో జాయింట్ యూజర్ ఎయిర్ఫీల్డ్ (జెయుఎ) అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు వెల్లడించారు. ప్రాజెక్టును మిషన్ మోడ్లో ముందుకు తీసుకెళ్లేందుకు రక్షణ, పౌర విమానయాన శాఖలు, తెలంగాణ ప్రభుత్వం నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని, డిపిఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పనను వేగవంతం చేయాలని నిర్ణయించారు. రన్ వే నిర్మాణం కోసం ఇండియన్ ఎయిర్ఫోర్స్ వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాలు సేకరించనుందని, ఇక్కడ ఎయిర్ఫోర్స్ శిక్షణా కేంద్రాలతో పాటు సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

# జాతీయ లోక్ అదాలత్కు భారీ స్పందన

# 4.20 లక్షల కేసుల పరిష్కారం

ప్రజాపక్షం/హైదరాబాద్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా శనివారం నిర్వహించిన మూడో జాతీయ లోక్అదాలత్లో మొత్తం 4,20,626 కేసులు పరిష్కారమయ్యాయి. ఇందులో 2,78,335 ప్రీ లిటిగేషన్ కేసులు, 1,40,565 పెండింగ్ కోర్టు కేసులు ఉన్నాయి. వినియోగదారుల, కార్మిక వివాదాలు సహా వివిధ రకాల కేసులను పరస్పర అంగీకారం, రాజీ, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 340 లోక్అదాలత్ బెంచ్లు ఏర్పాటు చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. కక్షిదారులకు లోక్అదాలత్ ద్వారా వివాదాలను వేగంగా, స్నేహపూర్వకంగా, తక్కువ ఖర్చుతో పరిష్కరించుకునే అవకాశంపై న్యాయ సేవా సంస్థలు అవగాహన కల్పించాయి. లోక్అదాలత్లో జరిగిన పరిష్కారాల ఫలితంగా వివిధ కేసుల్లో లబ్ధిదారులకు మొత్తం రూ. 266 కోట్ల పరిహారం అందింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ ప్యాట్రన్ ఇన్చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ మార్గదర్శకత్వంలో, రాష్ట్ర న్యాయ సేవా సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి. సామ్ కోషీ, హైకోర్టు న్యాయమూర్తి, హైకోర్టు న్యాయ సేవల కమిటీ చైర్మన్ జస్టిస్ కె. లక్ష్మ ణ్ నేతృత్వంలో మూడో జాతీయ లోక్ అదాలత్ను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు.

**హైకోర్టులో 182 కేసుల పరిష్కారం**

తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో పెండింగ్లో ఉన్న కేసుల పరిష్కారం కోసం రెండు లోక్అదాలత్ బెంచ్లు ఏర్పాటు చేశారు. జస్టిస్ కె. సుజన, జస్టిస్ నర్సింగ్ రావు నందికొండ నేతృత్వంలోని ఈ బెంచ్లలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు, బీమా సంస్థలు, ఇతర భాగస్వాముల సహకారంతో హైకోర్టులో పెండింగ్లో ఉన్న 182 కేసులను ఇరుపక్షాలు ఏకాభిప్రాయంతో పరిష్కరించుకున్నాయి. వీటిలో మోటార్ ప్రమాద పరిహారం కేసులు తదితర కేసుల పరిష్కారం ద్వారా క్లెయిమ్దారులకు మొత్తం రూ. 14,81,00,000 పరిహారం అందింది. లోక్అదాలత్లో పరిష్కారమైన ముఖ్యమైన కేసుల్లో ఒకటి 06.07.2016న జరిగిన ట్రక్కు ప్రమాదానికి సంబంధించినది. ఏపీ 05 టీయూ 9198 నంబరు గల ట్రక్కు ప్రమాదంలో ఎం. రవి కుమార్ మృతిచెందగా, ఆయన భార్య ఎం. సునీత, ఇతర కుటుంబ సభ్యులు పరిహారం కోసం మోటార్ ప్రమాద క్లెయిమ్ల ట్రైబ్యునల్ను ఆశ్రయించారు. రూ.10 కోట్ల పరిహారం కోరుతూ దాఖలైన క్లెయిమ్లో మధ్యవర్తిత్వం, చర్చల అనంతరం శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ రూ.5 కోట్లు చెల్లించేందుకు అంగీకరించింది. చీఫ్ జడ్జి, సిటీ సివిల్ కోర్టు, హైదరాబాద్ సమక్షంలో పరిహారం మొత్తానికి సంబంధించిన చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. మరో రోడ్డు ప్రమాద కేసులో గోపాల్నాథ్ పరిధిలో ట్రక్కు ఢీకొనడంతో మృతిచెందిన ఎం. నరేంద్ర కుమార్ కుటుంబానికి రూ.1,75,000 చెల్లించేందుకు శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ అంగీకరించి చెక్కును అందజేసింది.

# స్వాతంత్ర్య సమరయోధుడు పి.ఎన్. మూర్తి జీవిత చరిత్ర 'వారధి' ఆవిష్కరణ



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ స్వాతంత్ర్య పోరాట చరిత్ర, రజాకారులపై తిరుగుబాటు, సాయుధ పోరాటం, స్వాతంత్ర్యానంతర పరిపాలనకు సంబంధించిన అనేక ఆసక్తికర అంశాలను ఆవిష్కరించే 'వారధి' పుస్తకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి శనివారం ఆవిష్కరించారు. హైదరాబాద్లోని తెలంగాణ శాసనసభ కమిటీ హాల్లో జరిగిన కార్యక్రమంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ పాల్గొన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, కాంగ్రెస్ నాయకుడు పి.ఎన్.మూర్తి జీవిత చరిత్ర ఆధారంగా ఆయన కుమారుడు పూర్ణబోధ శ్రీకాంత్ రచించిన ఈ పుస్తకాన్ని రాజమండ్రికి చెందిన రచయిత శ్రీపాద శ్రీనివాస్ కూర్పు చేశారు. పి.ఎన్.మూర్తి శతజయంతి సందర్భంగా 'వారధి'ని రూపొందించారు. పి.ఎన్. మూర్తి 1952–53లో హైదరాబాద్ రాష్ట్రంలో, 1953–56లో ఆంధ్ర రాష్ట్రంలో, అనంతరం 1956 నుంచి 1996 వరకు కాంగ్రెస్ పార్టీకి సుమారు 44 ఏళ్లపాటు సేవలందించినట్లు పుస్తకంలో వివరించారు. మూర్తి సేవలను స్మరించుకుంటూ చారిత్రక ఘట్టాలను ఇందులో పొందుపరిచారు. పూర్ణబోధ శ్రీకాంత్ కూడా మూడు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ శాసనసభాపక్షం కార్యాలయ కార్యదర్శిగా సేవలందించారు. సిఎల్పి నేత పి.జనార్ధన్రెడ్డి హయాం నుంచి ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి వరకు కాంగ్రెస్ శాసనసభా పక్షం కార్యాలయ కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయన ప్రస్తుతం తెలంగాణ అసెంబ్లీ ఒఎస్డిగా పనిచేస్తున్నారు.

# పైప్లైన్ మూసివేత

(మొదటి పేజీ తరువాయి)

1200 కి.మీ (745మైళ్ళు) నిడివిగల భారీ చమురుపైపులైను నిర్మించింది. హోర్ముజ్ జలసంధి మూతపడినప్పటికీ అనేక దేశాలకు ఈ పైపులైన్ ద్వారా నేరుగా ఎగుమతులు చేయడానికి వీలుగా చమురు ఇన్నాళ్ళూ రవాణా జరుగుతూ వస్తోంది. అమెరికా–ఇరాన్ మధ్య యుద్ధం ఏడవనెలలోకి ప్రవేశించిన తర్వాత హౌతీ ఉగ్రవాదులు విజయపథంలో ముందుకు దూసుకుపోతున్న తరుణంలో ఈ పైపులైను మూత పడింది. ఇప్పుడు ఈ చమురు పైపులైను మూత పడటంతో అతి పెద్ద సమస్యకు తెరలేచింది. సౌదీ అరేబియాపై తమ భూభాగంనుండే దాడులు జరిగాయని ఇరాక్ పాలకులు కూడా అంగీకరించారు. తమ పొరుగున తూర్పు–పశ్చిమ సౌదీ అరేబియా చమురు పైపులైన్లపై తమ దేశంలోని రాష్ట్రాల నుండే డ్రోన్ దాడులు జరిగాయని ఇరాన్ అంగీకరించి ఒక సైనిక కమాండర్ను కూడా పదవి నుండి తొలగించింది.

ఈ విషయంపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేసింది. హౌతీలు ఈ తీర ప్రాంతాలను తమ అధీనంలోకి తెచ్చుకోవడంతో యుద్ధంలో ఇరాన్కు మరింత ఆధిపత్యం వచ్చింది.చమురు రవాణాను స్తంభింపజేయడానికి మరో కొత్త వార్ఫ్రంట్కు తెరలేచింది. ఇప్పటివరకూ చమురు రవాణాకోసం సౌదీ అరేబియాకు బాబ్ ఎల్మండ్ ద్వీప ప్రాంతం ఒక ప్రత్యామ్నాయ రవాణామార్గంగా ఉపయోగపడుతూ వచ్చింది.ఇరాన్ అనుకూల హౌతీ తిరుగుబాటు సైన్యాలు యెమెన్ ప్రభుత్వ సైన్యాలను తరిమికొట్టి ఆ ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నాయి. యెమెన్ ప్రభుత్వం సౌదీఅరేబియా పాలకులకు అనుకూలంగా ఉంది.దీంతో అంటే ఇరాన్కు చెందిన అత్యున్నతస్థాయి రాయబారులు,ఇటు సౌదీ అరేబియాకు చెందిన అత్యున్నత స్థాయి రాయబారులు ఈ సమస్య పరిష్కారంకోసం చర్చల ద్వారా అనుసంధానమై ఒక అంగీకారానికి వచ్చే ప్రయత్నాలు కూడా ప్రారంభమయ్యాయి.మోఖా ఓడరేవును రెండు రోజుల క్రితమే హౌతీలు స్వాధీనం చేసుకున్నారు. ఈ దశలోనే హౌతీలు–సౌదీ అనుకూల యెమెన్ ప్రభుత్వ దళాలకు మధ్య హోరాహోరీ పోరాటంలో వందలమంది ఇటీవలి వారాల్లో హతులయ్యారు. ఆ తర్వాత బాల్ అల్ మందాబ్ ద్వీపంవైపు దూసుకుపోయారు. దీనివల్ల ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలను కూడా హౌతీలు స్తంభింపజేయగలుగుతారు. దీంతో ప్రపంచ చమురు సరఫరా వ్యవస్థకు మరింత తీవ్ర ప్రమాదం పెరుగుతుంది.ప్రస్తుతంప్రామాణిక ప్రపంచ ముడి చమురు ఒక బ్యారెల్ ధర 106 డాలర్లకు పైగా పెరగడం తీవ్ర అనిశ్చిత పరిస్థితికి తార్కాణంగా మారింది.

# టెర్రరిజాన్ని నిర్వచించే అర్హత అమెరికాకు లేదు: ఇరాన్

టెర్రరిజాన్ని నిర్వచించే అర్హత అమెరికాకు లేదని ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ హెచ్చరించారు. ప్రపంచ ఉగ్రవాదానికి శిక్షణఇచ్చే నాయకుడుస్థానంలో అమెరికా ఉందని,ఉగ్రవాదాన్ని అమెరికా ప్రోత్సహిస్తోందని, అందువల్ల ఉగ్రవాదానికి నిర్వచనం ఇచ్చే అర్హత ఆ దేశానికి లేదని బఖాయీ అన్నారు.ఎక్స్వేదికగా శనివారం ఈ మేరకు ఆయన ఒక పోస్టింగ్ పెట్టారు. సెప్టెంబరు 11వ తేదీన అమెరికా ట్విన్టవర్స్పై అల్ఖైదా దాడుల సంస్మరణ వార్షికోత్సవం సందర్భంగా అమెరికా యుద్ధమంత్రి పీట్ హెగ్సెత్ చేసిన వ్యాఖ్యలను బఖాయీ ఖండించారు. ఇరాన్పై చట్టవిరుద్ధమైన యుద్ధాన్ని సమర్థించుకోవడానికి ఈ వార్షికోత్సవాన్ని అమెరికా ఒక పావుగా ఉపయోగించుకుంటున్నదని విమర్శించారు. ఆయన ప్రసంగ కథనంలోనే వైరుధ్యాలున్నాయన్నారు. "మీరు పిరికిపంద హత్యలు చేస్తూ,ప్రజల ప్రాణాలకు తీవ్ర హాని కలిగిస్తూ,అదేసమయంలో ఉగ్రవాదాన్ని నిర్వచించడానికి, ఎవరికి హింస చేయడానికి అర్హత ఉందనే విషయాన్ని నిర్వచించడానికి ఎలాంటి అర్హతా ఉండదన్నారు. ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో అమాయకులైన ప్రజలను అమెరికా హతమార్చిందని,విస్తృతమైన విధ్వంసానికి కారణమైందని విమర్శించారు.

# వసూళ్లుండవు

(మొదటి పేజీ తరువాయి)

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జిఎస్డిపి 10.7 శాతం వృద్ధితో రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని, ఇందులో క్యూర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలే సింహభాగం భాగస్వామ్యం వహిస్తున్నాయని వివరించారు. చార్మినార్ నుంచి హైటెక్ సిటీ వరకు, మూసీ తీరం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు ఎదిగిన హైదరాబాద్ ఐటి, ఫార్మా, లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జిసిసి) ప్రధాన నిలయంగా మారిందన్నారు. నగరం ప్రస్తుతం ఔటర్ రింగ్ రోడ్డు వరకు వేగంగా విస్తరించినందున, రాబోయే రోజుల్లో తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, ప్రజా రవాణా, ట్రాఫిక్ నివారణ, చెత్త నిర్వహణ, వరదల నియంత్రణ వంటి కీలక శాఖలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు ఓఆర్ఆర్ పరిధికి ప్రత్యేక కార్యనిర్వాహక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. సిఎం అధ్యక్షతన అత్యున్నత పాలక మండలి పని చేస్తుందని, కాలం చెల్లిన నిబంధనలను తొలగిస్తూ 5 భాగాలు, 43 చాప్టర్లు, 319 సెక్షన్లు, 9 షెడ్యూళ్లతో ఈ బిల్లును ప్రవేశపెట్టామని, జిహెచ్ఎంసిని హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి అనే ట్రై కార్పొరేషన్లుగా విభజించి, ఒకే చట్టం కింద సమర్థవంతమైన సేవలు అందిస్తామని వివరించారు. హైదరాబాద్ను అంతర్జాతీయ స్థాయి బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ లక్ష్యమన్నారు. మూసీ పునరుజ్జీవం తొలి దశకు రూ.7,345.12 కోట్లతో అనుమతులు ఇచ్చామని, 20 టిఎంసిల గోదావరి జలాలను నగరానికి తరలించే చర్యలు ముమ్మరం చేశామన్నారు. రవాణా వ్యవస్థను ఆధునీకరించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తూ ప్రజా జీవన ప్రమాణాలను పెంచడానికే ఈ క్యూర్ చట్టానికి శ్రీకారం చుట్టామన్నారు. అనుమతులకు మించి చేపట్టిన నిర్మాణాలకు రిజిస్ట్రేషన్ చేయబోమని గత ప్రభుత్వంలో జారీ చేసిన జిఒను ప్రస్తుత క్యూర్ బిల్లులోకూడా అమలు చేస్తున్నామని వివరించారు. కార్పొరేషన్ల పాలక మండలికి ఉన్న అధికారాలను తొలగించబోమని, సిఎం అధ్యక్షతన అత్యుతన్న సలహా పాలకమండలి ఉంటుందని, ఈ మండలి కేవలం పాలసీకి సంబంధించిన అంశాలకే పరిమితం అవుతుందని, కార్పొరేషన్ల అధికారాలలో జోక్యం చేసుకోబోదన్నారు.

ప్రస్తుతం ఉన్న యూనిట్ ధరను రద్దు చేసి, ఆ స్థానంలో రాష్ట్ర వ్యాప్తంగా అమలులో ఉన్న క్యాపిటల్ విలువ ఆధారిత ఆస్తిపన్ను విధానాన్ని అమలు చేయనున్నామన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న 375 చదరపు అడుగులకు కనీసం పన్ను రూ. 101 యథావిధిగానే కొనసాగుతుందన్నారు.

## హైదరాబాద్ ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేయండి

హైదరాబాద్కు చెందిన ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసిన సలహాలు, సూచనలు తీసుకోవాలని సభ్యులు దానం నాగేందర్, రాజాసింగ్ ప్రభుత్వాన్ని కోరారు.

ఈ బిల్లు ఆత్మహత్య సదృశ్య మే..: బిజెపి సభ్యులు పాల్వాయి హరీశ్బాబు మాట్లాడుతూ క్యూర్ బిల్లు వల్ల ప్రజలపై న ఆస్తిపన్నుల భారం పడుతుందని, ఈ బిల్లును ప్రవేశపెట్టడమంటేనే ఆత్మహత్యసదృశ్యమ ని అన్నారు. స్థానిక సంస్థల అధికారాలకు గొడ్డలిపెట్టులాంటిదని ఆరోపించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com